నమస్తే తెలంగాణ
తాజా వార్తలు,
ఈ పేపర్ కోసం
ntnews.com
చూడండి.




# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక







ఆదివారం 29.03.2020
• సంపుటి 9 • సంచిక 274 • వెల. రూ. 8.00

కరీంనగర్
పేజీలు : 10 + 8
32 పేజీల ఆదివారం అనుబంధం

పంచమి

సూర్యోదయం: ఉదయం 6.11, సూర్యాస్తమయం: సాయంత్రం 6.23, శార్వరి సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం పంచమి అర్ధరాత్రి 2.02 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: కృత్తిక మధ్యాహ్నం 3.18 వరకు, తదుపరి రోహిణి, అమృతఘడియలు: మధ్యాహ్నం 12.40 నుంచి 2.24 వరకు, రాహుకాలం: సాయంత్రం 4.52 నుంచి 6.23 వరకు, దుర్ముహూర్తం: సాయంత్రం 4.45 నుంచి 5.34 వరకు, వర్జ్యం: లేదు,

PUBLISHED FROM KARIMNAGAR • HYDERABAD • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline


## విరాళాలు ఇవ్వండి

- దేశ ప్రజలకు మోదీ పిలుపు
- కొవిడ్ -19పై పోరుకు ప్రత్యేక నిధి ఏర్పాటు


5



## కరోనా కట్టడికి టాటా సాయం
## 1500 కోట్ల రూపాయలు

**కరోనా** వైరస్ దెబ్బకు అల్లాడిపోతున్న భారతావని కష్టాలను చూసి చలించిన టాటాలు.. భారీ సాయాన్ని ప్రకటించారు. రూ.1,500 కోట్లతో ముందుకొచ్చారు. టాటా సన్స్ రూ.1,000 కోట్లు, టాటా ట్రస్ట్స్ రూ.500 కోట్ల చొప్పున ఇస్తూ కరోనాపై పోరుకు బాసటగా నిలిచాయి. మానవ జాతికి మునుపెన్నడూ లేని కష్టం వచ్చిందని, దీన్ని అంతా కలిసి ఎదుర్కొందామని ఈ సందర్భంగా రతన్ టాటా పిలుపునిచ్చారు.

10



## అక్షయ్‌కుమార్ 25 కోట్ల విరాళం

- కరోనా నియంత్రణకు యాక్షన్‌కింగ్ భారీ ఆర్థిక సాయం
- ప్రాణముంటేనే ప్రపంచముంటుంది
- జీవితాన్ని కాపాడే యజ్ఞంలో భాగస్వాములవుదాం
- భావోద్వేగ ట్వీట్ చేసిన సినీనటుడు

5

## కరోనాకు ఒకరు బలి

- తెలంగాణలో తొలి మరణం
- ఈ నెల 14న ఢిల్లీ వెళ్లిన వృద్ధుడు
- 17న తిరిగి హైదరాబాద్‌కు రాక
- 19న జ్వరంతో ప్రైవేట్ దవాఖానకు
- 20న కార్పొరేట్ దవాఖానకు.. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారణ
- గాంధీలో మృతదేహానికి పరీక్షలు
- కొవిడ్ పాజిటివ్‌గా గుర్తింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ ఖైరతాబాద్: రాష్ట్రంలో తొలి కరోనా మరణం నమోదైంది. ఈ విషయం అతను చనిపోయిన తర్వాత బయటపడింది. 74 ఏండ్ల వృద్ధుడొకరు కరోనా లక్షణాలతో మృతి చెందినట్టు ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ శనివారం ప్రకటించారు. ఆ వృద్ధుడి భార్య, కుమారుడిని హోం క్వారంటైన్‌లో ఉంచినట్టు చెప్పారు. శనివారం ఆయన కొవిడ్- 19 కమాండ్ కంట్రోల్ కేంద్రంలో మీడియాకు వివరాలు వెల్లడించారు. ఖైరతాబాద్‌లోని ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్‌లో నివసించే ఆ వృద్ధుడు ఈ నెల 14వ తేదీన మతపరమైన కార్యక్రమం కోసం ఢిల్లీ వెళ్లాడు. 17న తిరిగి హైదరాబాద్ వచ్చాడు. ఆయనకు ఈ నెల 19వ తేదీన జ్వరం, దగ్గు, ఆయాసం వచ్చింది. దీంతో కుటుంబసభ్యులు స్థానికంగా ఓ ప్రైవేట్ దవాఖానలో చూపించారు. ఆయన అపస్మారక స్థితికి చేరుకోవడంతో 20వ తేదీన సమీపంలోని మరో కార్పొరేట్ దవాఖానకు తరలించారు. అయితే, ఆయన అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ప్రకటించారు. వ్యాధి లక్షణాలపై అనుమానంతో వైద్యులు సైఫాబాద్ పోలీసులకు సమాచారం అందించగా.. మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించారు. గాంధీ వైద్యులు మృతుడి నమూనాలను పరీక్షించగా.. ఆయనకు కరోనా పాజిటివ్ ఉన్నట్టు తేలిందని మంత్రి ఈటల వివరించారు. ఈ నేపథ్యంలో వివిధ దవాఖానల్లో ఇటీవల మరణించినవారి వివరాలను ఇవ్వాలని యాజమాన్యాలను కోరినట్టు తెలిపారు. ఖైరతాబాద్‌లోని ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్‌లో నివసించే వృద్ధుడు కరోనా వ్యాధితో మృతిచెందిన నేపథ్యంలో ఆ ప్రాంతంలో భయాందోళనలు నెలకొన్నాయి. రెండంతస్థులున్న

మిగతా 2వ పేజీలో

# వదంతులు వద్దు

## రెడ్, గ్రీన్ జోన్లు అంటూ ఏమీలేవు.. సర్కారు దవాఖానల్లోనే కరోనా వైద్యసేవలు

## గాంధీ, కింగ్ కోఠి, ఛాతి దవాఖానలు సిద్ధం.. రాష్ట్రంలో 67కు చేరిన పాజిటివ్ కేసులు

- అందులో పది మందికి నెగెటివ్‌గా నిర్ధారణ
- మరోసారి నెగెటివ్ వస్తే వారిని డిశ్చార్జ్ చేస్తాం
- వెంటిలేటర్‌పై ఇద్దరు పాజిటివ్ బాధితులు
- కొవిడ్ - 19 గాలితో వ్యాపించేది కాదు
- పాజిటివ్ వ్యక్తులకు దగ్గరగా ఉన్నవారికే సోకింది
- వైద్యారోగ్య సిబ్బందికి షిఫ్టులవారీగా విధులు
- వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్
- గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్ పరిశీలన



అసోంలోని కామాఖ్య రైల్వేస్టేషన్‌లో రైలు బోగీని ఐసొలేషన్ వార్డుగా మార్చిన రైల్వేశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్ విషయంలో నెల రోజులుగా నిత్యం బులెటిన్ ద్వారా సమాచారం అందజేస్తున్నప్పటికీ సోషల్‌మీడియా, కొన్ని న్యూస్ చానళ్లలో కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ప్రచారాలు చేయడం మంచి పద్ధతి కాదని, ఈ దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని పిలుపునిచ్చారు. ప్రస్తుత గంభీరమైన పరిస్థితుల్లో ప్రజలకు ధైర్యాన్ని కలిగించే సమాచారాన్ని మీడియా అందించాలని సూచించారు. శనివారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఆయన పరిశీలించారు. అక్కడి భవన సముదాయాల్లో ఐసొలేషన్, క్వారంటైన్ సేవల కోసం కల్పించాల్సిన వసతులపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కోఠిలోని కొవిడ్- 19 కమాండ్ కంట్రోల్ కేంద్రంలో సమీక్ష నిర్వహించారు. ఆయా సందర్భాల్లో మంత్రి ఈటల మీడియాతో మాట్లాడుతూ.. విదేశాల్లో కరోనా వ్యాప్తిని, దేశంలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్.. ఉన్నతస్థాయి చర్చల అనంతరం సాధ్యమైనంత మేర ప్రభుత్వ దవాఖానల్లోనే వైద్య సేవలు అందించాలని నిర్ణయించి మీడియా ద్వారా ప్రకటించారన్నారు. దానికి అనుగుణంగా కరోనా పాజిటివ్ వ్యక్తులకు

మిగతా 2వ పేజీలో



రాష్ట్రంలో రెడ్, గ్రీన్ జోన్లు అంటూ ఏమీలేవు.. కొందరు సైకోలు, శాడిస్టులు పెట్టే ఇలాంటి తప్పుడు వార్తలను నమ్మొద్దు.. ఈ వైరస్ ఇతర దేశాల నుంచి వచ్చిందే, ఇది గాలితో వ్యాపించేది కాదు. పాజిటివ్ వ్యక్తుల ద్వారా సన్నిహితంగా మెలిగిన కొందరికి మాత్రమే సోకింది. మన రాష్ట్రంలో ఇప్పటి వరకు ఎక్కడ కూడా కరోనా పేషెంట్‌తో కలువనివారికి.. సన్నిహితంగా మెలగనివారికి సోకలేదు.

\- మంత్రి ఈటల రాజేందర్

## మరో 8 మందికి పాజిటివ్

విదేశాల నుంచి తెలంగాణకు వచ్చినవారికే కాకుండా.. వారిద్వారా స్థానికులకు కూడా పాజిటివ్‌గా నమోదవుతున్నది. శనివారం కొత్తగా 8 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్టు వైద్యారోగ్యశాఖ బులెటిన్ విడుదలచేసింది. దీంతో రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 67కు చేరుకోగా, అందులో ఒకరు పూర్తిగా కోలుకొని డిశ్చార్జ్ అయినట్టు పేర్కొన్నది.


| వివరాలు | శనివారం | మొత్తం |
|---|---|---|
| పాజిటివ్ కేసులు | 8 | 67 |
| వైద్యం పొందుతున్నవారు | 7 | 65 |
| డిశ్చార్జ్ అయినవారు | 0 | 1 |
| మరణం (చనిపోయాక నిర్ధారణ) | 1 | 1 |



## రెండువారాలు కీలకం

- వైరస్ పరివర్తనలో మార్పులేదు
- నిమ్స్ పల్మనాలజిస్ట్ విభాగం అధిపతి డాక్టర్ పరంజ్యోతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్ పరివర్తనలో ఎలాంటి మార్పులేదని, అది స్థిరంగా ఉందని నిమ్స్ పల్మనాలజిస్ట్ విభాగం అధిపతి డాక్టర్ పరంజ్యోతి చెప్పారు. సాధారణంగా వైరస్‌లు జన్యు రూపాన్ని మార్చుకుంటాయని, కరోనా మాత్రం ఇంకా ఆ స్థితికి చేరుకోలేదని తెలిపారు. డాక్టర్ పరంజ్యోతి శనివారం నమస్తే తెలంగాణతో మాట్లాడుతూ.. వైరస్‌లో మార్పులు జరుగుతున్నట్లు ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లభించలేదని చెప్పారు. కరోనా వ్యాప్తి నివారణకు వచ్చే రెండువారాలు అత్యంత కీలకమని అన్నారు. ఇది వైరస్ ఇంక్యుబేషన్ పీరియడ్ కావటం వల్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. నిర్ణీత దూరం పాటించడమే అత్యుత్తమ మార్గమని పేర్కొన్నారు. ఇతర దేశాలతో పోల్చితే మన దేశంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. వైరస్ వ్యాప్తి నివారణలో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు.



## కరోనా కట్టడిలో తెలంగాణ భేష్

- కేంద్రంకంటే ముందే నియంత్రణ చర్యలు
- ప్రభుత్వానికి ప్రజలు సహకరించాలి
- కరోనా జన్యుక్రమంపై సీసీఎంబీ పరిశోధన
- టెస్టింగ్‌కిట్ల తయారీకి సహకారం
- సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్ మిశ్రా వెల్లడి

4

# రియల్ హీరోలు

## కరోనా పోరులో ప్రజల కోసం ప్రాణాలు పణంగా పెడుతున్న సిబ్బంది

- వైరస్ వ్యాప్తి నియంత్రణలో నిరంతర సేవ
- ఇంట్లో వద్దని వారిస్తున్నా విధినిర్వహణ
- నగరవాసులకు నిరంతర పరిచర్యలు




**ఒక సైన్యం..** సరిహద్దుల్లో కనిపించే శత్రువు నుంచి మనల్ని నిరంతరం కాపాడుతుంది. ఒక సైన్యం దేశం లోపల కనిపించని శత్రువు నుంచి మనల్ని అనుక్షణం పరిరక్షిస్తున్నది. సరిహద్దుల్లో సైన్యానికి లక్ష్యం స్పష్టం. కానీ, దేశంలోపలి సైన్యం నిత్యం చేస్తున్నది మాయాయుద్ధం. శత్రువు ఎలా ఉంటాడో తెలియదు. మనం నిద్రలేవడానికి ముందే వారు రణస్థలిలోకి దిగుతారు. మన ఆరోగ్యంకోసం వారు అనారోగ్యాన్ని తెచ్చుకోవడానికి కూడా వెనుకాడరు. మన సంక్షేమంకోసం మురికికూపాల్లో దిగడానికి కూడా సంశయించరు. మనం భరించని దుర్వాసనను వారు మౌనంగా సహిస్తారు. బిడ్డ ఆరోగ్యంకోసం తల్లిచేసే సపర్యలమాదిరిగా సేవ చేస్తారు. మనం ప్రశాంతంగా పడుకొన్న సమయంలో విధులు నిర్వర్తిస్తూ.. మన పరిసరాల పరిశుభ్రతకోసం పరితపించే పారిశుద్ధ్య కార్మికులు వారు. మనకు ప్రాణవాయువును అందిస్తున్న దేవుళ్లు. వీళ్లతోపాటు కరోనా వ్యాధిగ్రస్థులకు సేవలందించడంలో మరెందరో శ్రమిస్తున్నారు. అంబులెన్స్ డ్రైవర్ల దగ్గరినుంచి పేషెంట్ కేర్ టేకర్ దాకా ఎంతో మంది నిబ్బరంగా నిబద్ధతతో పనిచేస్తున్నారు. సరిహద్దుల్లో సైన్యానికి మనం 'జై జవాన్' అంటూ జోతలు పెడతాం. మరి.. ఈ సైన్యాన్ని ఏమని కొనియాడాలి? ఎంతని ప్రశంసించాలి?

3

## కోటి మందిలో ఏడుగురికి!

- 130 కోట్ల దేశజనాభాలో 929 మందికి కరోనా
- అమెరికా, ఇటలీ, స్పెయిన్‌లలో విపరీత వ్యాప్తి
- చైనాలో 10 లక్షల మందిలో 57 మంది బాధితులు

**చైనాలో** పుట్టిన కరోనా మహమ్మారి.. విశ్వమారిగా మారి కరాళనృత్యం చేస్తున్నది. అగ్రరాజ్యం అమెరికా సహా, ఇటలీ, స్పెయిన్, ఇరాన్, బ్రిటన్ ఫ్రాన్స్.. ఇలా ఒక్కో దేశంపై విరుచుకుపడుతున్నది. ఆయా దేశాలతో పోల్చితే భారత్‌లో పరిస్థితి కాస్త మెరుగ్గానే ఉన్నది. 130 కోట్ల మంది జనాభా ఉన్న మన దేశంలో.. ఇప్పటివరకు 929 మందికి మాత్రమే వైరస్ సోకింది. దీనిని బట్టి.. ప్రతి కోటి మందిలో దాదాపు ఏడుగురికి మాత్రమే కరోనా సోకింది. మిలియన్ (10 లక్షలు) జనాభాకు లెక్కిస్తే ఇది 0.7 మంది మాత్రమే బాధితులు. అయితే సమూహవ్యాప్తి దశకు చేరకముందే వైరస్‌ను కట్టడి చేయగలిగితేనే విశ్వమారి కాటు నుంచి మనం తప్పించుకోగలుగుతామని నిపుణులు చెప్తున్నారు. లేదంటే ఇటలీ, అమెరికా మాదిరి తిప్పలు తప్పవని స్పష్టం చేస్తున్నారు. చైనాలో ప్రతి మిలియన్ జనాభాలో 57 మంది వైరస్ బారిన పడగా.. అమెరికా, ఇటలీ, స్పెయిన్‌లో ఈ నిష్పత్తి వరుసగా 315, 1431, 1545గా ఉండటం గమనార్హం.



5



## వైరస్ నివారణకు డీఆర్డీవో అస్త్రాలు!

- శానిటైజర్లు, వెంటిలేటర్లు, బాడీ సూట్ల తయారీ కొత్తగా ఎన్99 మాస్కులు
- బీహెచ్‌ఈఎల్‌తో కలిసి వెంటిలేటర్ల ఉత్పత్తి
- 'నమస్తే తెలంగాణ'తో డీఆర్డీవో చైర్మన్ సతీశ్‌రెడ్డి



4



ప్రపంచవ్యాప్తంగా మొత్తం కేసులు **6,45,158**
మరణాలు: **29,951**



దేశవ్యాప్తంగా మొత్తం కేసులు **929**
మృతులు: **20**

ఏపీలో మరో ఆరు పాజిటివ్
మొత్తం **19** కేసులు నమోదు

లాక్‌డౌన్
డే-6

ఉష్ణోగ్రతలు

| | గరిష్ఠం | కనిష్ఠం | | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|---|---|---|
| హైదరాబాద్ | 38.0°c | 26.0°c | మెదక్ | 38.6°c | 18.3°c |
| కరీంనగర్ | 38.0°c | 24.0°c | ఆదిలాబాద్ | 36.8°c | 21.7°c |
| వరంగల్ | 36.5°c | 23.0°c | నిజామాబాద్ | 39.3°c | 24.7°c |
| రంగారెడ్డి | 37.0°c | 23°c | మహబూబ్‌నగర్ | 39°c | 24.2°c |
| నల్లగొండ | 38.4°c | 22.2°c | ఖమ్మం | 39°c | 25°5c |

# కష్టాల్లో తోడుగా కేటీఆర్

- సమస్యలకు ట్విట్టర్‌లో మంత్రి పరిష్కారం
- సదుపాయాల కల్పనపై కృతజ్ఞతల వెల్లువ
- 'మాస్క్ ధరిస్తా'.. పలువురికి సమాధానం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా కల్లోల సమయంలో కష్టాల్లో ఉన్నవారికి భరోసా లభిస్తున్నది. ఒక్క ట్వీట్‌తో సమస్యలకు పరిష్కారం దొరుకుతున్నది. ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు ట్విట్టర్ వేదికగా సామాన్యులకు తోడుగా నిలుస్తున్నారు. తెలంగాణ గర్వపడే మీలాంటి వ్యక్తులు బహిరంగ ప్రదేశాలకు వెళ్లినప్పుడు తప్పకుండా మాస్క్ ధరించాలని శనివారం పలువురు ట్విట్టర్‌లో కోరారు. దీనిపై స్పందించిన కేటీఆర్.. ఆలోచించదగ్గ సలహా ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇకపై తప్పకుండా మాస్క్ ధరిస్తానని చెప్పారు. ఐక్యూ, ఈక్యూ, ఎస్‌క్యూ.. ఈ మూడు ఉన్న ఒకే వ్యక్తి కేటీఆర్ అని సాయంపొందిన పలువురు కొనియాడారు.

**చిన్నారికి శుభాకాంక్షలు**

పాలమూరు జిల్లా పింజర్లలో చిక్కుకుపోయిన జార్ఖండ్ కూలీలకు ఆహారాన్ని అందించాలని ఓ వ్యక్తి ట్వీట్ చేయగా.. సాయం చేయాలని జిల్లా మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు కేటీఆర్ సూచించారు. శ్రీనివాస్‌గౌడ్ అధికారుల ద్వారా వారికి సాయం అందజేశారు. హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్‌కు చెందిన విద్యార్థిని అక్షయ.. తన పుట్టినరోజు సందర్భంగా కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.1,018ని సీఎం సహాయనిధికి ఇచ్చింది. ఈ సందర్భంగా విద్యార్థికి కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**కరోనాపై పోరాడుతున్నవారికి కేటీఆర్ కృతజ్ఞతలు**

తెలంగాణ రాష్ట్రం కరోనాపై చేస్తున్న పోరాటంలో నిరంతరం పనిచేస్తున్న వివిధ శాఖల సిబ్బందికి మంత్రి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ పరీక్షా సమయంలో కరోనాపై పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొంటున్న వైద్య సిబ్బంది, పోలీసు, మున్సిపల్, నీటిసరఫరా, నిత్యావసర సరుకులు, డ్రైవర్లు, విద్యుత్ సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వీరందరూ మనకోసం నిరంతరం పనిచేస్తున్నారని ఆయన ట్విట్టర్ ద్వారా అభినందించారు.

**సిబ్బంది పనితీరు అమోఘం**

హైదరాబాద్‌లో ఇన్‌ఫెక్షన్ రాకుండా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది చేస్తున్న కృషి అమోఘమని కేటీఆర్ ప్రశంసించారు. ఇన్‌ఫెక్షన్ వ్యాపించకుండా రోడ్లపై రసాయనాలు చల్లుతున్న ట్యాంకర్ వీడియోను జోడించి మరో ట్వీట్ చేశారు.

**ఇతర రాష్ట్రాల భవన నిర్మాణ కార్మికులకు అండ**

తెలంగాణలో 4 లక్షల మందికిపైగా వివిధ రాష్ట్రాలకు చెందిన భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని, వీరందరి సంక్షేమంపై ప్రభుత్వం శ్రద్ధతో ఉన్నదని మంత్రి కేటీఆర్ చెప్పారు. బిల్డర్లు, కాంట్రాక్టర్ల తోడ్పాటుతో వారి సంరక్షణ చూస్తున్నట్టు తెలిపారు. నిర్మాణ ప్రాంతాల్లోనే వారికి కావల్సిన నిత్యావసర సరుకులు తదితర ఏర్పాట్లుచేసినట్టు పేర్కొన్నారు. టౌన్‌ప్లానింగ్, పోలీసు శాఖ అధికారులు నిత్యం ఈ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు శనివారం ట్వీట్ చేశారు.

**ప్రశంసించిన ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్**

తెలంగాణలో ఉన్న బీహార్ కూలీలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్ ప్రశంసించారు. లాక్‌డౌన్ నేపథ్యంలో భోజన వసతి అందిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయాన్ని ఆ పార్టీ అధికార ప్రతినిధి అరుణ్‌కుమార్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

### గర్భిణి వైద్యపరీక్షల కోసం వాహనం



గర్భిణి అయిన తన భార్య సనకు వైద్యపరీక్షలు చేయించేందుకు రవాణా సదుపాయం కల్పించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన మహ్మద్ సల్మాన్ ట్వీట్ చేశారు. దీనికి కేటీఆర్ స్పందించారు. జెడ్పీటీసీ సభ్యుడు చీటి లక్ష్మణ్‌రావు ద్వారా రవాణాకు కారు సదుపాయం కల్పించడంతో ఆమెను కరీంనగర్‌లోని హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. దీనిపై సల్మాన్ మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు కలెక్టర్లతో సీఎం కేసీఆర్ వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదివారం సాయంత్రం 5 గంటలకు అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలు, వైద్యారోగ్య, మార్కెటింగ్, పౌరసరఫరాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. అత్యవసర సరుకుల అందుబాటు, వరి, మక్కజొన్న సేకరణ తదితర అంశాలపై సమీక్షిస్తారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ తెలిపారు.

## సీఎం కేసీఆర్ చర్యలు భేష్

### ప్రశంసించిన టీఆర్‌ఎస్ స్విట్జర్లాండ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకొనేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకొంటున్న ముందస్తు చర్యలు భేషుగ్గా ఉన్నాయని టీఆర్‌ఎస్ స్విట్జర్లాండ్ ప్రతినిధి శ్రీధర్ గండే ప్రశంసించారు. ప్రపంచం మొత్తం కష్టకాలంలో ఉన్న సమయంలో సేవలందిస్తున్న వైద్యులు, నర్సులు, పారిశుద్ధ్య కార్మికులు, పోలీసులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్టు చెప్పారు. సోషల్ మీడియా ద్వారా మంత్రి కేటీఆర్ ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారం చూపుతున్నారని కొనియాడారు.



### తెలంగాణ లాక్‌డౌన్



*నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన చిన్నారి మేఘన కరోనా వైరస్ వ్యాప్తిపై గీసిన చిత్రం ఆలోచింపజేస్తున్నది. గుర్రం వెంకటేశ్-మాధవి దంపతుల కూతురైన మేఘన స్థానిక ప్రైవేటు పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నది. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో తెలంగాణ భౌగోళిక చిత్రపటానికి తాళం వేసి.. దాని తాళం చెవిని సీఎం కేసీఆర్ పట్టుకున్నట్టుగా గీసిన చిత్రం విశేషంగా ఆకట్టుకుంటున్నది.*

*– నల్లగొండ విద్యావిభాగం*




### కరోనాపై ఉద్యమ పిడికిలి



*'కరోనాపై సమరం కేసీఆర్' అంటూ మహబూబాబాద్‌కు చెందిన మంగళంపల్లి వెంకన్న (కన్నా) అనే చిత్రకారుడు అద్భుతచిత్రాన్ని గీశారు. సీఎం కేసీఆర్ ఒక చేతితో మైకు పట్టుకొని కరోనాపై మాట్లాడుతున్నట్లుగా, మరో చేత పిడికిలి బిగించినట్టుగా చిత్రీకరించారు. పై భాగంలో వైరస్ సింబల్‌ను గొలుసుతో కట్టేయగా.. కింది భాగంలో కరోనాపై సమరం అనే నినాదం రాశాడు.*

*– మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ*

## స్వీయనియంత్రణే రక్ష

### స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా మహ మ్మారికి ధనిక, పేద, వయో, లింగ భేదాలు లేవని, అందరూ స్వీయ నియంత్రణ పాటించాలని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ఆయన శనివారం ఒక వీడియో సందేశం పంపారు. బ్రిటన్ ప్రధాని, యువరాజుకు కూడా కరోనా సోకిందని, అత్యంత భద్రత, పరిశుభ్ర వాతావరణంలో ఉండే వీరికి పాజిటివ్ అంటే దీని తీవ్రత ఎలాంటిదో ఊహించుకోవచ్చునన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూచించినట్టుగా లాక్‌డౌన్‌కు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

YASHODA HOSPITALS

## యశోదాపై దుష్ప్రచారం సరికాదు

### అన్ని దవాఖానలు పనిచేస్తున్నాయి

- కరోనా చికిత్స అందించేందుకూ సిద్ధం
- వదంతులపై యాజమాన్యం ఫిర్యాదు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** యశోదా హాస్పిటల్స్‌ను మూసివేశారంటూ వాట్సాప్ తదితర సోషల్‌మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవంలేదని యాజమాన్యం స్పష్టంచేసింది. కొంతమంది ఉద్దేశపూర్వకంగానే తమపై దుష్ప్రచారం చేస్తున్నట్టు కనిపిస్తున్నదని పేర్కొంది. అసత్య, నిరాధారమైన వార్తలను ప్రచారం చేస్తున్నవారిపై చర్య తీసుకోవాలని సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదుచేసినట్టు యశోదా హాస్పిటల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని మలక్‌పేట, సోమాజిగూడ, సికింద్రాబాద్‌లోని బ్రాంచీలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని, వైద్యులు, సిబ్బంది అంతా విధులకు హాజరవుతున్నారని చెప్పారు. కరోనా (కొవిడ్-19) వైరస్ బాధితుల కోసం ప్రత్యేకంగా క్వారంటైన్ విభాగాలను సిద్ధంచేశామన్నారు. దవాఖానలో ముగ్గురు కొవిడ్-19 బాధితులు ఉన్నారని, వీరిలో హాస్పిటల్ మెడికల్ అడ్మినిస్ట్రేటర్‌తోపాటు ఆయన తల్లి, భార్య కూడా ఉన్నారని పేర్కొన్నారు. వీరి ఆరోగ్యం నిలకడగా ఉన్నదని, త్వరలోనే డిశ్చార్జ్ చేస్తామని ప్రకటించారు. లాక్‌డౌన్ సమయంలో వచ్చిన వదంతులను నమ్మవద్దని కోరారు. యశోదా గ్రూపులోని అన్ని బ్రాంచీలు 24 గంటలు రోగుల సేవలో ఉన్నాయని స్పష్టంచేశారు.

# ఫేక్‌న్యూస్ సహించం

- నకిలీ వాయిస్ మెసేజ్‌లపై సీపీఎస్‌లో కేసు
- ప్రజలను భయాందోళనకు గురిచేయొద్దు
- హైదరాబాద్ సీపీ అంజనీకుమార్ హెచ్చరిక



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ/సైదాబాద్:** కొవిడ్-19పై సోషల్‌మీడియాలో ఫేక్‌న్యూస్‌లు, నకిలీ వాయిస్ మెసేజ్‌లు, వదంతుల ప్రచారాన్ని సహించబోమని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ హెచ్చరించారు. వాట్సాప్ అడ్మిన్లు.. ఏదీ నిజం.. ఏదీ అబద్ధం అని నిర్ధారించుకొని మాత్రమే ఫార్వర్డ్ చేయాలని సూచించారు. ప్రజలను భయాందోళనలకు గురిచేసేలా నకిలీ ఆడియోలు, వీడియోలను సర్క్యులేట్‌చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. తన నకిలీ వాయిస్‌తోపాటు సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ నకిలీ వాయిస్‌తో ప్రచారం, శుక్రవారం మక్కామసీద్ వద్ద ప్రార్థనల్లో భారీగా జనాలున్నారని పాత వీడియోలతో మరో ఫేక్‌వీడియోను సోషల్‌మీడియాలో వైరల్‌చేయడంపై సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు సుమోటోగా కేసులు నమోదుచేసినట్టు తెలిపారు. జర్నలిస్ట్, అపోలో వైద్యుడి సంభాషణ అంటూ ప్రచారమైన ఆడియోపై అపోలో ప్రతినిధుల ఫిర్యాదుతో ఎఫ్‌ఐఆర్ నమోదుచేసినట్టు పేర్కొన్నారు.

**తప్పుడు ప్రచారంచేసిన యువకుడిపై కేసు**

కరోనా వైరస్ సోకిందని సోషల్‌మీడియాలో నకిలీ వార్త పోస్ట్‌చేసిన యువకుడిపై సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఐఎస్‌సదన్ డివిజన్‌లోని ఎస్‌ఎన్‌రెడ్డినగర్‌కు చెందిన ఓ కుటుంబసభ్యులు (దంపతులు, కుమార్తె) అమెరికాలోని కాలిఫోర్నియాలో జరిగిన వివాహానికి హాజరై వచ్చారు. విమానాశ్రయంలో స్క్రీనింగ్ పరీక్షచేసిన వైద్యులు కొవిడ్-19 లక్షణాలు లేకపోయినా.. స్వీయనిర్బంధంలో ఉండాలని సూచించారు. ఇంట్లోనే ఉంటున్నవారిని నిత్యం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పరీక్షిస్తున్నారు. ఈ క్రమంలో వారి మూడేండ్ల కుమార్తెకు జ్వరం, జలుబురావటంతో వారు 108 అంబులెన్స్ ద్వారా నల్లకుంటలోని ఫీవర్ హాస్పిటల్‌కు తరలించే సమయంలో కొందరు వీడియాతీసి చిన్నారికి కరోనా అంటూ సోషల్‌మీడియాల్లో పోస్టుచేశారు. తప్పుడు వార్త ప్రచారంచేసిన నిందితులపై బాధితులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. స్థానిక యువకుడిని సైదాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకుని, అతడి సెల్‌ఫోన్‌ను స్వాధీనపర్చుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పోలీస్ టెలిగ్రామ్‌లో వాస్తవాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనావ్యాప్తిపై ప్రజలకు ఎప్పటికప్పుడు వాస్తవాలను చేరవేసేందుకు పోలీస్‌శాఖ తెలంగాణ స్టేట్ పోలీస్ పేరిట టెలిగ్రామ్ యాప్‌ను ప్రారంభించినట్టు డీజీపీ మహేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాచారం కోసం ప్రజలకు తమ సెల్‌ఫోన్లలో టెలిగ్రామ్ మెసెంజర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. సోషల్‌మీడియాలో వస్తున్న వదంతులు, తప్పుడు వార్తలను నమ్మవద్దని కోరారు.

## వైన్స్ మూసేఉంటాయ్

### నకిలీ జీవో వైరల్‌పై ఎక్సైజ్‌శాఖ కమిషనర్ ఆగ్రహం




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ నేపథ్యంలో రాష్ట్రంలో మద్యం దుకాణాలు మూసే ఉంటాయని ఎక్సైజ్‌శాఖ కమిషనర్ సర్ఫరాజ్ స్పష్టంచేశారు. ఈ నెల 29 నుంచి కొన్నిగంటలపాటు వైన్‌షాపులు తెరుస్తారని సోషల్ మీడియాలో నకిలీ జీవోతో వార్తప్రచారం కావడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. తప్పుడు జీవో సృష్టించి సోషల్ మీడియాలో వైరల్‌చేసిన బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ రాజేంద్రకులకర్ణి శనివారం హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. కాగా, వైన్స్‌షాపుల వద్ద పెట్రోలింగ్ వ్యవస్థతో నిఘా ఏర్పాటుచేయాలని తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు హైదరాబాద్ సీపీ అంజనీకుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

## పది పరీక్షలపై నిర్ణయం తీసుకోలేదు

### వదంతులు నమ్మొద్దన్న విద్యాశాఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలను తిరిగి ఎప్పుడు నిర్వహించే అంశంపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదని పాఠశాల విద్యాశాఖ శనివారం ప్రకటించింది. ప్రభుత్వ నిర్ణయం మేరకే పరీక్షలను రీషెడ్యూల్ చేయాల్సి ఉంటుందని స్పష్టంచేసింది. ఇప్పటివరకు రెండు సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించామని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఏ సత్యనారాయణరెడ్డి తెలిపారు. మరో నాలుగు సబ్జెక్టులకు కలిపి ఎనిమిది పేపర్లకు పరీక్షలు నిర్వహించాల్సి ఉన్నదన్నారు.

# వదంతులు వద్దు

మొదటిపేజీ తరువాయి...

ఐసొలేషన్, ఐసీయూ సేవల కోసం గాంధీ, కింగ్‌కోఠి దవాఖానలను మొత్తంగా, ఛాతి దవాఖానలో సగభాగం, ఇతర దవాఖానల్లోనూ ఏర్పాట్లు చేశామని వివరించారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 1,500 మందిని ఐసొలేషన్, క్వారంటైన్ చేసేందుకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. అమెరికా, ఇటలీ వంటి దేశాల్లోని ఘటనలను దృష్టిలో పెట్టుకొని.. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మూడురోజుల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని మూడు ఫ్లోర్లు, ఆరురోజుల్లో మరో ఆరు ఫ్లోర్లు, ఇలా 20 రోజుల్లో ఇక్కడ ఉన్న భవనాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెస్తామని చెప్పారు. ముందస్తు చర్యల్లో భాగంగా మాత్రమే ఈ ఏర్పాట్లు చేస్తున్నామని స్పష్టంచేశారు.

**నిలకడగా పాజిటివ్ వ్యక్తుల ఆరోగ్యం**

రాష్ట్రంలో రెడ్, గ్రీన్ జోన్లు అంటూ ఏమీలేవని, కొందరు సైకోలు, శాడిస్టులు పెట్టే ఇలాంటి తప్పుడు వార్తలను నమ్మొద్దని మంత్రి ఈటల స్పష్టంచేశారు. ఈ వైరస్ ఇతర దేశాల నుంచి వచ్చిందని, ఇది గాలితో వ్యాపించేది కాదని, పాజిటివ్ వ్యక్తుల ద్వారా సన్నిహితంగా మెలిగిన కొందరికి మాత్రమే సోకిందని చెప్పారు. కరోనా వ్యాప్తి అంశాలను, బాధితుల గురించి తామే ప్రకటిస్తామని, ప్రజారోగ్యంపట్ల ప్రభుత్వం పూర్తి బాధ్యతగా వ్యవహరిస్తున్నదని పేర్కొన్నారు. బాధ్యతలేని వ్యక్తులు చేసే ప్రచారం వల్ల భయభ్రాంతులకు గురవకూడదని సూచించారు. రాష్ట్రంలో కరోనా పాజిటివ్ వ్యక్తుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నదని, కిడ్నీ ఫెయిల్యూర్, గుండె జబ్బులు, బీపీ, షుగర్ ఉన్నవాళ్లు.. లేదా 65 నుంచి 70 ఏండ్లుపైబడి బలహీనంగా ఉన్న వ్యక్తులకు మాత్రమే ప్రమాదం ఉంటుందన్నారు. బలంగా ఉన్నవాళ్లకు ఎలాంటి ప్రమాదం లేదని తెలిపారు. కర్ణాటక నుంచి వచ్చిన ఓ వ్యక్తి, 79 ఏండ్ల మరోవ్యక్తి వెంటిలేటర్‌పై ఉన్నారని తెలిపారు. కరోనా సోకినవారికి సాధ్యమైన మేరకు ప్రభుత్వ ఆధ్వర్యంలోనే వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. సోషల్‌మీడియాలో చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు పట్టించుకోవద్దని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. న్యూస్‌పేపర్ పట్టుకుంటే కరోనా సోకుతదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అనేక పత్రికల యాజమాన్యాలు దీనిని ఖండించాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు.

**కొందరి నిర్లక్ష్యం వల్లే..**

విదేశాల నుంచి వచ్చిన కొందరు ఏమవుతుందిలే అన్న నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యంతో కరోనా వైరస్‌ను వారి కుటుంబసభ్యులకు అంటించారని మంత్రి ఈటల పేర్కొన్నారు. పాజిటివ్‌గా నిర్ధారణ అయినవారిలో పాతబస్తీలోని ఓ కుటుంబానికి చెందిన ఆరుగురు ఉన్నారని చెప్పారు. ఆ కుటుంబంలోని ఓ వ్యక్తి ఢిల్లీ వెళ్లిరాగా ఈ వైరస్ సోకిందని, అతను నిర్లక్ష్యం చేయడంతో ఇంట్లోని వారందరికీ పాజిటివ్‌గా వచ్చిందని వివరించారు. తిరుపతికి వెళ్లి వచ్చిన ఓ వైద్యుడు ఆయన కుటుంబంలోని మరో నలుగురికి అంటగట్టాడని తెలిపారు. ఎయిర్‌పోర్టులో పనిచేసినవారిని స్ట్రీమ్ చేయగా, ఇద్దరికి పాజిటివ్ వచ్చిందని, వాళ్లందరినీ ఐసొలేషన్‌లో ఉంచామన్నారు. సర్వైలెన్స్‌లో కూడా ఒక వ్యక్తికి పాజిటివ్ వస్తే అతడి కుటుంబసభ్యులు, సన్నిహితంగా మెలిగినవారి వివరాలు సేకరిస్తున్నాం కాబట్టే.. ఇన్ని కేసులు నమోదవుతున్నాయని పేర్కొన్నారు.

**కొత్తగా 8 పాజిటివ్ కేసులు**

కొత్తగా మరో 8 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని, దీంతో కేసుల సంఖ్య 67కు చేరిందని ఈటల ప్రకటించారు. వీరిలో ఒకరు కోలుకొని డిశ్చార్జ్ కాగా, 10 మందికి శనివారం నెగెటివ్‌గా తేలిందని చెప్పారు. 24 గంటల్లో వారికి మళ్లీ పరీక్షలు నిర్వహిస్తామని, నెగెటివ్ వస్తే మూడురోజుల్లో డిశ్చార్జ్ చేస్తామన్నారు. వైద్యాశాఖలో నలుగురికి పాజిటివ్ వచ్చిందని, వారు ఎయిర్‌పోర్టు స్క్రీనింగ్ వద్ద పనిచేశారని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎయిర్‌పోర్ట్ ఉన్న వైద్యులు, సిబ్బందికి నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్టు ప్రకటించారు. కొత్తగా నమోదైన కేసులకు ప్రయాణ చరిత్ర ఉన్నదని, ఇప్పటివరకు 13 వేల మందిని క్వారంటైన్‌లో ఉంచామని, రోజురోజుకు ఆ సంఖ్య తగ్గుతున్నదన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి నిమిత్తం వచ్చిన కార్మికుల కోసం చేపట్టాల్సిన ప్రత్యేక చర్యలపై సీఎం కేసీఆర్.. సీఎస్‌కు ఆదేశాలు జారీచేశారని చెప్పారు. తనతోపాటు వైద్యాశాఖలోని అధికారులు 24 గంటలు ఆన్ డ్యూటీలో ఉంటున్నామన్నారు. వైద్యాశాఖలో సిబ్బందికి షిఫ్టులవారీగా విధులు నిర్వహించేలా ఏర్పాటుచేశామని, అవసరమైతే వైద్యులకు 10 రోజులు విధులు.. మరో 10 రోజులు సెలవు ఇస్తామని ప్రకటించారు.

**వైద్యులను ఇబ్బందిపెడితే చర్యలు**

గాంధీలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందిని వారు నివసిస్తున్న ప్రాంత ప్రజలు ఇబ్బంది పెడుతున్నట్టు తెలిసిందని మంత్రి అన్నారు. ప్రాణాలు పణంగా పెట్టి పనిచేస్తున్నవారికి అండగా నిలువాలని, అనుచితంగా ప్రవర్తించడం సరికాదన్నారు. అటువంటివారిపై కఠినచర్యలుంటాయని హెచ్చరించారు. ఒక వ్యక్తికి వస్తే కుటుంబమంతా సోకే ప్రమాదం ఉన్నదని, విదేశాల నుంచి వచ్చినవారు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.



*శనివారం గచ్చిబౌలిలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్*

## కరోనాకు ఒకరు బలి

మొదటిపేజీ తరువాయి...

ఈ భవనంలో మొదటి అంతస్థులో మృతుడి కుటుంబసభ్యులు నివసిస్తుండగా, పై అంతస్థులో కిరాయిదారులు నివసిస్తున్నారు. మృతుడి కుటుంబసభ్యులతోపాటు, కిరాయిదారులు కూడా హోంకార్వంటైన్‌లో ఉండాలని స్థానిక కార్పొరేటర్ పీ విజయారెడ్డి వారికి సూచించారు. అయితే మృతుడి కుటుంబసభ్యులు ఎలాంటి మాస్కులు ధరించకుండానే సుమారు వారం రోజులపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో తిరిగినట్టు స్థానికులు చెప్తున్నారు. కుటుంబసభ్యులు, కిరాయిదారులతోపాటు ఆ కాలనీ పరిధిలోని 400 ఇండ్ల ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామని జీహెచ్‌ఎంసీ వైద్య విభాగం అధికారి భార్గవ నారాయణ పేర్కొన్నారు. ఓల్డ్ సీఐబీక్వార్టర్స్, పక్కనే ఉన్న ఇందిరానగర్‌కాలనీల్లో రసాయనిక ద్రావకాన్ని పిచికారి చేయిస్తామని చెప్పారు.

### లోకం పోకడ









కొత్తగూడెం జిల్లా పూసుగూడెంలో గర్భిణిని మోసుకొస్తున్న ఆశావర్కర్, ఏఎన్ఎం, కుటుంబసభ్యులు, (ఇన్‌సెట్‌లో) శిశువుతో తల్లి దూలే

# రియల్ హీరోస్!

## కరోనాపై పోరులో ప్రజల కోసం ప్రాణాలు పణంగా పెడుతున్న వైద్యారోగ్య, పారిశుద్ధ్య సిబ్బంది

**వైరస్ వ్యాప్తి కట్టడిలో నిరంతర సేవ • వ్యాధిగ్రస్థులకు, నగరవాసులకు నిరంతర పరిచర్యలు**



**హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ/అంబర్‌పేట, బన్సీలాల్‌పేట, ఖైరతాబాద్:** కంటికి కనిపించని శత్రువుతో భీకర యుద్ధం నడుస్తున్నది. ఎలా ఉంటాడో తెలియని శత్రువుతో సాగిస్తున్న పోరాటంలో ఎందరెందరో తమవంతు పాత్ర పోషిస్తున్నారు. కరోనా బారినపడ్డవారికి సేవలందించడంలో డాక్టర్లతోపాటు మరెందరో శ్రమిస్తున్నారు. కరోనా బాధితులకు నోడల్ కేంద్రంగా ఉన్న గాంధీ దవాఖానతోపాటు ఫీవర్ హాస్పిటల్, నిమ్స్, ఉస్మానియా దవాఖానల్లో డాక్టర్ల వెన్నంటి నిత్యం సేవలందిస్తున్నారు. దిటవుగుండెలతో కరోనా బాధితులకు అత్యంత సమీపంలో నిల్చొని ధైర్యంగా విధులు నిర్వర్తిస్తున్నారు. వారే అంబులెన్స్ డ్రైవ ర్లు, వార్డుబాయ్‌లు, లిఫ్ట్ ఆపరేటర్లు, గే ట్‌కీపర్లు, స్వీపర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, పేషెంట్ కేర్ టేకర్లు, పారిశుద్ధ్య కార్మికులు. నిజానికి ఎయిడ్స్, స్వైన్‌ఫ్లూ, కరో నా.. ఇలా ఎన్నో రకాల పేషెంట్లకు అత్యంత సమీపంగా ఉండి విధులు నిర్వర్తించేది వీరే. నిజానికి అత్యంత ప్రమాదకర పరిస్థితుల మధ్య శ్రమిస్తున్న రియల్ హీరోలు వీరే. ఫలానా వ్యక్తికి కరోనా అనుమానిత లక్షణాలు ఉన్నాయంటూ 104కు ఫోన్ రాగానే హుటాహుటిన బయలుదేరేది అంబులెన్స్ డ్రైవర్లు. బాధితుడి ఇంటికి వెళ్లడం, వారికి ప్రత్యేక డ్రెస్సులు తొడిగించడం, వారిని దవాఖానలోని హెల్ప్‌డెస్క్ వరకు తరలించడం వీరి డ్యూటీ. ఆ తర్వాత స్ట్రెచర్, కుర్చీలు తీసుకొచ్చి, పేషెంట్లను జాగ్రత్తగా వాటిలో కూర్చోబెట్టేది, వారి వెన్నంటి నడిచేది వార్డుబాయ్‌లు. వీరిని లిఫ్టులో ఎక్కించుకొని, ఐసోలేషన్ వార్డు దగ్గర దిగబెట్టేది లిఫ్ట్ ఆపరేటర్లు. ఆ తర్వాత ఐసోలేషన్ వార్డులో చేరిన పేషెంట్లకు సమస్త సపర్యలు చేసేది పేషెంట్ కేర్ టేకర్లు. కరోనా బాధితులున్న గదిని, వారు వాడిన టాయ్‌లెట్లను, దుస్తులను నిరంతరం శుభ్రం చేయడం, బయోవేస్ట్‌ను జాగ్రత్తగా తరలించడంలాంటి విధులు నిర్వర్తించేది స్వీపర్లు లేదా ఆయాలు. ఇలా ఒక్కొక్కరిదీ ఒక్కొక్క బాధ్యత. పేషెంట్‌ను గుర్తించిన దగ్గర నుంచి వారు కోలుకొని ఇంటికెళ్లే దాకా అనుక్షణం వెన్నంటి నడిచే ఈ రియల్‌హీరోలు మనపాలిట దేవుళ్లు. కుటుంబసభ్యులు భయపడుతున్నా.. వద్దని వారిస్తున్నా విధి నిర్వహణలో వెనకడుగు వేయడంలేదు. ప్రమాదమని తెలిసినా కర్తవ్యాన్ని వీడటంలేదు.



గాంధీ దవాఖానలో ఐసోలేషన్ వార్డు వద్ద సెక్యూరిటీ సిబ్బంది

### పరిశుభ్రతే ప్రథమ కర్తవ్యం

**కరోనా** కట్టడికి జనమంతా కర్ఫ్యూలో ఉన్నారు. ఎవరూ ఇంటినుంచి బయటకు రాలేని భయానక పరిస్థితి. కానీ మన ఆరోగ్యం కోసం పారిశుద్ధ్య కార్మికులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. రోడ్లన్నీ ఊడవటం, చెత్తను తొలిగించడం.. కాలనీల్లో పరిశుభ్ర కార్యక్రమాలను చేపట్టడం.. ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించడం వంటిపనులన్నీ చేస్తున్నారు. ఇవన్నీ వారు సాధారణంగా చేసే విధులే. కానీ, గాలిలో, నేలలో, ధూళిలో అంతటా కొవిడ్-19 విస్తరించిందన్న ఆందోళన ఉన్న నేపథ్యంలో పారిశుద్ధ్య కార్మికులు.. ప్రాణాలకు తెగించి విధుల్లో పాల్గొనడం అపూర్వం.

### నాకేమైనా పర్వాలేదు



ఉదయం 4 గంటలకే రోడ్ల పైకి వస్తాం. చెత్తను తొలగిస్తాం. మధ్యాహ్నం 2 గంటల దాకా రోడ్లపైనే ఉంటున్నాం. కరోనా భయంతో నా బిడ్డ నన్ను బయటకు వెళ్లొద్దని చెప్పింది. నాకు ఏమైనా పర్లేదు. నా బిడ్డకు రావొద్దు. ప్రభుత్వం మాకు శానిటైజర్లు అందించింది. చేతులు కడుక్కొని, స్నానం చేశాక ఇంట్లకు పోతున్న.

**-ముత్యాలు, పారిశుద్ధ్య కార్మికుడు, సికింద్రాబాద్**

### ప్రత్యేక డ్రెస్‌తో కరోనా గదిలోకి..



మొదట్లో కరోనా అంటే ఏందో మాకు తెల్వదు. ముందుగా గదులను, టాయిలెట్లను శుభ్రం చేశాం. రోగులు పెరిగాక, కరోనా గదిలోకి వెళ్లి శుభ్రం చేయడానికి ముందు ప్రత్యేక డ్రెస్ వేసుకోవాలని చెప్పారు. అప్పటినుంచి అలాగే వెళ్తున్నాం. జాగ్రత్తలు తీసుకుంటూ డ్యూటీ చేస్తున్నాం.

**- రేణుక, స్వీపర్, గాంధీ దవాఖాన**


### పర్సనల్ ప్రొటెక్షన్ తీసుకొంటున్నాం



కరోనా ఐసొలేషన్ వార్డులో డ్యూటీ చేస్తున్నా. గదిని శుభ్రం చేస్తూ, పేషెంట్లకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి. పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్ డ్రెస్, దానిపైన మరో ఆప్రాన్ వేసుకుని వార్డులోకి వెళ్తున్నాం. ఇంట్లో మమ్మల్ని డ్యూటీకి వెళ్లొద్దంటున్నారు.

**- రవి, పేషెంట్ కేర్ అసిస్టెంట్, గాంధీ దవాఖాన**

### రోగులకు సేవలందించడంలోనే తృప్తి



12 ఏండ్లుగా నిమ్స్‌లో పనిచేస్తున్నాను. ఎప్పుడూ కష్టం అనిపించలేదు. రోగులకు సేవ చేయడం ద్వారా తృప్తి మిగులుతున్నది. కరోనా బాధితులకూ మేమే సేవలు చేయాలి. ఇంట్లో భయపడుతున్నారు. కానీ వృత్తి ధర్మం నిర్వర్తిస్తున్నాం.

**- ఎన్ అశోక్, వార్డుబాయ్, నిమ్స్**

# డోలి మోసి.. పురుడు పోసి.!

***పురిటి*** *నొప్పులతో బాధపడుతున్న మహిళను కిలో మీటరు మేర డోలిలో మోసి కాన్పు చేశారు ఏఎన్ఎం, ఆశావర్కర్, అంగన్‌వాడీ టీచర్. భద్రాది కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెంకు చెందిన మడకం దూలే నిండు గర్భిణి. శనివారం పురిటి నొప్పులు రావడంతో ఆశావర్కర్ ధనలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ దుర్గ, ఏఎన్ఎం జ్యోతి ఆమె ఇంటికి చేరుకున్నారు. 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న పీహెచ్‌సీకి తరలించాల్సి ఉండటంతో 108కి ఫోన్ చేశారు. గ్రామం వరకు వాహనం వెళ్లలేని కారణంగా 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాష్ట్ర రహదారి వరకు తీసుకురమ్మని 108 సిబ్బంది సూచించారు. దీంతో గర్భిణి కుటుంబసభ్యులు, ఆశావర్కర్, ఏఎన్ఎం జ్యోతి గర్భిణిని డోలిలో మోస్తూ తీసుకెళ్లారు. ఈక్రమంలో సోయం గంగులనగర్‌లో నొప్పులు ఎక్కువ కావడంతో కాన్పు చేశారు. మగబిడ్డకు జన్మనివ్వగా తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు.*

**-ములకలపల్లి**



సీఎంఆర్ఎఫ్ కోసం నెల జీతాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీ జగదీశ్వర్‌కు అందజేస్తున్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్




తెలంగాణభవన్ డిప్యూటీ కమిషనర్ రామ్మోహన్‌కు రూ.లక్ష చెక్కు అందజేస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ

## సింగరేణి విరాళం 8.5 కోట్లు

- **'శ్రీచైతన్య' రూ. కోటి.. ఐకియా 2.6 కోట్ల యూరోలు**
- **కరోనాపై పోరుకు గవర్నర్ తమిళిసై నెల జీతం**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/కొండాపూర్:** రాష్ట్రంలో కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు తోడుగా ఆపదలో ఆపన్నహస్తం అందించేందుకు పలు సంస్థలు ముందుకొస్తున్నాయి. తమవంతు సాయంగా విరాళాలు అందజేస్తున్నాయి. సింగరేణి అధికారులు, ఉద్యోగులు, కార్మికుల ఒకరోజు వేతనం రూ.8.5 కోట్లు ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేయాలని యాజమాన్యం శనివారం నిర్ణయించింది. ఈ నిర్ణయంపై సింగరేణి సీఎండీ శ్రీధర్ హర్షం వ్యక్తంచేశారు. శ్రీచైతన్య విద్యాసంస్థలు తెలంగాణ, ఏపీ సీఎంల సహాయనిధికి రూ.కోటి చొప్పున ప్రకటించాయి. తమిళనాడు, కర్ణాటకకు రూ.25 లక్షల చొప్పున, ప్రధానమంత్రి సహాయనిధికి రూ.1.5 కోట్లు అందిస్తున్నట్టు విద్యాసంస్థల అధినేత డాక్టర్ బీఎస్ రావు తెలిపారు. క్వారంటైన్ కేంద్రాలుగా వాడుకునేందుకు తెలుగు రాష్ట్రాల్లోని తమ హాస్టల్ బిల్డింగ్‌లను సైతం అందిస్తామని ఆ సంస్థ అకడమిక్ డైరెక్టర్లు సుష్మ, సీమ ప్రకటించారు. ఐకియా (ఇంగ్ కా గ్రూపు) తమవంతుగా 2.6 కోట్ల యూరోలను అందజేస్తున్నట్టు ఆ సంస్థ ఇండియా సీఈవో, సీఎస్‌వో పీటర్ బెట్జెల్ తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన క్వారంటైన్ సెంటర్లకు 200 పడకలు, పరుపులు, ఇతర ఫర్నీచర్ అందజేసినట్టు చెప్పారు. గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ఒక నెల జీతం రూ.3.5 లక్షలను ప్రభుత్వానికి విరాళంగా ఇచ్చారు. కరోనా కట్టడి చర్యలపై సీఎస్ సోమేశ్‌కుమార్‌తో మాట్లాడారు.

### రూ. లక్ష జమచేసిన బుద్ధవనం ఓఎస్డీ మల్లేపల్లి



కరోనా వైరస్ మహమ్మారిని ఎదుర్కోవడానికి ముఖ్యమంత్రి సహాయనిధికి సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ రూ.లక్ష అందించింది. ఈ మొత్తాన్ని బుద్ధవనం ఓఎస్డీ మల్లేపల్లి లక్ష్మయ్య శనివారం ఆన్‌లైన్ ద్వారా సీఎంఆర్ఎఫ్‌కు జమచేశారు. కరోనాను ఎదుర్కోవడానికి ప్రభుత్వానికి సహకరించాలని లక్ష్మయ్య కోరారు.

**ప్రధాని సహాయనిధికి ఆకాశవాణి, దూరదర్శన్ రూ.3 కోట్లు**

కరోనా బాధితులను ఆదుకునేందుకు ఆకాశవాణి, దూరదర్శన్ ప్రోగ్రాం డివిజన్ ఒకరోజు వేతనం దాదాపు రూ.3 కోట్లు ప్రధానమంత్రి సహాయనిధికి ఇవ్వాలని నిర్ణయించింది.

# పక్కాగా పాల సరఫరా

- **డెయిరీ సిబ్బందికి డ్రెస్‌కోడ్, ఐడీకార్డులు జారీచేయండి**
- **డెయిరీ ప్రతినిధులతో సమావేశంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**



శనివారం హైదరాబాద్‌లో డెయిరీ ప్రతినిధులతో సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ నేపథ్యంలో పాలు, పాల పదార్థాల సరఫరాకు ప్రభుత్వం పక్కా చర్యలు తీసుకుంటున్నదని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. పాలు సరఫరా చేసే సిబ్బంది డ్రెస్‌కోడ్ పాటించేలా, వారికి ఐడీకార్డులు జారీచేసేలా డెయిరీ నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మాసాబ్‌ట్యాంక్‌లోని పశుసంవర్ధకశాఖ కాన్ఫరెన్స్‌హాల్‌లో శనివారం హెరిటేజ్, జెర్సీ, దొడ్ల, తిరుమల, అమూల్, కరీంనగర్, మస్కతి, మదర్ డెయిరీ, ముకుంద డెయిరీ ప్రతినిధులతో తలసాని సమావేశం నిర్వహించారు. డెయిరీ నిర్వాహకులకు సమస్యలుంటే కంట్రోల్ రూం నంబర్ 040-23450624 కు ఫిర్యాదుచేయాలని చెప్పారు. నిత్యావసర వస్తువులను ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయిస్తే పీడీయాక్ట్ కింద క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. కరోనా నేపథ్యంలో పాల సరఫరాకు డెలివరీ బాయ్స్ ముందుకు రావడంలేదని డెయిరీ నిర్వాహకులు తెలుపగా.. స్విగ్గి, బిగ్‌బాస్కెట్ తదితర డోర్‌డెలివరీ సంస్థల ద్వారా అవసరమైన మేరకు పాలు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని తలసాని ఆదేశించారు. పాల ఉత్పత్తుల సరఫరా సమయాన్ని కూడా పెంచేలా కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సమావేశానికి పశుసంవర్ధకశాఖ కార్యదర్శి అనితా రాజేంద్రన్, విజయడెయిరీ ఎండీ శ్రీనివాస్‌రావు, నార్మూల్ ఎండీ రమేశ్, దొడ్ల సీఈవో బీవీకే శంకరయ్య, ముకుంద డెయిరీ నుంచి శంకరయ్య, కరీంనగర్ డెయిరీ జీఎం ప్రభాకర్, జెర్సీ నుంచి గిరిభాస్కర్, హెరిటేజ్, అమూల్ డెయిరీ నుంచి వైబీరెడ్డి, మస్కతి డెయిరీ ఎండీ సుల్తాన్ బిన్ ఇబ్రహీం హాజరయ్యారు.

**అధిక ధరలకు దాణా విక్రయిస్తే పీడీయాక్ట్**

లాక్‌డౌన్ నేపథ్యంలో పశుగ్రాసం, దాణాను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్.. అధికారులను ఆదేశించారు. అవసరమైతే పీడీయాక్ట్ కింద కేసు నమోదుచేయాలని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లో పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ డాక్టర్ వీ లక్ష్మారెడ్డి, అదనపు డైరెక్టర్ డాక్టర్ రాచందర్, డెయిరీ ఎండీ శ్రీనివాస్‌రావుతో నిర్వహించిన సమావేశంలో తలసాని మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు దాణా విక్రయించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. వ్యాపారులు దాణా కృత్రిమ కొరత సృష్టించకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే 9121213220 నంబర్‌కు ఫిర్యాదుచేయాలని మంత్రి సూచించారు

# అందుబాటులో కూరగాయలు

- **331 ప్రాంతాల్లో 177 రైతుబజార్లు**
- **అధికారుల పనితీరు అభినందనీయం**
- **మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ నేపథ్యంలో కూడా ప్రజలకు అన్ని రకాల కూరగాయలు అందుబాటులోకి తెచ్చిన అధికారుల పనితీరును మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అభినందించారు. హైదరాబాద్‌లో 331 ప్రాంతాల్లో 177 మొబైల్ రైతు బజార్లను ఏర్పాటుచేసినట్టు చెప్పారు. శనివారం మార్కెటింగ్‌శాఖ అధికారులతో మంత్రి కూరగాయల సరఫరాపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహారాష్ట్ర నుంచి శుక్రవారం 1,800 క్వింటాళ్లు, శనివారం 6,500 క్వింటాళ్లు ఉల్లిగడ్డలు దిగుమతి అయినట్టు తెలిపారు. యూపీ నుంచి ఆలుగడ్డలు దిగుమతి చేసుకున్నట్టు చెప్పారు. ఏప్రిల్ 15 వరకు కూరగాయల కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలన్నారు.

**సరుకుల పంపిణీ,ధరల పర్యవేక్షణకు కమిటీ**

లాక్‌డౌన్ సందర్భంగా ప్రతి గ్రామానికి నిత్యావసర సరుకులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్ర, జిల్లా, మండలస్థాయిలో కమిటీలను ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రస్థాయిలో అగ్రికల్చర్, కార్పొరేషన్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ, జిల్లాస్థాయిలో కలెక్టర్, మండలస్థాయిలో తాసిల్దార్ చైర్మన్లుగా, వివిధ శాఖల అధికారులను కన్వీనర్లు, సభ్యులుగా నియమిస్తూ కమిటీలను ఏర్పాటుచేసింది. అన్నిస్థాయిల్లోని రవాణాశాఖ అధికారులకు ప్రత్యేక విధులను అప్పగించింది. సరుకులను తీసుకెళ్లేందుకు అన్ని వాహనాలకు అనుమతివ్వాలని ఆదేశించింది. జిల్లాల్లో నిత్యావసర వస్తువుల ధరలను పర్యవేక్షించేందుకు కమిటీని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, వివిధ శాఖల అధికారులు కన్వీనర్, సభ్యులుగా వ్యవహరిస్తారు.



హైదరాబాద్‌లోని ఓ అపార్టుమెంట్‌కు వచ్చిన మొబైల్ కూరగాయల వాహనం వద్ద కొనుగోళ్లు

## దివ్యాంగ ఉద్యోగులకు మినహాయింపు

- **అన్ని శాఖలను కోరిన సంక్షేమశాఖ డైరెక్టర్ శైలజ**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ నేపథ్యంలో దివ్యాంగ ఉద్యోగులకు విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ సంక్షేమశాఖ డైరెక్టర్, కమిషనర్ బీ శైలజ అన్ని ప్రభుత్వశాఖల విభాధిపతులకు లేఖ రాశారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలోని దివ్యాంగ, వృద్ధాశ్రమాల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకొన్నట్టు తెలిపారు. ఇందుకోసం జిల్లాల్లో ఆశ్రమాల పర్యవేక్షణకు బాధ్యతలు అధికారులకు అప్పగించారు. వరంగల్ అర్బన్ జిల్లా: జీ లక్ష్మీకాంత్‌రెడ్డి (8639585060), రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కామారెడ్డి; రాజేందర్ (7660021802), కరీంనగర్, మెదక్, సిద్దిపేట; జీ సుధాకర్ (7013150172), నిర్మల్, నిజామాబాద్, యాదాద్రి భువనగిరి, ఖమ్మం; జయంతి సాగర్ (9391386548), హైదరాబాద్, జగిత్యాల, జనగామ, మంచిర్యాల; ఏసీ శ్రీవాత్సవ(6300685558), ఆదిలాబాద్, భద్రాద్రికొత్తగూడెం, హైదరాబాద్, రంగారెడ్డి, మంచిర్యాల, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్లగొండ: సీ అనిల్ కుమార్ (8309545665).

## భవన కార్మికులకు భరోసా

- **మంత్రి కేటీఆర్ సూచనకు పురపాలకశాఖ స్పందన**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు సూచనల మేరకు నగరంలోని వివిధ ప్రాజెక్టుల్లో ఉన్న భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు పురపాలకశాఖ రంగంలోకి దిగింది. భవన నిర్మాణ కార్మికులు నిత్యావసరాలు కొనుక్కొనేందుకు వీలుగా వారికి పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్ పోలీసు పాసులు ఇప్పించారు. కార్మికులకు ఆరోగ్య పరీక్షలు జరిపించేందుకు తగిన ఏర్పాట్లుచేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని 168 ప్రాజెక్టుల్లో సుమారు 28,304 మంది కార్మికులు ఉన్నారు. కొవిడ్-19 మహమ్మారి కల్లోలం సృష్టిస్తున్న నేపథ్యంలో వీరంతా పనులు లేక ఖాళీగా ఉంటున్నారు.

## పట్టణాల పరిశుభ్రతపై దృష్టి

- **పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పట్టణాలన్నీ పరిశుభ్రంగా ఉంచేందుకు కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలని పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఆదేశించారు. కరోనా వైరస్ కట్టడికి తీసుకొంటున్న చర్యలను శనివారం ఆయన మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దవాఖానలు, మార్కెట్లు, ముఖ్యప్రాంతాల్లో సోడియం హైపోక్లోరైట్‌తో నిత్యం శుభ్రపరిచాలన్నారు. యాచకులు, ఇండ్లు లేనివారిని గుర్తించి రాత్రి వసతిగృహాలకు తరలించి భోజనం అందివ్వాలని తెలిపారు. పెట్రోల్ బంకులు, షాపులు, మార్కెట్లు, కార్యాలయాల్లో నిర్ణీత దూరాన్ని పాటించాలని చెప్పారు.

## మద్యం చోరీలపై నజర్ పెట్టండి

- **తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ నేపథ్యంలో మూతపడిన మద్యం దుకాణాల్లో చోరీలు జరుగకుండా నివారించాలని తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్ విజ్ఞప్తిచేసింది. శనివారం హైదరాబాద్ సీపీ అంజనీకుమార్, సైబరాబాద్ సీపీ సజ్జనార్, రాచకొండ సీపీ మహేశ్‌భగవత్‌కు వేర్వేరుగా లేఖలు రాశారు. మద్యానికి బానిసలైనవారితోపాటు దొంగలు మద్యం దుకాణాల్లో చోరీలకు ప్రయత్నిస్తున్నారని పోలీసుల దృష్టికి తెచ్చారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్, హిమాయత్‌నగర్‌లో చోరీ కేసులు నమోదైన నేపథ్యంలో వైన్స్ దుకాణాలపై పోలీసులు దృష్టిపెట్టాలని కోరారు.


తెలంగాణ ప్రభుత్వం
ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ
మెడికల్ ప్రొఫెషనల్స్ నియామకం

ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ, తెలంగాణ ప్రభుత్వం వారిచే కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించుటకు మెడికల్ ప్రొఫెషనల్స్ అనగా డాక్టర్లు, నర్సులు మరియు ల్యాబ్ టెక్నీషియన్లు (రిటైర్డ్ మెడికల్ ప్రొఫెషనల్స్‌తోసహా) నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి.
నియామక ప్రక్రియ, చెల్లించే రెమ్యూనరేషన్ వివరాలు మరియు ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం health.telangana.gov.inలో లభించును.
దరఖాస్తుకు ఆఖరి తేది: 03-04-2020.
సం/- స్పెషల్ చీఫ్ సెక్రటరీ టు గవర్నమెంట్,
ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ
DIPR RO.No. SPL./CL/ADVT/1/2019-20, Dt: 28-03-2020

OFFICE OF THE DIRECTOR OF AGRICULTURAL MARKETING
GOVERNMENT OF TELANGANA, HYDERABAD
Expression of Interest No. SE(AM)/TS/HYD/13/2019-20, Dated: 28-03-2020.
Expression of Interest for **"Supply, Delivery and Erection of Tarpaulins and Tents at different locations of Paddy Procurement Centers (PPCs) in Telangana State"**. Last date for submission of their interest along with details through mail on or before **03-04-2020.** Details can be obtained from the website: **//tsmarketing.in//** and also from Office of the Director of Agril. Marketing, L.B. Nagar, Hyderabad. Contact No. **7330733720 / 7330733126 / 7330733117, e-Mail Id: commrmktg.tg@gmail.com**
**Sd/- Superintending Engineer (AM) Officiating**

లాక్‌డౌన్
డే-6

“ ధాన్యంతోపాటు ఇతర వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లలో రైతుబంధు సమితి అధ్యక్షులు క్రియాశీలంగా వ్యవహరించాలి. గ్రామాల్లోనే ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి.
- పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు

● ప్రాణహిత వద్ద పహారా



పొరుగు రాష్ట్రాల నుంచి రాకపోకలు పూర్తిస్థాయిలో నిలువరించేందుకు తెలంగాణ సరిహద్దుల్లో పోలీసులు పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తాటిపెల్లి, గుండాయిపేట, వీర్దండి, తుమ్మిడిహెట్టి, వీరవెల్లి గ్రామాల సమీపంలోని పెన్‌గంగ, ప్రాణహిత నదుల వద్ద ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేసుకొని పోలీసులు పహారా కాస్తున్నారు. శనివారం ఎస్సై ఆంజనేయులు వీర్దండి గ్రామ సమీపంలోని ప్రాణహిత నది వద్దకు చేరుకొని పరిశీలించారు. మహారాష్ట్రలోని గోండ్‌పిప్రి ఎస్సై డోబెతో ఫోన్‌లో మాట్లాడి మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రయాణికులను అడ్డుకోవాలని సూచించారు. -కౌటాల రూరల్

# కొనుగోళ్లలో ‘రైతుబంధు’లే కీలకం

- గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- కోత యంత్రాలు, కూలీల తరలింపునకు అనుమతులివ్వాలి
- రైతుబంధు సమితి అధ్యక్షులకు ఎమ్మెల్సీ పల్లా సూచనలు

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** ధాన్యంతోపాటు ఇతర వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లలో రైతుబంధు సమితి అధ్యక్షులు క్రియాశీలంగా వ్యవహరించాలని రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. వరి, మక్కజొన్న పంటల కోత యంత్రాలు, కూలీల రవాణాకు అవసరమైన వాహనాలను ఏర్పాటు చేసుకొని, వాటికి అనుమతులు పొందాలని చెప్పారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పల్లా శనివారం రైతుబంధు సమితి అధ్యక్షులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. లాక్‌డౌన్ కారణంగా వ్యవసాయ మార్కెట్లలోని కొనుగోలు కేంద్రాలు మూతపడిన నేపథ్యంలో గ్రామాల్లోనే ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ప్రతి గ్రామ కొనుగోలు కేంద్రంలో గోనెసంచులు, కాంటాలు, టార్పాలిన్లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఆ కేంద్రాలకు వచ్చే రైతులు నిర్ణీత దూరం పాటించేలా చర్యలు తీసుకోవాలని, వారికి చేతులు కడుక్కోవడానికి అవసరమైన సబ్బులు, శానిటైజర్లు, నీరు సమకూర్చాలని చెప్పారు. వెటర్నరీ మందులు, విత్తన, ఎరువులు, పురుగుమందుల దుకాణాలను తెరిచి ఉంచే విధంగా చొరవ తీసుకోవాలని తెలిపారు. పశువుల దాణా రవాణా చేసే వాహనాలకు, వ్యవసాయ కూలీలను తరలించేందుకు అనుమతులివ్వాలని చెప్పారు. ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ పామాయిల్ ఉత్పత్తి మిల్లును నడిపించాలని కోరారు. రైతులు పండించిన పంటనంతా ప్రభుత్వం కొనుగోలుచేస్తుందనే భరోసా కల్పించాలని డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి సూచించారు.



ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

# కరోనాపై పండ్లతో దాడి!

రోగ నిరోధక శక్తితోనే వ్యాధిపై పోరు ● విటమిన్-సి, ప్రొటీన్లు, కార్బొహైడ్రేట్లతో ఇమ్యూనిటీ

నిమ్మజాతి పండ్లు, కూరగాయల్లో సమృద్ధిగా పోషకాలు ● వైద్య నిపుణులు, శాస్త్రవేత్తల సూచన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వ్యాక్సిన్లు, మందులులేని కరోనా వైరస్‌ను శరీరంలోని రోగనిరోధక శక్తితో ఎదుర్కోవడం ద్వారానే చాలామంది బతికి బయటపడుతున్నారు. వివిధ దీర్ఘకాలిక వ్యాధుల కారణంగా రోగనిరోధక శక్తి తగ్గినవారే కరోనాకు బలవుతున్నారు. అందువల్ల కరోనాపై పోరాడటానికి శరీరంలో వ్యాధి నిరోధకశక్తిని పెంచుకోవడమే ఉత్తమమార్గమని వైద్యులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. అందువల్ల యాంటి ఆక్సిడెంట్లు, సీ-విటమిన్, ప్రొటీన్లు, ఖనిజ లవణాలు అధికంగా ఉండే ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలని అంటున్నారు. విటమిన్-సీని సమృద్ధిగా తీసుకుంటే రోగనిరోధక శక్తి పెరుగుతుందని, యాంటి ఆక్సిడెంట్ల వల్ల శరీరంలో పేరుకుపోయిన రసాయన వ్యర్థాలు తొలగిపోతాయని తెలుపుతున్నారు. నిమ్మజాతి పండ్లు, ఆకు పచ్చని కూరగాయల్లో సి-విటమిన్, ఇతర పోషకాలు లభిస్తాయని, తక్కువ ధరకే లభించే ఈ ఆహార పదార్థాలతో కరోనాపై సగం విజయం సాధించవచ్చని అంటున్నారు.

**విటమిన్-సీ అధికంగా ఉండే పదార్థాలు**

నిమ్మ, బత్తాయి, దానిమ్మ, ఉసిరి, టమాట, బొప్పాయి, జామ, మిరప, ఆకు పచ్చని కాయగూరలు. ఈ పండ్లలోని సిట్రిక్ ఆమ్లం శరీరంలోని విష పదార్థాలను తొలగిస్తుంది. టమాటలో ఉండే లైకోపీన్ కూడా యాంటి ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది.



**రాష్ట్రంలో పండ్ల సాగు**

తెలంగాణలోని నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, ఖమ్మం, వరంగల్, మెదక్, నిజామాబాద్‌లోని కొన్ని ప్రాంతాలలో నిమ్మ, బత్తాయి సాగవుతున్నాయి. రాష్ట్రంలో నిమ్మ 60 ఎకరాల్లో సాగవుతుండగా, బత్తాయి దాదాపు లక్ష ఎకరాల్లో సాగవుతున్నది. సంవత్సరమంతా అందుబాటులో ఉండే ఈ పండ్లను మనదేశంలోని పలు ప్రధాన నగరాలతోపాటు విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు. కాగా, కరోనా నేపథ్యంలో ఈ పండ్లను ఎగుమతి చేయవద్దని, వాటిని హైదరాబాద్ తరలించాలని సీఎం కేసీఆర్ ఇటీవల అధికారులను ఆదేశించారు.



**ప్రొటీన్లు లభించే పదార్థాలు:**
**చికెన్, గుడ్లు**

**నిమ్మ, బత్తాయిలో పోషక విలువలు**

- నిమ్మకాయలో క్యాలరీలు 29 గ్రాములు, ప్రొటీన్స్ 1.1 గ్రాము, కార్బొహైడ్రేట్స్ 9గ్రాములు, చక్కెర 2.5 గ్రాములు, పీచుపదార్థం 2.8 గ్రాములు. కొవ్వు -0 , విటమిన్-సీ 88శాతం, ఐరన్ 3శాతం, కాల్షియం 2శాతం, విటమిన్ బీ-6.5శాతం, మెగ్నీషియం 2శాతం, సోడియం 2 మి.గ్రా., పొటాషియం 138 మి.గ్రా., విటమిన్-ఏ ఎక్కువ మోతాదులో ఉంటుంది.
- బత్తాయిలో విటమిన్-సీ 44-50 మి.గ్రా, క్యాలరీలు 47 శాతం, ప్రొటీన్ 0.9 గ్రాములు, కార్బొహైడ్రేట్స్ 11.8 గ్రాములు, చక్కెర 9.4 గ్రాములు, పీచుపదార్థాలు 2.4 గ్రాములు. కొవ్వు 0.1 గ్రాము, విటమిన్-బీ 8 శాతం, కాల్షియం 4 శాతం, మెగ్నీషియం 2 శాతం, పొటాషియం 181 మిల్లీగ్రాములు, విటమిన్-ఏ 4 శాతం. ఇంకా థయామిన్, ఫోలిక్ అమ్లం, ఇతర ఖనిజ పోషకాలు లభిస్తాయి.

# నిమ్మ, బత్తాయి రైతులకు భరోసా

సీఎం కేసీఆర్‌కు మండలి చైర్మన్ గుత్తా ధన్యవాదాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నల్లగొండ జిల్లా బత్తాయి, నిమ్మ రైతుల కష్టాన్ని అర్థం చేసుకొని వారికి భరోసా ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు శాసనసమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సీఎం కేసీఆర్ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తంచేశారు. లాక్‌డౌన్ నేపథ్యంలో శుక్రవారం పలువురు బత్తాయి, నిమ్మ రైతులు తనను సంప్రదించగా.. సమస్యలను ఫోన్ ద్వారా సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్టు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వయంగా రైతు అయిన సీఎం కేసీఆర్ ఈ సమస్యపై సానుకూలంగా స్పందించారని, బత్తాయిలను రాష్ట్రంలోని అన్ని రైతుబజార్లు, జిల్లా, తాలూకా కేంద్రాల్లో విక్రయించాలని అధికారులను ఆదేశించారని చెప్పారు. కరోనాను ఎదుర్కోవడానికి రోగ నిరోధక శక్తి ముఖ్యమని, బత్తాయి, నిమ్మలో సీ విటమిన్ అధికంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని ప్రజలను కోరారు.



# తెలంగాణ కృషి భేష్

- కేంద్రంకంటే ముందే నియంత్రణ చర్యలు
- కరోనా జన్యుక్రమంపై సీసీఎంబీ పరిశోధన
- సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్ మిశ్రా వెల్లడి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వ్యాప్తి కట్టడిలో తెలంగాణ ప్రభుత్వం అద్భుతంగా కృషిచేస్తున్నదని హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులర్, మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ)డైరెక్టర్ రాకేశ్‌మిశ్రా ప్రశంసించారు. ప్రభుత్వం మాత్రమే చర్యలు తీసుకొంటే సరిపోదని.. ప్రజలు ప్రభుత్వానికి సంపూర్ణంగా సహకరించాలని కోరారు. కేంద్రం నిర్ణయాలు తీసుకోవడానికి ముందే తెలంగాణ ప్రభుత్వం కచ్చితమైన చర్యలను ప్రకటించిందన్నారు. కొవిడ్-19 పరీక్షలు నిర్వహించడానికి అవసరమైన కిట్లను సమకూర్చడానికి తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తున్నదని.. ఒకటి రెండురోజుల్లో అవి అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. కరోనా వైరస్ జన్యుక్రమాన్ని కనుగొనడానికి దేశవ్యాప్తంగా 600 నమూనాలు సేకరించి పరిశోధన ప్రారంభిస్తామన్నారు. చైనా నుంచి అమెరికా వరకు అన్ని దేశా ల్లో కరోనా జన్యుక్రమాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. చైనాలోని వూహాన్‌లో పుట్టిన వైరస్‌కు, ఇటలీ, ఇరాన్, అమెరికాలో విస్తరించిన వైరస్‌కు, భారత్‌లో వ్యాపిస్తున్న దాని జన్యుక్రమంలో తేడాలు తెలుసుకొనేందుకు ప్రయత్నిస్తున్నామరు. ఆయా దేశాల భౌగోళిక స్థితి, వాతావరణాన్ని బట్టి వైరస్‌లో మార్పులొచ్చేందుకు ఆస్కారమున్న విషయాలను నిర్ధారిస్తామని తెలిపారు.

## అగ్రి పరికరాల కొనుగోలుకు కమిటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రైతులకు వివిధ సబ్సిడీ పథకాల కింద సూక్ష్మ పోషక పదార్థాలు, పురుగుమందులు, ఇతర సూక్ష్మ ఎరువులను సరఫరా చేసేందుకు అవసరమైన వాటిని కొనుగోలు చేసేందుకు టెక్నికల్ టెండర్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఈ మేరకు శనివారం వ్యవసాయ శాఖ కార్యదర్శి డాక్టర్ బీ జనార్దన్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు.

**ఎరువుల నిల్వ, రవాణాకు కమిటీ**

వ్యవసాయ కోఆపరేటివ్‌శాఖ ఆధ్వర్యంలో 2020-21 సంవత్సరానికి ఎరువుల స్టోరేజీ, రవాణా కాంట్రాక్ట్ ఖరారు కోసం ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ మేరకు శనివారం వ్యవసాయశాఖ కార్యదర్శి డాక్టర్ బీ జనార్దన్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు.

## ఐదునెలలు తాగునీరు ఎలా?

- తెలుగు రాష్ట్రాలకు కృష్ణా బోర్డు లేఖ




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శ్రీశైలం జలాశయంలో కనీస నీటి సేకరణస్థాయి దిగువన ఇప్పటికే రెండు టీఎంసీల నీటిని వినియోగించారని, ఇదే కొనసాగితే రానున్న ఐదు నెలలపాటు తాగునీటి అవసరాలకు నిల్వలు ఎలా? అని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఆవేదన వ్యక్తంచేసింది. ఈ మేరకు రెండు రాష్ట్రాల ఈఎన్సీలకు బోర్డు శనివారం లేఖ రాసింది. వేసవి ఆరంభంలోనే ఎండీడీఎల్ దిగువన నీటిని వాడుకోవడమంటే ఆగస్టు వరకు అవసరాలు ఎలా అని ప్రశ్నించింది. ఇప్పటికైనా నియంత్రించుకోవాలని సూచించింది.

# వైరస్ నియంత్రణకు అస్త్రాలు!

శానిటైజర్లు, వెంటిలేటర్లు, బాడీ సూట్ల తయారీ ● ఎన్95కి దీటుగా ఎన్99 మాస్కులు

బీహెచ్‌ఈఎల్‌తో కలిసి వెంటిలేటర్ల ఉత్పత్తి ● ‘నమస్తే తెలంగాణ’తో డీఆర్డీవో చైర్మన్ సతీశ్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భారత రక్షణరంగంలో కీలకపాత్ర పోషిస్తున్న ‘రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో) కరోనాపై పోరుకు అస్త్రాలను తయారుచేస్తున్నది. రోగులు, వైద్య సిబ్బంది కోసం కీలకమైన మాస్కులు, శానిటైజర్లు, వెంటిలేటర్లు, బాడీసూట్లను రూపొందిస్తున్నామని డీఆర్డీవో చైర్మన్ సతీశ్‌రెడ్డి ‘నమస్తే తెలంగాణ’కు తెలిపారు. వాటికోసం ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలు తమను సంప్రదించాయని చెప్పారు. ఈ నేపథ్యంలో కొన్ని ప్రైవేటు కంపెనీలతో కలిసి భారీస్థాయిలో వాటిని తయారుచేసేందుకు ప్రయత్నిస్తున్నామని సతీశ్‌రెడ్డి తెలిపారు.



**ఎన్-99 ఎంతో ఉపయోగకరం**

‘ప్రస్తుతం మార్కెట్‌లో ఎన్-95 మాస్కులు లభిస్తున్నాయి. మేము మోనో మెస్ బేస్డ్ ఫిల్టర్ ఉపయోగించి ఐదు లేయర్లతో ఎన్-99 మాస్కులను అభివృద్ధి చేశాం. ఇవి ఎంతో సమర్థవంతంగా పనిచేస్తాయి. ధర ఎన్-95 కంటే కాస్త ఎక్కువైనప్పటికీ పనితీరు బాగుంటుంది. మూడు నాలుగు రోజుల్లో లక్ష ఎన్-99 మాస్కులను అందుబాటులోకి తెస్తాం. బీహెచ్‌ఈఎల్‌తో కలిసి వెంటిలేటర్లను అభివృద్ధిచేశాం. మూడువారాల్లో ఐదువేల వెంటిలేటర్లను అందిస్తాం. నెలకు పదివేల నుంచి 20వేల వరకు అందుబాటులోకి తెస్తాం’ అని సతీశ్‌రెడ్డి వివరించారు.

**త్వరలో పెద్ద మొత్తంలో శానిటైజర్లు**

వివిధ రాష్ట్రాల్లో ఉన్న డీఆర్డీవో పరిశోధనశాలల్లో శానిటైజర్లను తయారుచేస్తున్నాం. ఇప్పటికే సైన్యానికి 25 వేల బాటిల్స్ వరకు పంపిణీ చేశాం. రోజుకు 20 నుంచి 30 వేల లీటర్ల వరకు ఉత్పత్తి చేస్తున్నాం. పార్లమెంట్‌కు, ఇతర రక్షణ విభాగాలకు అందించాము. కరోనా రోగులను ఉంచే వార్డుల్లో పనిచేసే డాక్టర్లు, నర్సుల కోసం బాడీ సూట్లను కూడా తయారుచేస్తున్నాం. డిఫెన్స్ అవసరాల కోసం అభివృద్ధి చేసిన సూట్లను ప్రస్తుత అవసరాల కోసం కొన్ని మార్పులు చేసి వేల సంఖ్యలో అందుబాటులోకి తెస్తున్నాం’ అని సతీశ్‌రెడ్డి వెల్లడించారు.

## డిజిథాన్ ఆన్‌లైన్ క్లినిక్

టీటా ఆన్‌లైన్ వైద్యసేవల డెమో విజయవంతం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహమ్మారి కొవిడ్-19పై పోరాటంలో తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) కీలక ముందుడుగు వేసింది. ‘డిజిథాన్ కొవిడ్-19 క్లినిక్’ పేరుతో ఆన్‌లైన్ క్లినిక్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ ఆన్‌లైన్ వైద్యసేవల డెమో విజయవంతంగా పూర్తయింది. విదేశాల్లోని భారతీయ కరోనా బాధితులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో ప్లాట్‌ఫాం ఏర్పాటుచేసిన టీటా.. ‘డిజిథాన్ కొవిడ్-19 క్లినిక్’ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

## ఏపీలో మరో ఆరు పాజిటివ్ కేసులు

మొత్తం 19 పాజిటివ్ కేసులు నమోదు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్‌లో శనివారం ఒక్కరోజే ఆరు పాజిటివ్ కరోనా కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు ఏపీ సర్కార్ తాజా బులెటిన్ విడుదల చేసింది. మొత్తం 74 మంది శాంపిళ్లు పరీక్షించగా వాటిలో 68 నెగెటివ్‌గా వచ్చాయని, మొత్తం 19 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని వెల్లడించింది. విదేశాల నుంచి వచ్చిన 29,264 మందిపై ప్రత్యేక నిఘా ఉంచామని, విదేశాల నుంచి ఏపీకి వచ్చిన 149 మందికి వివిధ దవాఖానల్లో చికిత్స అందిస్తున్నట్టు స్పష్టంచేసింది.

# ఔటర్‌పై ప్రమాదం.. 8 మంది మృతి

- మరో 20 మందికి గాయాలు
- కూలీలు సూర్యాపేట నుంచి కర్ణాటక వెళ్తుండగా ఘటన

**శంషాబాద్:** కరోనా మహమ్మారి నుంచి ప్రాణాలు కాపాడుకోవాలని సొంతూర్లకు బయల్దేరిన కూలీలకు ప్రమాదం రూపంలో మృత్యువు అడ్డుపడింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు దుర్మరణం చెందగా మరో 20 మందికి గాయాలయ్యాయి. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. కర్ణాటకకు చెందిన 31 మంది కూలీలు లాక్‌డౌన్ కారణంగా పనులు లేక సూర్యాపేటలో పస్తులు ఉంటున్నారు. దాంతో సొంతూర్లకు వెళ్లాలనుకొని బొలేరో వాహనాన్ని (కేఏ36బీ8264)ను అద్దెకు తీసుకొని శుక్రవారం అర్ధరాత్రి బయల్దేరారు. పెద్ద గోల్కొండ వద్ద ఔటర్ రింగ్‌రోడ్డుపై వెనుక నుంచి దూసుకొచ్చిన లారీ (జీజే06బీటీ0823) బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చింటూ(45), రంగప్ప(35), శరణప్ప(35), అమ్రిష్(30), కళ్లప్ప(30), బసమ్మ(35), సిరియమ్మ(9), హన్మంతప్ప(2) అక్కడికక్కడే చనిపోయారు. మరో 20 మంది గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.



ఔటర్ రింగ్‌రోడ్డుపై ప్రమాదానికి గురైన బొలేరో వాహనం




తిరుమల వేదవిజ్ఞానపీఠంలో ధన్వంతరి మహాయాగం నిర్వహిస్తున్న దృశ్యం

# కొవిడ్ కట్టడికి హోమాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ వ్యాప్తికి అడ్డుకట్ట పడి ప్రజలంతా సుఖంగా ఉండాలని కోరుతూ రాష్ట్రంలోని పలు ప్రధాన దేవాలయాల్లో శనివారం హోమాలు నిర్వహించారు. కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు తిరుమలలోని ధర్మగిరి వేదవిజ్ఞానపీఠంలో ఈ నెల 26 నుంచి నిర్వహించిన శ్రీశ్రీనివాస శాంత్యోత్సవ సహిత ధన్వంతరి మహాయాగం శనివారం మహా పూర్ణాహుతితో ముగిసింది. కార్యక్రమంలో శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపనందేంద్ర స్వామి, పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్ స్వామి పాల్గొన్నారు. సికింద్రాబాద్ గణపతి దేవాలయంలో ధన్వంతరి, మహా మృత్యుంజయ హోమం జరిపారు. వేములవాడ, భద్రాచలం, ధర్మపురి, జోగుళాంబ ఆలయాలు, ఏడుపాయల దుర్గాభవానీ ఆలయం, వరంగల్ భద్రకాళి దేవాలయం, తాడుబందు వీరాంజనేయస్వామి, నాచారం లక్ష్మీనరసింహస్వామి ఆలయం, చిక్కడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం, కాళేశ్వర, ముక్తేశ్వరస్వామి దేవాలయం, అమీర్‌పేట కనక దుర్గ దేవాలయంలో మృత్యుంజయ హోమాలు నిర్వహించారు.

# ఆపన్నులను ఆదుకొందాం

శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ నేపథ్యంలో ఆకలితో అలమటిస్తున్న యాచకులు, కూలీలను ఆదుకోవాలని భక్తులకు విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి పిలుపునిచ్చారు. టీటీడీతోపాటు దేవాదాయ, ధర్మాదాయశాఖ పరిధిలోని అన్ని ఆలయాలు అన్నప్రసాదాల పంపిణీకి ముందుకు రావాలని సూచించారు. కరోనా వైరస్ కట్టడికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న సూచనలను ప్రజలందరూ తూచా తప్పక పాటించాలని పిలుపునిచ్చారు. కొవిడ్-19ను అరికట్టాలని వేడుకొంటూ స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి పర్యవేక్షణలో 11 రోజులపాటు సాగిన విషజ్వర పీడాహర యాగం పూర్ణాహుతి శనివారం ముగిసింది. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ.. సర్వమానవాళి ఆయురారోగ్యాలతో ఉండాలనే సంకల్పంతో ఈ యాగాన్ని తలపెట్టినట్టు చెప్పారు.

# 50 వేల అన్న పొట్లాల పంపిణీ

టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆపత్కాలంలో ఆదుకొనేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం సిద్ధం ఉంటుందని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. పనులు లేక ఆకలితో అలమటిస్తున్న పేదలు, అనాథలు, లాక్‌డౌన్ కాలంలో సేవలందిస్తున్న సిబ్బందికి టీటీడీ నిత్యం 50 వేల ఆహార పొట్లాలను అందజేస్తున్నట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతి పద్మావతి మహిళా వర్సిటీలో కరోనా వైరస్‌కు చికిత్స అందిస్తామని, అవసరమైన వెంటిలేటర్లు, ఇతర వైద్య పరికరాలను స్విమ్స్ నుంచి ఇస్తామన్నారు. తిరుచానూరు పద్మావతి నిలయాన్ని క్వారంటైన్ కేంద్రంగా వాడుకోవాలని ఇప్పటికే ప్రభుత్వానికి తెలిపామన్నారు.

**ఒక్కరోజే 179 కేసులు**

శనివారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా 179 కొత్త కరోనా కేసులు నమోదయ్యాయి. ఒక రోజులో నమోదైన కేసుల సంఖ్యలో ఇదే అత్యధికం.



**కడుపుమాడ్చిన లాక్‌డౌన్.. అవస్థలు పెడుతున్న 'బార్డర్ లాక్'**
లాక్‌డౌన్ నేపథ్యంలో ఢిల్లీ నుంచి వేలమంది వలస కార్మికులు యూపీలోని సొంతూళ్లకు తిరుగు ప్రయాణమయ్యారు. రెండు రాష్ర్టాల సరిహద్దులో పోలీసులు అడ్డగించడంతో రోజంతా ఇలా అవస్థలు పడ్డారు.



**ఇంట్లో వసతులు కరువు.. 'హోం క్వారంటైన్'గా మారిన తరువు**
ఇంట్లో వసతులు లేకపోవడంతో చెట్లమీదే స్వీయ నిర్బంధానికి ఏర్పాటుచేసుకున్న పశ్చిమబెంగాల్‌లోని వంగిడి గ్రామ కార్మికులు. వీరు ఇటీవలే చెన్నై నుంచి తిరిగొచ్చారు.



**కరోనా బూచి ఎత్తుకుపోతుంది జాగ్రత్తా..!**
శనివారం చెన్నైలో ఓ తల్లి లాక్‌డౌన్‌ను ధిక్కరించి తన కొడుకును బైక్‌పై తీసుకురాగా.. 'కరోనా హెల్మెట్' ధరించిన ఓ పోలీసు వారిని వారిస్తున్న దృశ్యం

# కోటిలో ఏడుగురికే!

**న్యూఢిల్లీ:** కరోనా విశ్వమారి ఒక్కో దేశంపై విరుచుకుపడుతున్నది. అయితే మిగతా దేశాలతో పోల్చితే మాత్రం.. భారత్‌లో పరిస్థితి కాస్త మెరుగ్గానే ఉన్నది. దేశంలో 929 కేసులు నమోదయ్యాయి. కేసులు/జనాభా నిష్పత్తి ఆధారంగా విశ్లేషిస్తే.. మన దేశంలో ప్రతి 10 లక్షల మందిలో 0.7 మందికి మాత్రమే వైరస్ సోకింది. అంటే.. కోటి మందిలో ఏడుగురు బాధితులు ఉన్నట్టు లెక్క. సమూహవ్యాప్తి దశకు చేరకముందే వైరస్‌ను కట్టడి చేస్తేనే సురక్షితంగా ఉంటామని నిపుణులు చెప్తున్నారు. ఇందుకు అనుగుణంగా కేంద్రం లాక్‌డౌన్‌తోపాటు అనేక ఏర్పాట్లు చేస్తున్నది.

## రైలుబోగీల్లో ఐసొలేషన్‌వార్డులు

వైద్యసదుపాయాలు లేని ప్రాంతాల్లో కరోనా బాధితులకు చికిత్స అందించేందుకు రైల్వేశాఖ ప్రత్యేకంగా 'ఐసొలేషన్ బోగీల'ను తయారుచేస్తున్నది. ఓ జనరల్ బోగీని ఐసొలేషన్ వార్డుగా మార్చిన చిత్రాలను శనివారం మీడియాకు విడుదలచేసింది. ప్రతి రైల్వేజోన్‌లో ప్రతి వారం పది బోగీల్లో ఐసొలేషన్‌వార్డులు ఏర్పాటుచేస్తామని వెల్లడించింది. మధ్య, పక్క బెర్తులను తొలిగించి ఒక్కోకూపెలో ఇద్దరు నుంచి నలుగురు ఉండేలా ఏర్పాటుచేశారు. ఒక రోగి గాలి మరొకరికి తగులకుండా మధ్యలో కర్టెన్లు పెడతారు. ప్రతికోచ్‌లోని నాలుగు మరుగుదొడ్లను రెండు బాత్‌రూమ్‌లుగా మారుస్తారు. ఇందులో హ్యాండ్‌షవర్, బకెట్, మగ్ ఉంటాయి. రోగుల వార్డులతోపాటు కన్సల్టేషన్ గదులు, మెడికల్ స్టోర్, ఐసీయూ, చిన్నగదుల వంటి సౌకర్యాలు ఏర్పాటుచేస్తారు.



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో బోగీలను శుభ్రం చేస్తున్న సిబ్బంది



ముంబైలోని ఓ మురికివాడలో రసాయనాలను పిచికారీ చేస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది

**అత్యధిక కేసులు నమోదైన దేశాల్లో వ్యాప్తి శాతాన్ని పరిశీలిస్తే..**

| దేశం | కేసులు | మృతులు | జనాభా (కోట్లలో) | ప్రతి 10లక్షల మందిలో కేసులు |
|---|---|---|---|---|
| అమెరికా | 116,050 | 1,937 | 30 | 315 |
| ఇటలీ | 92,472 | 10,023 | 06 | 1,431 |
| చైనా | 81,394 | 3,295 | 150 | 57 |
| స్పెయిన్ | 72,248 | 5,812 | 4.7 | 1,545 |
| జర్మనీ | 56,202 | 403 | 8.4 | 637 |
| ఇరాన్ | 35,408 | 2,517 | 0.8 | 422 |
| ఫ్రాన్స్ | 32,964 | 1,995 | 6.7 | 505 |
| యూకే | 17,089 | 1019 | 6.7 | 214 |
| స్విట్జర్లాండ్ | 13,377 | 242 | 0.8 | 1,528 |
| ద.కొరియా | 9,478 | 144 | 0.5 | 185 |
| భారత్ | 929 | 20 | 130 | 0.7 |

**రాష్ర్టాల వారీగా ప్రతి 10 లక్షల మందిలో నమోదైన కేసుల సంఖ్యను పరిశీలిస్తే..**

| దేశం | కేసులు | మృతులు | జనాభా (కోట్లలో) | ప్రతి 10లక్షల మందిలో కేసులు |
|---|---|---|---|---|
| మహారాష్ట్ర | 180 | 5 | 12.3 | 1.5 |
| కేరళ | 176 | 1 | 3.4 | 5.1 |
| తెలంగాణ | 67 | 1 | 04 | 1.5 |
| కర్ణాటక | 55 | 2 | 6.8 | 0.8 |
| రాజస్థాన్ | 54 | 0 | 7.9 | 0.6 |
| గుజరాత్ | 45 | 3 | 6.9 | 0.7 |
| యూపీ | 55 | 0 | 22.8 | 0.2 |
| ఢిల్లీ | 39 | 1 | 1.9 | 2 |
| తమిళనాడు | 40 | 1 | 8.1 | 0.5 |
| పంజాబ్ | 38 | 1 | 03 | 1.3 |

### 8 ఏండ్ల కిందటే కరోనా

**న్యూఢిల్లీ:** ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ ఇప్పటికిప్పుడు కొత్తగా ఉనికిలోకి లేదు. ఈ ప్రాణాంతక వైరస్ 2012-13లో కూడా ఒకసారి వెలుగుచూసింది. మధ్యతూర్పు ప్రాంతం (అరేబియా ద్వీపకల్పం)లో జూన్ 2012లో తొలిసారిగా బయటపడిన కరోనా ప్రభావం మే 2013 వరకూ కొనసాగింది. సౌదీ అరేబియా, బ్రిటన్, ఫ్రాన్స్, జోర్డాన్ తదితర దేశాలకు విస్తరించిన ఈ వైరస్ కారణంగా నాడు 18 మంది వరకు చనిపోగా, 34 కేసులు నమోదయ్యాయి.

### ఎంపీలాడ్స్ నుంచి రూ.కోటి విరాళం ఇవ్వాలి

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్‌పై జరుగుతున్న పోరులో భాగంగా బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు విరాళాలు ఇవ్వాలని ఆపార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా పిలుపునిచ్చారు. బీజేపీకి చెందిన ఎంపీలందరూ తమ ఎంపీలాడ్స్ నిధుల నుంచి కోటి రూపాయల చొప్పున విరాళంగా ఇవ్వాలని సూచించారు. ఈ విరాళాలను సెంట్రల్ రిలీఫ్ ఫండ్‌కి జమ చేయాలని కోరారు. అలాగే బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ ఒక నెల జీతాన్ని సెంట్రల్ రిలీఫ్ ఫండ్‌కి జమ చేయాలని సూచించారు. మరోవైపు కరోనాపై పోరు కోసం ప్రతి ఎంపీ తన ఎంపీలాడ్స్ నిధుల నుంచి రూ.కోటి కేటాయించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కోరారు.



### రోడ్లపైకి అరుదైన వన్యప్రాణులు

**న్యూఢిల్లీ:** కరోనా నేపథ్యంలో జనాలు ఇండ్లకే పరిమితం కావడంతో అరుదైన వన్యప్రాణులు రోడ్ల మీదకు వస్తున్నాయి. ఒంటిపై పెద్ద మచ్చలున్న 'మలబార్ పునుగు పిల్లి' ఇటీవల కేరళలోని కోజికోడ్‌లో రోడ్డు మీద కనిపించింది. డెహ్రాడూన్‌లో మచ్చల జింక రోడ్డు మీద పరుగెత్తుతున్న వీడియో ట్విట్టర్‌లో ప్రత్యక్షమైంది.

### ఉచితంగా వాహనాల రిపేర్ సేవలు

**బెంగళూరు:** కరోనా నేపథ్యంలో ప్రజలకు అత్యవసర సేవలు అందించే పోలీసు లాంటి డిపార్టుమెంట్లకు 'పిట్‌స్టాప్' సంస్థ అండగా నిలిచింది. సేవలందించే క్రమంలో ఈ విభాగాలకు చెందినవారి వాహనాలు చెడిపోతే వాటిని ఉచితంగా రిపేర్ చేస్తామని తెలిపింది. ఈ సేవలు హైదరాబాద్ తదితర నగరాల్లో అందు బాటులో ఉంటాయని, 6262621234 నంబర్‌కు ఫోన్‌చేస్తే సరిపోతుందని పేర్కొంది.

### గుండెపైనా కరోనా ప్రభావం!


**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ శ్వాస వ్యవస్థపైనే కాదు.. హృదయనాళాలపైనా ప్రభావం చూపుతుందని హ్యూస్టన్‌లోని 'ది యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ హెల్త్ సైన్సెస్ సెంటర్' నిపుణుల బృందం తెలిపింది. హృద్రోగ సమస్యలు లేకుండా కరోనా బారిన పడిన రోగులను పరీక్షించగా ఈ విషయం వెల్లడైందని పేర్కొంది. 'గుండె సంబంధిత సమస్యలు లేకుండా కొవిడ్-19 బారినపడి అనారోగ్యానికి గురైన వారిని పరీక్షించగా వారి హృదయ నాళాలపైనా వైరస్ ప్రభావం చూపినట్లుగా తేలింది' అని నిపుణుల బృందానికి నేతృత్వం వహించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ మహమ్మద్ మద్‌జీద్ తెలిపారు.

### అంబులెన్స్‌లోనే ప్రసవం

**కాసర్‌గఢ్:** ప్రసవం కోసం గర్భిణిని అంబులెన్స్‌లో దవాఖానకు తీసుకెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆ మహిళ అంబులెన్స్‌లోనే బిడ్డకు జన్మనిచ్చారు. బీహార్‌కు చెందిన వలస కార్మికులైన గౌరీ దేవి, ఆమె భర్త కేరళ సరిహద్దు జిల్లా కాసర్‌గఢ్‌లో నివాసముంటున్నారు. అయితే గర్భిణి అయిన గౌరీదేవికి పురిటి నొప్పులు రావడంతో కర్ణాటక సరిహద్దులోని మంగళూరులో ఓ దవాఖానకు అంబులెన్స్‌లో తీసుకెళ్లారు. కరోనా నేపథ్యంలో ఇతర రాష్ర్టాల వాహనాలను అనుమతించమని కర్ణాటక పోలీసులు చెప్పారు. ఇదే సమయంలో గౌరీదేవి ఆడబిడ్డకు జన్మనిచ్చారు.

## మురుగునీటిలో కరోనా వైరస్!

**గుర్తించిన నెదర్లాండ్స్ పరిశోధకులు**



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మురుగునీటిలో కరోనా వైరస్ ఉన్నట్లు నెదర్లాండ్స్‌కు చెందిన 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పబ్లిక్‌హెల్త్ అండ్ ది ఎన్విరాన్‌మెంట్' సంస్థ గుర్తించింది. కరోనా బాధితుల మలం ద్వారా ఇది మురుగునీటిలో కలుస్తున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో వైరస్ సంక్రమించకుండా చూడడంలో మురుగునీటి నిర్వహణ కూడా ముఖ్యమైన అంశమని పేర్కొంది. పారిశుద్ధ్య కార్మికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మురుగునీటిని నేరుగా తాకకూడదని, రక్షిత దుస్తులు, బూట్లు, కండ్ల అద్దాలు, మాస్కులు ధరించాలని సూచించింది. గతంలోనూ మురుగునీటిలో పోలియో, తట్టు కారక వైరస్‌లు, యాంటీబయోటెక్ రెసిస్టెంట్ బ్యాక్టీరియా ఉనికిని గుర్తించినట్లు తెలిపింది. కరోనా వైరస్‌ను మాలిక్యులార్ విధానాలను ఉపయోగించి ఆమ్‌స్టర్‌డ్యామ్‌లోని మురుగునీటి శుద్ధి ప్లాంట్‌లో గుర్తించారు.

### 5 నిమిషాల్లోనే పరీక్ష

**కిట్‌ను రూపొందించిన అమెరికా కంపెనీ**

**వాషింగ్టన్:** ప్రపంచ దేశాలను గడగడలాడిస్తున్న కరోనా మహమ్మారి నిర్ధారణ పరీక్షల్ని అత్యంత వేగంగా నిర్వహించేందుకు అమెరికాకు చెందిన ఔషధసంస్థ 'అబాట్ లేబొరేటరీస్' ఓ కిట్‌ను రూపొందించింది. దీనిద్వారా కేవలం ఐదు నిమిషాల్లో కరోనా నిర్ధారణ పరీక్షల్ని నిర్వహించవచ్చని ఆ సంస్థ ఓ ప్రకటనలో వెల్లడించింది. కరోనా పాజిటివ్ ఫలితాన్ని 5 నిమిషాల్లో, నెగెటివ్ ఫలితాన్ని 13 నిమిషాల్లో నిర్ధారించే ఈ కిట్‌కు 'అమెరికా ఫుడ్, డ్రగ్ అడ్మినిస్ట్రేషన్' (ఎఫ్‌డీఏ) అనుమతినిచ్చిందని సంస్థ పేర్కొంది. కరోనా నిర్ధారణకు ఈ పోర్టబుల్ మాలిక్యులర్ టెస్టు ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపింది.

## వలస కార్మికులకు సహాయ శిబిరాలు

- ఏర్పాటుచేయాలని రాష్ర్టాలను కోరిన కేంద్రం
- తాత్కాలిక వసతి, భోజనం అందించాలని సూచన
- ఎస్డీఆర్‌ఎఫ్ నిధులను ఉపయోగించుకోవచ్చని వెల్లడి

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్త లాక్‌డౌన్‌తో తీవ్రంగా ప్రభావితమైన వలస కార్మికులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. కార్మికుల కోసం తక్షణమే సహాయ శిబిరాలను ఏర్పాటుచేయాలని అన్ని రాష్ర్టాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కోరింది. వారికి తాత్కాలిక వసతి, భోజన సదుపాయం కల్పించడంతోపాటు వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించింది. ఇందుకోసం ఎస్డీఆర్‌ఎఫ్ (రాష్ట్ర విపత్తు సహాయ నిధి) నిధులను వాడుకోవచ్చని తెలిపింది. లాక్‌డౌన్ కారణంగా లక్షలాది మంది కార్మికులు ఎక్కడికక్కడ చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. రవాణా సేవలు నిలిచిపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో వందల కిలోమీటర్లు కాలినడక సాగించి స్వస్థలాలకు వెళ్తున్నారు. వలస కార్మికులను ఆదుకునేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. కార్మికుల సమస్యలపై రాష్ర్టాలతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తున్నట్లు కేంద్ర హోం శాఖ సంయుక్త కార్యదర్శి పుణ్య సలీల శ్రీవాస్తవ తెలిపారు. వలస కార్మికులకు భోజనం, నీరు అందించాలని ఎన్‌హెచ్‌ఏఐ అధిపతి, టోల్ ఆపరేటర్లను కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ కోరారు. సరిహద్దు జిల్లాల్లో చిక్కుకుపోయిన వలస కార్మికులను తరలించేందుకు 1000 బస్సులను ఏర్పాటుచేసినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వెల్లడించింది.



బెంగళూరులో స్వస్థలానికి వెళ్లేందుకు ఓ కుటుంబం అవస్థలు

## ముందుచూపుతోనే లాక్‌డౌన్

**కేంద్ర ప్రభుత్వం వివరణ**

**న్యూఢిల్లీ:** ఎలాంటి ప్రణాళిక లేకుండా దేశవ్యాప్త లాక్‌డౌన్‌ను ప్రకటించారన్న విమర్శలను కేంద్ర ప్రభుత్వం కొట్టివేసింది. వైరస్ నియంత్రణకు ముందస్తు, క్రియాశీలక, పటిష్ఠ చర్యలను చేపట్టినట్లు తెలిపింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆరోగ్య అత్యవసర పరిస్థితిని ప్రకటించకముందే, సరిహద్దుల వద్ద సమగ్ర వ్యవస్థను ఏర్పాటుచేసినట్లు గుర్తుచేసింది. విమానాశ్రయాల వద్ద ప్రయాణికులకు స్క్రీనింగ్, వీసాల రద్దు, అంతర్జాతీయ విమానాలపై నిషేధం వంటి చర్యలను ఇతర దేశాల కంటే చాలాముందే చేపట్టినట్లు వివరించింది. జనవరి 30న దేశంలో తొలి కరోనా కేసు వెలుగుచూడగా.. చైనా, హాంకాంగ్ నుంచి వచ్చే ప్రయాణికులకు జనవరి 18 నుంచే స్క్రీనింగ్ ప్రారంభించినట్లు తెలిపింది.

### 929 మంది బాధితులు

శనివారం ఒక్కరోజే దేశవ్యా ప్తంగా 179 కొత్త కరోనా కేసులు వెలుగులోకి వచ్చాయి. ఒక్కరోజు ఇన్ని కేసులు బయటపడటం ఇదే అత్యధికం. దీంతో మొత్తం కేసుల సంఖ్య 929కి చేరుకుంది. మృతుల సంఖ్య 20కి పెరిగింది.

## పీఎం కేర్స్‌కు విరాళాలివ్వండి

- దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు
- కరోనాపై పోరుకు ప్రత్యేక నిధి ఏర్పాటు
- రూ.25 కోట్ల విరాళమిచ్చిన అక్షయ్



**న్యూఢిల్లీ:** కరోనాపై పోరాటం కోసం 'ప్రధాన్ మంత్రి సిటిజన్స్ అసిస్టెన్స్ అండ్ రిలీఫ్ ఇన్ ఎమర్జెన్సీ సిచుయేషన్ (పీఎం కేర్స్) నిధి'ని కేంద్ర ప్రభుత్వం శనివారం ఏర్పాటు చేసింది. దీనికి విరివిగా విరాళాలు ఇవ్వాలని దేశ ప్రజలను ప్రధాని మోదీ కోరారు. 'కొవిడ్-19పై పోరాటంలో భాగంగా ప్రభుత్వానికి విరాళాలు ఇచ్చేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో పోరులకు సహాయం కోసం ఓ ప్రత్యేక నిధిని ఏర్పాటు చేశాం. ఆరోగ్యవంతమైన భారత్‌కు ఇది దోహదపడుతుంది' అని మోదీ ట్వీట్ చేశారు. ఈ నిధిని ప్రధాని చైర్మన్‌గా ఉండే ట్రస్ట్ నిర్వహిస్తుందని అధికారులు తెలిపారు. ప్రజలు www.pmindia.gov.in సైట్‌లో విరాళాలు చెల్లించాలన్నారు.

**పీఎం కేర్స్‌కు అక్షయ్ తొలి విరాళం**

బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ పీఎం కేర్స్‌కు తొలివిరాళం రూ.25 కోట్లు ప్రకటించారు. ప్రస్తుతం దేశ ప్రజల ప్రాణాల రక్షణే తనకు ముఖ్యమని ఆయన ట్వీట్ చేశారు. అక్షయ్ భార్య ట్వింకిల్ ఖన్నా తన భర్తను కొనియాడారు. ఇంత పెద్ద మొత్తం ఎలా ఇస్తావని తాను ప్రశ్నించగా.. 'మొదట్లో ఏమీ లేని నేను ప్రస్తుతం ఈ స్థితిలో ఉన్నాను. ఏమీ లేని వారి కోసం నేను ఏమీ చేయకుండా ఎలా ఉండగలను' అని అక్షయ్ చెప్పారని, ఆయనను చూస్తే గర్వంగా ఉన్నదని ట్వీట్ చేశారు.



### అక్షయమైన మనసున్నవాడు

కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడంలో బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ ఎప్పుడు ముందుంటారు. గతేడాది పుల్వామా దాడిలో అమరులైన జవాన్ల కుటుంబాలను ఆదుకోవడానికి రూ. కోటికి పైగా విరాళం ఇచ్చారు. 2017లో మార్చిలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లో 12 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు చనిపోయారు. ఆ జవాన్ల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 9 లక్షల చొప్పున మొత్తం 1.08 కోట్లను అందజేశారు. 2015లో చెన్నైలో సంభవించిన వరదల్లో నిరాశ్రయులైన వారికి సాయంగా అక్షయ్ కోటి రూపాయల్ని విరాళమిచ్చారు. అదే ఏడాది మహారాష్ట్రలో కరువు తలెత్తి ఆత్మహత్యలకు పాల్పడ్డ రైతు కుటుంబాలను ఆదుకునేందుకు రూ. 90 లక్షల్ని విరాళంగా ఇచ్చారు. లింగ మార్పిడి చేసుకున్న వారి కోసం రూ.1.5 కోట్లతో ఇటీవల అక్షయ్ గృహాల్ని నిర్మించి ఇచ్చారు.

## వూహాన్‌లో స్వేచ్ఛా వాయువులు

- రెండు నెలల అనంతరం రోడ్లపైకొచ్చిన జనాలు
- తెరుచుకొన్న ప్రధాన పారిశ్రామిక కేంద్రాలు


**వూహాన్:** కరోనా వైరస్‌కు పుట్టినిల్లయిన చైనాలోని వూహాన్ నగరం కోలుకున్నది. రెండు నెలల లాక్‌డౌన్ ఎత్తివేస్తున్నట్టు చైనా ప్రభుత్వం శనివారం ప్రకటించింది. దాదాపు 63 రోజులపాటు లాక్‌డౌన్‌కు గురైన ప్రజానీకం ఒక్కసారిగా స్వేచ్ఛావాయువులు పీల్చుకున్నంత భావోద్వేగానికి లోనయ్యారు. దాదాపు కోటి పది లక్షల జనాభా ఉన్న వూహాన్.. జనవరి మొదటివారం నుంచి వార్తల్లోకెక్కింది. తొలి కరోనా వైరస్ నమోదుతో వూహాన్ నగరంపై చైనా ప్రభుత్వం దృష్టిసారించింది. లాక్‌డౌన్ ప్రకటించి ప్రజలను ఇండ్లకే పరిమితం చేసింది. రోడ్లను బ్లాక్ చేశారు. నగరంలోకి ఇతర ప్రాంతాలవారు రాకుండా సరిహద్దులను మూసేశారు. చైనాతోపాటు మిగతా ప్రపంచదేశాలతో వూహాన్‌కు సంబంధాలు లేకుండా చేశారు. ఎక్కడికక్కడ క్వారంటైన్ కేంద్రాలను ఏర్పాటుచేసి వైద్యారోగ్య సిబ్బంది 24 గంటలపాటు సేవలందించారు. మొత్తానికి కరోనా వైరస్‌ను కట్టడిచేశారు. ఈ నేపథ్యంలో శనివారం లాక్‌డౌన్‌ను ఎత్తివేస్తున్నట్టు చైనా ప్రభుత్వం ప్రకటించింది.




లాక్‌డౌన్ ఎత్తివేత నేపథ్యంలో వూహాన్ రైల్వే స్టేషన్‌లో బారులుతీరిన ప్రజలు

**స్పెయిన్‌లో ఒక్కరోజే 832 మరణాలు**


కరోనా కారణంగా స్పెయిన్‌లో శనివారం ఒక్కరోజే 832 మంది మరణించారు. 8 వేల కొత్త కేసులు నమోదయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా కేసులు 6 లక్షలు దాటాయి. 29వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఒక్క అమెరికాలోనే లక్షకుపైగా వైరస్ బాధితులు ఉన్నారు.



### మీ నిబద్ధతకు జోహార్

**భోపాల్:** కరోనాతో దేశం అల్లాడుతున్న క్లిష్ట సమయంలో కుటుంబ బాంధవ్యాలను, భావోద్వేగాల్ని పక్కనబెట్టి ప్రజల కోసం పని చేస్తున్న వాళ్లు ఎందరో. ఇలాంటి కోవకే చెందిన వారు అష్రఫ్ అలీ, ఇర్ఫాన్ ఖాన్. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని 'భోపాల్ మున్సిపల్ కార్పొరేషన్'లో వీళ్లు ఉద్యోగులు. పారిశుద్ధ్యం విభాగంలో ఇన్‌ఛార్జ్‌గా ఉన్న అలీ బుధవారం కరోనా నేపథ్యంలో అత్యవసర విధుల్లో ఉన్నప్పుడు.. తన తల్లి చనిపోయిందన్న వార్త తెలిసింది. అయినా విధులు అయిపోయిన తర్వాత తన తల్లి అంతిమ సంస్కారాల్లో పాల్గొన్నారు. మరో ఘటనలో.. ఇదే కార్పొరేషన్‌లో డాటా మేనేజర్‌గా పనిచేస్తున్న ఇర్ఫాన్ ఖాన్ అనే అధికారికి సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. దీంతో కుడి చేయి విరిగింది. విశ్రాంతి అవసరమని డాక్టర్లు చెప్పినప్పటికీ ఆయన విధుల్లోకి హాజరయ్యారు.

### ఒక్కో కుటుంబానికి 3,400 డాలర్లు



**వాషింగ్టన్:** కరోనా విశ్వమారి ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థల్ని అతలాకుతలం చేస్తున్నది. దీంతో ఆయా దేశాలు అనేక ఉద్దీపన పథకాల్ని ప్రకటిస్తున్నాయి. అమెరికా సైతం ఆ దిశగా చర్యలకు పూనుకున్నది. కరోనాతో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలవడంతో ఆ ప్రభావం లక్షలాది మంది సామాన్యులు, వ్యాపార వర్గాలపై పడకుండా ఆ దేశం 2 లక్షల కోట్ల డాలర్ల ఉద్దీపన ప్యాకేజీని ప్రకటించింది. దీనిద్వారా నలుగురు సభ్యులున్న కుటుంబానికి 3,400 డాలర్లు (రూపాయల్లో 2.54 లక్షలు), సూక్ష్మ, మధ్యస్థాయి వ్యాపార సంస్థలతో పాటు బోయింగ్ వంటి అతి పెద్ద సంస్థలకు వందల కోట్ల ఆర్థిక సహకారం అందనున్నది. చట్టరూపంలో తెచ్చిన ఈ చారిత్రాత్మక దస్త్రంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఈ రోజు చాలా ముఖ్యమైన రోజు. అమెరికా చరిత్రలోనే తొలిసారిగా ఇంత పెద్ద ఆర్థిక ఉద్దీపన ప్యాకేజీపై సంతకాలు చేశా. అమెరికన్లకు అవసరమైన సాయం త్వరలోనే అందుబాటులోకి రానున్నది. కనిపించని శత్రువు(కరోనా) మనపై తీవ్ర ప్రభావం చూపింది. ప్యాకేజీతో ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకుంటుందని ఆశిస్తున్నా' అన్నారు.

**చరిత్రలో నేడు 1849**
భారత్, సిక్కులను ఓడించి పంజాబ్‌ను స్వాధీనం చేసుకున్న గ్రేట్ బ్రిటన్



కరోనా వైరస్ ఎవరినుంచి ఎవరికి వ్యాపించిందో చెప్పలేని కేసులు కొన్ని ఉన్నప్పటికీ, మన దేశంలో సామాజిక వ్యాపన మొదలైందని భావించడానికి తగినన్ని ఆధారాల్లేవు.

– రామన్ ఆర్.గంగాఖేడ్కర్, అంటువ్యాధుల విభాగం అధిపతి, భారతీయ వైద్య పరిశోధనా మండలి



# సామాజిక దూర-బంధం

'సార్.. మా అబ్బాయి కోచింగ్ కోసం హైదరాబాద్ పోయాడు. రెండ్రోజుల క్రితం హాస్టల్ క్లోజ్ చేశారు. ఇప్పుడెక్కడ ఉన్నాడో తెలియడం లేదు' అని రాష్ట్రం వెలుపలి నుం చి ట్వీట్ చేస్తారొకరు. 'చదువుకునేందుకు ఇటలీ వచ్చి ఇక్కడనే చిక్కుకుపోయినం. ఎట్లాగైనా మమ్మల్ని హైదరాబాద్ తీసుకుపోండి' అని ఏడుస్తూ సందేశం పంపిస్తారు ఇంకొకరు. 'మా రాష్ట్రం వాళ్లు మీ రాష్ట్రంలో ఉండిపోయారు. ప్లీజ్ హెల్ప్' అని పొరుగు రాష్ట్రం మంత్రి ఒకరు అభ్యర్థిస్తారు. ఇప్పుడు మంత్రి కేటీఆర్ సెల్‌ఫోనే ఒక ఇన్ఫర్మేషన్ జంక్షన్. సోషల్‌మీడియా ఆయనకొక సామాజిక కేంద్రం. కొత్త బంధుత్వాల కూడలి. నవీన మానవ సంబంధాల వేదిక. సమస్యలను తీర్చే పరిష్కార ఆయుధం. ఒకవైపు రీ ట్వీట్లతో కేటీఆర్ బదులిస్తుండగానే, ఆయన కింద పనిచేసే యంత్రాంగం, అసహాయులను గుర్తించి ఆదుకునే పనిలోకి దిగుతుంది.



**దూరం– బంధం** నిజానికి విరోధాభాసాలు. బంధం ఉంటే దూరం కారు. దూరమైతే బంధం ఉండదు. చాలామంది, తమకు సన్నిహితులుగా భావించేవారితోనే, కలిస్తే విడువరు.. విడిస్తే తలువరు' పద్ధతిలో యాంత్రికమైన బంధాలను కొనసాగిస్తుంటారు. ఇదెలాగూ టెక్నాలజీ శకం కనుక మానసిక బంధాల కన్నా యాంత్రిక సంబంధాలే ఎక్కువ అని సమర్థించుకోవచ్చు. కానీ మనిషి సోషల్ యానిమల్. అంటే సంఘజీవి! నేటికాలపు తెనిగింపులో అయితే సామాజిక జంతువు'! అనివార్యంగా సామాజిక దూరం పాటించాల్సిన కరోనా యుగంలో, సామాజిక సంబంధాలను పునర్నిర్వచించుకోవడం, మనం సామాజిక స్పృహతో నిర్వర్తించాల్సిన సామాజిక బాధ్యత! మనం బయటకు వెళ్లకపోతే ప్రపంచం మునిగిపోతుంది... మనం అవసరానికి మించి డబ్బు సంపాదించకపోతే అంతర్జాతీయ ఆర్థిక ప్రగతి ఆగిపోతుంది... మన పిల్లల్ని రెసిడెన్షియల్ కాలేజీలో చేర్చకపోతే విద్యారంగం వట్టిపోతుంది.. రోజూ ధాబాలో బిర్యానీ తినకున్నా, బార్లో మందు తాగకున్నా సూర్యోదయం ఆగిపోతుంది... అనుకుంటూ, ఇంతకాలం ఊపిరి సైతం తీసుకోకుండా, పెళ్లాంతో సైతం మాట్లాడకుండా, తిండి తినకుండా, నిద్రపోకుండా ఉరుకులు పరుగుల బిజీ జీవితం గడిపిన మనం, మన ఆగమంతా అర్థం లేని భ్రమే అని తేల్చినందుకు కరోనాకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఆఫ్టరాల్ నువ్వున్నా లేకున్నా, తిరిగినా తిరగకున్నా భూగోళమేమీ కళ్లుతిరిగి పడిపోదని చెప్పినందుకు కరోనాని వినువీధి వినేలా అభినందించాలి. ప్రపంచం మనమీద కాదు; మనిషే ప్రపంచం మీద ఆధారపడి ఉన్నాడన్న నిష్ఠుర సత్యాన్ని నిటారుగా నిలబెట్టి మరీ చాటిచెప్పిన కరోనాతో, ముప్పై అడుగుల దూరం నుంచే కరచాలనం చేయాలి. సంపాదన సంగతి తర్వాత, బతికుంటే బలుసాకు తినొచ్చని ఎవడింట్లో వాడు నక్కేలా చేసి, మన అర్భకత్వాన్ని అట్లాస్ మీద వేలాడదీసిన కరోనాకు చప్పట్లు కొట్టి మరీ విశ్వవ్యాప్త ధన్యవాదాలు వినిపించాలి. చిరు జీవి అయితేనేం? మొత్తం జగత్తునే బిగ్ బాస్ హౌస్‌గా, కోట్లమందిని అందులో బందీలుగా మార్చి, క్షణం క్షణం టాస్కులిచ్చి మరీ టాలెంటును పరీక్షిస్తున్నది కరోనా కణం! మనిషీ... గెలుస్తావా? ఓడుతావా?

నాగరికత పేరుతో విచ్చలవిడిగా వీరంగం వేస్తున్న మనిషి ప్రవర్తన మారాలని చేసిన హెచ్చరికలా కనిపిస్తోంది కరోనా! షేర్ మార్కెట్లు, రియల్ ఎస్టేట్ ధరల్లాగే ప్రకృతి కూడా ఒక కరెక్షన్ కోరుకుంటున్నదని చాటిచెప్పింది కరోనా! మనిషి కంటికి మనిషి... రూపాయిలా, డాలర్లా, వ్యాపార వస్తువుగా మాత్రమే కనిపించిన నిన్నటి వినియోగ యుగంలో, మానవ సంబంధాలంటే ఏమిటో మరోసారి గుర్తుచేసింది కరోనా! ఆధునిక మానవ జాతి చరిత్రను కరోనాకు ముందు–కరోనా తర్వాత' అని అధ్యాయ విభజన చేసుకోవాల్సిన అగత్యమిది. సార్వభౌముడు–సామాన్యుడు, ధనికుడు–నిరుపేద,పెద్దవాడు–చిన్నవాడు అందరూ ఒకటే ఇప్పుడు! కమ్యూనిజం కనుమరుగైతేనేం! ఇది కరోనా కమ్యూనిజం. ఇప్పుడు నీకు నువ్వే నిక్కచ్చిగా ఒక ప్రశ్న వేసుకో! అన్నానో, తమ్ముడో, అక్కో, చెల్లో ఇప్పుడెవరైనా నీ ఇంటికొస్తే అనుమానంగా చూడకుండా ఆదరించగలవా? అసలు రమ్మని మనస్ఫూర్తిగా పిలవగలవా? నీ భార్యకు పులకరం వచ్చి గార్తిగా ఒక తుమ్ము తుమ్మితే, జడుసుకోకుండా ఆప్యాయంగా పలకరించగలవా? పక్కరూములో ఒంటరిగా పండుకోబెట్టనని మాట ఇవ్వగలవా? దగ్గరివాడెవడైనా దగ్గుకుంటూ చనిపోయాడని తెలిస్తే అంత్యక్రియలకు వెళ్లి పాడె పట్టగలవా? ముమ్మారు దింపుడు కళ్లం ఆశలు దించగలవా? నటించడం ఇక అనవసరం. నీకు నువ్వే నిజాయతీగా జవాబు చెప్పుకో? చేయగలవా? లేదా?

ఇప్పుడు నీకు నీ వాళ్లు లేరు. నాకు నా వాళ్లు లేరు. ఎవరికెవరు ఈ లోకంలో? నా వరకు నాకైతే... ఇంట్లో ఉన్నా మనసు దేని కోసమో పరితపిస్తోంది. ఎవరినీ కలవలేక, కనీసం చేతిలో చెయ్యైనా కలపలేక, మానవాళి అంతా సూతకం (సుష్టి) పాటిస్తున్నట్టు అనిపిస్తున్నది. పలు దేశాల్లో ప్రాణాలు విడుస్తున్న నా లక్షలాది విశ్వమానవ సహోదరుల ఆత్మశాంతి కోసం 40 రోజుల నిర్బంధ అశౌచమేమో ఇది! నీ ఇంట్లో ఉన్న నలుగురే నీకు కాకుండా పోతున్న సమయంలో, భౌతిక కాయాలను చెత్త రిక్షాల్లో తరలిస్తున్న తరుణంలో... మనిషి మనిషిని ఆత్మబంధువుగా భావించడమొక్కటే అసలు బంధం. పాటించాలన్నది సామాజిక దూరమే కదా! మానసికమైన ఎడబాటు కాదు గదా! కరోనాకు కరుణ లేదని వాపోతున్న మనిషీ, నువ్వెప్పుడో మరిచిపోయిన మానవత్వాన్ని మనసు మూలల్లోంచి మళ్లీ వెతికి వెలికి తీయ్! నువ్వు ఇంట్లో దాక్కున్నావు సరే! నీలో దాక్కున్న మనిషితనాన్ని బయటకు తియ్.

'ఫేస్‌బుక్‌లోకి వచ్చి దశాబ్దం దాటింది. ఈ పదేండ్లలో ఈ వేదికమీద ఎన్నో వాదవివాదాలు జరిగాయి. కొందరిని అన్‌ఫ్రెండ్ చేశాను. తీవ్రమైన అభిప్రాయ భేదాల వల్లనో, అభ్యంతరకరంగా పోస్టులు పెట్టారనో కొందరిని బ్లాక్ కూడా చేశాను. కానీ కరోనా నా ఆలోచనా విధానాన్ని మార్చింది. ప్రకృతి పట్ల, సాటి మనిషి పట్ల మరింత బాధ్యతగా మెలగాలని తెలియజెప్పింది. రాగద్వేషాలకు, విమర్శ–ప్రతి విమర్శకు, ఇజాలు, ఈగోలకు ఇది సమయం కాదు. ప్రతి వ్యక్తీ సాటి మనిషి పట్ల దయతో మెలగాలి. మన కుటుంబసభ్యుల పట్ల మరి కొంచెం ప్రేమ చూపించాలి. ఆపదలో ఉన్నవారికి సాయం అందించాలి. అందుకే నేనూ మారడం మొదలుపెట్టిన. గత పదేండ్లుగా ఫేస్‌బుక్‌లో వివిధ కారణాలతో, క్షణికావేశంతో బ్లాక్ చేసిన వారందరినీ అన్‌బ్లాక్ చేశాను'

ఇది సోషల్ మీడియా నిపుణుడు దిలీప్ కొణతం పెట్టిన పోస్టు. ఎంత గొప్ప పశ్చాత్తా పం. ఎంతటి మనఃపూర్వక పరివర్తన. ఎంత ఔచిత్యమైన ప్రాయశ్చిత్తం! ఇంకా ఆయన అంటారు... 'ఇప్పుడున్న పరిస్థితిలో అందరూ నా వాళ్లే! నేను కేవలం ఒక మామూలు మనిషిని!' ఎంతటి వాస్తవికత? ఎంతటి నిర్మో హత?

దిలీప్ చెప్పుకొన్నారు. చెప్పకుండా ఆచరిస్తున్నవాళ్లు ఇంకెందరో! అన్నార్తులకు సహాయం కోసం స్వచ్ఛంద సంస్థలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నవారిని చూస్తే ఆశ్చర్యం కలిగింది. మామూలు రోజుల్లో మతం, ఇజం, ప్రమాణాలు, తదితర రకరకాల అభిప్రాయ భేదాలతో వాదించుకునే విభిన్నరకాల వ్యక్తులంతా, ఒకే గదిలో మూడడుగుల దూరంతో, చాలా దగ్గరైన మనసులతో మాట లు పంచుకున్నారు. వారి చర్చంతా ఒకే ప్రశ్న చుట్టూ తిరిగింది. అర్తుల చేతికి బుక్కెడంత అన్నం ముద్దను ఎలా అందివ్వగలం? ఆ స్వచ్ఛంద సైనికులు మనకు ఏమవుతారు? 67 ఏండ్ల వయసులో ఉదయం నుంచి అర్ధరాత్రి దాకా జరుపుతున్న నిర్విరామ సమీక్షా సమావేశాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన, అధికారుల మేధో మథనమంతా ఒకే ప్రశ్న చుట్టూ తిరిగింది. ఎవరెవరికి ఎలా సాయపడగలం? కేసీఆర్ మనకు ఏమవుతారు? ప్రాణాలకు ప్రమాదమని తెలిసీ చికిత్స చేస్తున్న వైద్యుడు మనకేమవుతాడు? నీవాళ్లు నీ దగ్గరికి రావడానికే భయపడుతున్నప్పుడు నిరంతరం సేవలందిస్తున్న నర్సు నీకేమవుతుంది? నీ ప్రాణాన్ని కాపాడేందుకు తన ప్రాణాన్ని నడిరోడ్డులో ఎండకు ఎరగా వేసిన కలెక్టరు గారు నీకేమవుతారు? నిన్ను రక్షించేందుకు తాను అరక్షితంగా రోడ్డుపై నిలిచిన పోలీసన్న నీకేమవుతాడు? విశాల మహా భాగ్యనగరం మొత్తాన్నీ, అంగుళం అంగుళ మూ క్రిమిసంహారక మందుతో తడిపి శుభ్రం చేస్తున్న సఫాయి తమ్ముడు నీకేమవుతాడు?

> ఈ సంక్షోభ సమయంలో పాత పగ లు మరిచిపోదాం. మళ్లీ మాటలు కలుపుకుందాం. ఉన్నదంతా మనింట్లోనే ఉండాలన్న ధోరణి మరిచి, తలాయింత, తలాకొంత అని పంచుకుందాం. సోషల్ మీడియాను, సమయాన్ని, డేటాను కాలక్షేపానికి, వదంతుల వ్యాప్తికి వృథా చేయకుండా తోటి మనిషికి సాయపడేందుకు ఉపయోగిద్దాం. అందుకు మంత్రి కేటీఆర్‌ను ఆదర్శంగా తీసుకొందాం. అభాగ్యులకు ఆపన్న హస్తం అందించే వేదికగా అవాస్తవాలను చీల్చి చెండాడే వాస్తవ కరవాలంగా సోషల్ మీడియాను వాడుకొందాం. ఆర్తులను ఆదుకోవడం, అబద్ధాలను మట్టుపెట్టడం ప్రభుత్వం పనే కాదు; అది మనందరి కర్తవ్యం కూడా. ఈ అచేతనావస్థలో చైతన్యం తెచ్చేది మనిషే!

'సార్.. మా అబ్బాయి కోచింగ్ కోసం హైదరాబాద్ పోయాడు. రెండ్రోజుల క్రితం హాస్టల్ క్లోజ్ చేశారు. ఇప్పుడెక్కడ ఉన్నాడో తెలియడం లేదు' అని రాష్ట్రం వెలుపలి నుంచి ట్వీట్ చేస్తారొకరు. 'చదువుకునేందుకు ఇటలీ వచ్చి ఇక్కడనే చిక్కుకుపోయినం. ఎట్లాగైనా మమ్మల్ని హైదరాబాద్ తీసుకుపోండి' అని ఏడుస్తూ సందేశం పంపిస్తారు ఇంకొకరు. 'మా రాష్ట్రం వాళ్లు మీ రాష్ట్రంలో ఉండిపోయారు. ప్లీజ్ హెల్ప్' అని పొరుగు రాష్ట్రం మంత్రి ఒకరు అభ్యర్థిస్తారు. ఇప్పుడు మంత్రి కేటీఆర్ సెల్‌ఫోనే ఒక ఇన్ఫర్మేషన్ జంక్షన్. సోషల్ మీడియా ఆయనకొక సామాజిక కేంద్రం. కొత్త బంధుత్వాల కూడలి. నవీన మానవ సంబంధాల వేదిక. సమస్యలను తీర్చే పరిష్కార ఆయుధం. ఒకవైపు రీ ట్వీట్లతో కేటీఆర్ బదులిస్తుండగానే, ఆయన కింద పనిచేసే యంత్రాంగం, అసహాయులను గుర్తించి ఆదుకునే పనిలోకి దిగుతుంది. సోషల్‌మీడియా యాంటీ సోషల్‌గా ముద్రపడిన పరిస్థితిలో కేటీఆర్ దాన్ని వాడుకుంటున్న తీరు అద్భుతం. కేటీఆర్‌కు ట్వీట్ పెడితే సాయం అందినట్టేనన్నది అభాగ్యుల విశ్వాసం. కనీస పరిచయం లేని కేటీఆర్ వారికి ఏమవుతారు? దేశ ప్రధాని మొదలుకొని దవాఖానాలో నేల తుడిచే వార్డు బాయ్‌దాకా మనకేమవుతారు? వారితో మనకున్నదేమిటి.. ఆత్మ బంధం తప్ప. మనిషితనం తప్ప! ఈ సంక్షోభ సమయంలో పాత పగలు మరిచిపోదాం. మళ్లీ మాటలు కలుపుకొందాం. ఉన్నదంతా మనింట్లోనే ఉండాలన్న ధోరణి మరిచి, తలాయింత, తలాకొంత అని పంచుకుందాం. సోషల్ మీడియాను, సమయాన్ని, డేటాను కాలక్షేపానికి, వదంతుల వ్యాప్తికి వృథా చేయకుండా తోటి మనిషికి సాయపడేందుకు ఉపయోగిద్దాం. అందుకు మంత్రి కేటీఆర్‌ను ఆదర్శంగా తీసుకొందాం. అభాగ్యులకు ఆపన్నహస్తం అందించే వేదికగా అవాస్తవాలను చీల్చి చెండాడే వాస్తవ కరవాలంగా సోషల్ మీడియాను వాడుకొందాం. ఆర్తులను ఆదుకోవడం, అబద్ధాలను మట్టుపెట్టడం ప్రభుత్వం పనేకాదు; అది మనందరి కర్తవ్యం కూడా. ఈ అచేతనావస్థలో చైతన్యం తెచ్చేది మనిషే! ఎవరికి ఏం కావాలో గుర్తిద్దాం. మనమేం చేయగలమో చేద్దాం. ఎందుకంటే మనం మనుషులమని కరోనా గుర్తుచేసింది కదా! కొంచెం దూరంగా ఉన్నప్పుడే అనుబంధాలు బతికి బయటపడతాయి. ఇప్పుడు దూరంగా ఉండటమూ అవసరమే. సాటి మనిషి పట్ల అనుబంధం చూపడమూ అవసరమే!

**- కృ.తి.**

# మాయావిని మసి చేసేదెలా?

> కరోనా వైరస్ గురించి మొదటినుంచి అవగాహనతో వ్యవహరిస్తున్నది తెలంగాణ రాష్ట్రమే. ముఖ్యమంత్రి కేసీఆర్ సమస్యను లోతుగా అధ్యయనం చేయడమే గాక నిర్దిష్టమైన పరిష్కార మార్గాలను కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. వైరస్ తెలంగాణలో అడుగుపెట్టిన వెంటనే ముఖ్యమంత్రి విస్తృతస్థాయి సమీక్ష నిర్వహించారు. అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. నగరంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన గాంధీ దవాఖానాను కరోనా ప్రత్యేక వైద్య సదుపాయాలకు కేటాయించారు. అలాగే ఛాతీ వ్యాధుల దవాఖానా, ఇతర దవాఖానాల్లో కూడా కావలసిన వసతులు కల్పించాలని పురమాయించారు.

**విశ్లేషణ**

**డాక్టర్ రాహుల్ రాజారామ్**

**వూహాన్** నగరంతో పాటు హుబై ప్రావిన్స్‌లో వ్యాధి తీవ్రత పెరిగి దాదాపు ఐదారు వందల మందిదాకా దవాఖానా పాలై అనేకమంది మరణించిన తర్వాత చైనా మేలుకున్నది. కానీ తెలంగాణ చాలా మొదటగా వైరస్ తీవ్రతను అర్థం చేసుకోవడమే కాకుండా ప్రజలకు అవగాహన కలిగించే చర్యలు చేపట్టింది. సమస్యను శాసనసభలో ఒకటికి రెండు సార్లు చర్చించి, తీసుకోబోతున్న చర్యలను వివరించింది. దీనికోసం మార్చ్ 14న ముఖ్యమంత్రి స్వయంగా ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి పరిస్థితి సమీక్షించారు. వూహాన్‌లో చేసిన విధంగా జన సంచారాన్ని నియంత్రించి కట్టడి చేయాలని భావించారు. అన్నిరకాల విద్యా సంస్థలను మూసివేశారు. జనం గుమిగూడే ప్రదేశాలను నియంత్రించారు. సభలు, సమావేశాలు, బహిరంగసభలు, ఊరేగింపులు రద్దు చేశారు. బార్లు, పబ్బులు, పార్కులు ప్రాంతాలనూ మూసివేశారు. ఇది బయటికి నిషేధం లాగో, నియంత్రణ లాగో ఉన్నప్పటికీ ప్రజలకు వ్యాధి తీవ్రతపైన అవగాహన కలిగించడం, వారిని దీర్ఘకాలిక పోరాటానికి సిద్ధం చేయడం దీని ఉద్దేశం. ఇది ఊహించని స్థాయిలో విజయవంతమైంది. మరోవైపు ఈ సమయాన్ని ప్రభుత్వాన్ని సమాయత్తం చేయడానికి వాడుకున్నారు. విమానాశ్రయంలో విదేశాల నుంచి వచ్చే వారి మీద నిఘా పెట్టారు. ప్రత్యేక నిధితో పాటు, వార్డులు, మంచాలు, వెంటిలేటర్లు ఇలా సమస్తం సిద్ధం చేశారు. వైద్యులు, ఇతర సిబ్బందిని సన్నద్ధం చేశారు. చైనాతో పాటు తూర్పు ఆసియా దేశాలు ఇదే వ్యూహంతో వైరస్‌ను నిలువరిస్తూ వచ్చాయి.

రెండో దశలో – కరోనా సోకినవారిని గుర్తించడం, వారిని కట్టడి చేయడం, జనంలో కలువకుండా నిలువరించడం ప్రాథమికమైనది. సమస్య విదేశీ ప్రయాణికుల నుంచే వస్తున్నందున విమాన రాకపోకలు తక్షణమే నిలిపివేయాలని కేంద్రాన్ని కోరడంతో పాటు, సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టులన్నీ ప్రభుత్వం మూసివేసింది. అలాగే మార్చి 1వ తేదీ తర్వాత విదేశాల నుంచి వచ్చిన వారందరికీ వైద్యపరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. వ్యాధి ప్రబలకుండా, స్థానికులకు సోకి రెండో దశకు చేరకుండా కట్టడి చేయాలని భావించింది. నిజానికి ఇది అత్యంత కీలకం. మార్చి 19న మీడియా సమావేశంలో సీఎం కేసీఆర్ అనేక అంశాలను ప్రజలకు పూసగుచ్చినట్టు వివరించారు. 'మిమ్మల్ని కాపాడటానికి మీ బిడ్డగా నేనున్నాను' అని హామీ ఇచ్చారు. ఆ రోజు ఆయన పిల్లల కోసం తల్లడిల్లే తండ్రిగా, తల్లిదండ్రులకు తపించిపోతున్న కొడుకుగా, ఆపదలో అండగా నిలబడే అన్నగా అంతకుమించి, మొక్కకపోయినా వరాలిచ్చే దేవుడిగా కనిపించారు. నిరంతరం పరిస్థితిని సమీక్షించడం, తరచుగా మీడియాతో మాట్లాడటం, చేతులెత్తి దండంపెట్టి మరీ పరిస్థితి తీవ్రతను, గంభీరతను వివరించడం, నేనున్నాననే భరోసా కల్పించడం ప్రజలకు ధైర్యాన్నిచ్చాయి. మరోవైపు ప్రజల్ని రాబోయే సమస్యలను ఎదుర్కోవడానికి సన్నద్ధం చేశాయి.

మూడో దశలో– మార్చి 22న పరిస్థితులు సమీక్షించిన తర్వాత ఎవరూ ఊహించని రీతిలో ప్రభుత్వం పూర్తిస్థాయి కట్టడిని (లాక్ డౌ న్) ప్రకటించింది. అదే రోజు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ప్రజలు స్వచ్ఛందంగా జనతా కర్ఫ్యూను పాటించారు. ఇది తెలంగాణలో సంపూర్ణంగా విజయవంతమైం ది. అదేరోజున కేసీఆర్ తెలంగాణ 'లాక్‌డౌన్' ప్రకటించారు. ఇలా కట్టడి చేయడం వల్ల ఎదురయ్యే కష్టాలను కూడా ఊహించగలిగారు. పేదలందరికీ కావాల్సిన బియ్యం ఉచితంగా ఇవ్వడంతో పాటు, నెలకు రూ.1500 ఆర్థికసాయం కూడా ప్రకటించారు. రైతుల ఉత్పత్తుల మార్కెటింగ్ ఏర్పా ట్లు, గర్భిణులకు కావాల్సిన వైద్య సదుపాయాలూ ఇలా అనేక అం శాల పట్ల జాగ్రత్తలు తీసుకున్నారు. కరోనా విజృంభించిన కరీంనగర్ పట్టణంలో ఇం టింటా తిరిగి వేలాది మందికి పరీక్షలు చేశారు. అదేవిధంగా ఇళ్లల్లోకి కూరగాయలు, సరుకులు పంచారు. హైదరాబాద్‌ను కూడా పూర్తిగా అష్టదిగ్బంధం చేయాల్సి రావచ్చు.

ఇవన్నీ అర్థం చేసుకోకుండా మనం కట్టడి ని ఉల్లంఘిస్తామంటే చైనాలో అవలంబించిన నాలుగోదశ తప్పదు. అదే గృహ నిర్బంధం. చివరిదశలో చైనా కూడా సైన్యాన్ని పిలిపించింది. 'స్వచ్ఛందంగా సమాన దూరాన్ని పాటిచండి..' అని చెప్పడం వెనుక ఆ మాయావిని కట్టడి చేసే ఆలోచన ఉన్నది. మనిషికీ మనిషికీ తుంపర తాకనంత దూరం ఉంటే చాలు మనిషితో దాని బంధం తెగిపోతుంది, వ్యాప్తి ఆగిపోతుంది. అందుకే ఆ గొలుసు తెగగొట్టాలని అంటున్నారు. అలా కాకుండా మనం ఎప్పటిలాగే ఉంటే అది దావానలమై వ్యాపిస్తుంది. ఇప్పటికే ప్రపంచంలో అగ్రరాజ్యాలన్నిటినీ మసి చేస్తున్న ఈ మాయరోగానికి మనమేమీ అతీతులం కాదు. అందుకే కేసీఆర్ కొంత కటువుగా ఉంటున్నారు. ఆ మృత్యువును మోసుకొచ్చేది బలాదూర్‌గా బయట తిరిగేవాళ్లే, కాబట్టి వాళ్లను నిలువరించాలి.

గృహ నిర్బంధంతో రెండో ప్రయోజనం వైరస్‌ను మోసుకు తిరుగుతున్న వాళ్లను వెతికిపట్టడం, చైనా ఇల్లిల్లూ గాలించి రోగుల్ని లాక్కొచ్చి మరీ వైద్యం చేసింది. ప్రజలను కనీసం కిటికీలు కూడా తెరవకుండా నియంత్రించింది. వైద్యసేవలతో పాటు, ఆహార సరఫరా వంటి వాటి కోసం వలంటీర్లను నియమించుకున్నది. ఈ ఆలోచన కూడా కేసీఆర్ చూచాయగా మనతో పంచుకొని ఉన్నారు. తెలంగాణలో పది లక్షల మంది ప్రజాప్రతినిధులు ఉన్నారు. వాళ్లందరూ ఎక్కడికక్కడ కథానాయకులు కావాలని ఆయన ఇప్పటికే చెప్పారు. రేపు వాళ్లంతా స్వచ్ఛంద సేవకులుగా మారవచ్చు. చైనా కమ్యూనిస్టు దేశం కాబట్టి ఇంత విస్తృతమైన పరిపాలనావ్యవస్థ, రాజకీయ, నాయకత్వ వికేంద్రీకరణ ఉండదు. నిజానికి మనకు అదొక బలం. ఈ బలమే మనల్ని రేపు నిలబెడుతుంది.

కరోనా విషయంలో చాలా దేశాల్లో ప్రభుత్వం చేతులెత్తేసింది. అమెరికా అధ్యక్షుడు, ఇటలీ అధినేతలు ఏం చేశారో చూశాం. అక్కడ ఏమవుతున్న దో గమనిస్తున్నాం. నిజానికి మనం నిశ్చింతగా ఉండవచ్చు. ముఖ్యమంత్రి గారు పదేపదే ప్రాధేయపడి చెబుతున్నది కూడా అదే! 'మీకు నేనున్నా, మీరు మీ ఇళ్లల్లోనే ఉండం డి, స్వీయ నియంత్రణ పాటించండి' అంటున్నారు. మనం చేయవలసింది అదే. మహా నేత ఉన్నాడు. నిశ్చింతగా ఉండండి, నియంత్రణ పాటించండి. కరోనా మాయావి కంటపడకుండా ఉండండి. అంతే దానికదే కనిపించకుండాపోతుంది.

**(వ్యాసకర్త: సామాజిక, రాజకీయ పరిశోధకులు)**

# కరోనా రామాయణంలో వైరసాసుర ఘట్టం

**'భవతీ భిక్షాందేహి'** అంటూ..
ఏ రావణుడూ కాలింగ్ బెల్లు నొక్కడు
గీత దాటొద్దని
ఏ లక్ష్మణుడూ వార్నింగ్ ఇవ్వడు
ప్రలోభాలకు గురి కావొద్దని
ఏ రాముడూ నచ్చచెప్పడు
మాయరూపంలోని ఏదో వస్తువు
సీత మనసు తొలిచేస్తూ ఉంటుంది
రా రమ్మని పిలుస్తూ ఉంటుంది..!

రావణుడు అవకాశం కోసం
కాచుకుని ఉంటాడు
ఏ గీతో దాటుకుని
ఆ సీత వచ్చేస్తుందని..
లక్ష్మణుడు చూసుకుంటాడని
రాముడు ధైర్యంగా బయటికి
అడుగు పెడతాడు
సీత కోర్కె తీర్చేందుకు..!
హద్దు రేఖ గీయకున్నా
అన్నమాట అతిక్రమించరని
లక్ష్మణుడు ఓవర్ కాన్ఫిడెన్స్‌తో
నిద్రపోయాడు..

కరోనా రామాయణంలో
లక్ష్మణుడు గీత గీయడు
రాముడు బాణమేయడు
మారీచుడు 'హా లక్ష్మణా!' అంటూ
అరవడు
'హల్లో రామా!' అంటూ
రాముడి చేతిసంచిలో వస్తువయ్యాడు
మారీచుడు / తిరుగు ప్రయాణంలో
గుమ్మం దగ్గరున్న రావణుడూ
తోడయ్యాడు
మారీచ రావణులే
జలుబూ జ్వరంగా మారారు
వైరసాసుర రూపమెత్తారు..!



ముందు రాముడు/ తర్వాత సీత
ఆ తర్వాత లక్ష్మణుడు
వైరసాసుర ఆక్రమణలో తల్లడిల్లుతూ..

ఎత్తుకుపోవడం త్రేతాయుపు కథ
శరీరాన్నే ఆక్రమించడం
రాక్షసుల కలికాలపు యుద్ధ వ్యూహం

సీన్ కట్ చేస్తే–
నిద్ర నుండి మెలకువొచ్చిన రాముడు
క్వారంటైనే జీవనసూత్రమని
సీతకు ఉద్బోధిస్తున్నాడు
పద్నాలుగేళ్ల వనవాసం ముందు
ఇరవై ఒక్క రోజుల క్వారంటైన్
కాలమెంత అని ప్రశ్నిస్తున్నాడు..
వైరసాసుర సంహారానికి
వానరులవసరం లేదంటున్నాడు
'వాష్ మంత్రం' మేలంటున్నాడు...

ఆ మాటలను రికార్డు చేస్తూ
సోషల్ మీడియాలో పోస్టు
చేయడంలో/ లక్ష్మణుడిప్పుడు బిజీ...

రాముడి ఇంటి బయట
వైరసాసురుల నిరీక్షణ
ఇంకా కొనసాగుతూనే ఉంది.. ..!

**- డాక్టర్ ఆర్. సూర్య ప్రకాశ్‌రావు,**
**94410 46839**



# అజ్ఞాతవాసం


**కరచాలనం కరవాలమై**
తుమ్ముతుంపర్లు తుఫానులై
ఉచ్ఛ్వాస నిశ్వాసలు కూడా
ఉరికంబాలై ఉరుముతుంటే
ప్రాణాన్నిప్పుడు
గుప్పిటనుంచలేం
గృహనిర్బంధంలో తప్ప..!
మనిషే వాహకమై
మరణాన్ని ఆవహిస్తుంటే
జ్ఞానేంద్రియాలన్నీ
మరణమృదంగాలవుతుంటే
మనిషిని మృగంగా చూసే దుస్థితి..!
మనిషికి మలినాన్ని రాసే పరిస్థితి..!!
అజ్ఞాతవాసం అవశ్యమైనప్పుడు
చిమ్మచీకట్ల చెలిమితప్పదు
కష్టనష్టాల కలిమితప్పదు
మన కోసం.. మనవారి కోసం..
మన దేశ ఉషస్సు కోసం
మనసెప్పుడూ సోలిపోదు
మనిషెప్పుడూ ఓడిపోదు
నేటి స్వీయనిర్బంధాలే..
రేపటి స్వేచ్ఛకు దుర్భేద్యాలు..!

**- గాజుల పవన్ కుమార్**
**9866265005**

# అష్టగ్రహ కూటమి




**నమస్తే.. నమస్తే.. నమః**



**ఆచార్య మసన చెన్నప్ప**

**యాజ్ఞవల్క్యుడు** బ్రహ్మర్షి. అతణ్ని ఒకరోజు ఆర్తభాగుడనే విద్వాంసుడు 'జీవున్ని శరీరంలో బంధించే గ్రహాలు, అతి గ్రహాలేవో చెప్పమని' అడిగాడు. యాజ్ఞవల్క్యుడు చెప్పినదాని ప్రకారం అవి మనం అనుకొనే ఖగోళ సంబంధమైన గ్రహాలు కావు. ఇక్కడ గ్రహించడమంటే పట్టుకోవడం. అట్లా గ్రహించినదాన్నే 'గ్రహం' అంటారు. మానవ శరీరంలో కూడా ఒక 'అష్టగ్రహ కూటమి' ఒకటుంటుంది. వాటినే తెలుసుకోవాలని అనుకొంటాడు ఆ విద్వాంసుడు. అప్పుడు యాజ్ఞవల్క్యుడు చెప్పిన వివరాలు ఇలా వున్నాయి.
శరీరంలో ముక్కు ఒక గ్రహం. అది మన శరీరంలోని జీవుణ్ణి పట్టుకొని ఉంది. జ్ఞానేంద్రియాలలో ఒకటైన ముక్కుకు విషయం గంధం. అది జీవుణ్ణి మరింత గట్టిగా పట్టుకుంది. కనుక, అది అతిగ్రహమైంది. నాలుక ఒక గ్రహం. అది శరీరధారియైన జీవుణ్ణి పట్టుకొని ఉంది. నాలుకకు విషయమైన రసం జీవుణ్ణి మరింత గట్టిగా పట్టుకుంది. కనుక అది అతిగ్రహమైంది. ఇదే పద్ధతిలో కన్ను ఒక గ్రహం. అది శరీరధారి అయిన జీవుణ్ణి పట్టుకొని ఉంది. దానికి విషయం రూపం. అది జీవుణ్ణి మరింత గట్టిగా పట్టుకొని ఉంది. అందుకే, అదీ ఒక అతిగ్రహమైంది. అలాగే, చర్మం ఒక గ్రహం. అది కూడా శరీరంలో జీవుణ్ణి పట్టుకొని ఉంది. చర్మానికి విషయం స్పర్శ. అది జీవుణ్ణి మరింత గట్టిగా పట్టుకొని ఉంది. అందువల్ల దాన్నీ అతిగ్రహం అని పిలుస్తారు.
చెవి కూడా ఒక గ్రహం. అది శరీరంలో ఉండి జీవుణ్ణి పట్టుకొని ఉంది. దానికి శబ్దం విషయం. అది జీవుణ్ణి మరింత గట్టిగా పట్టుకొని ఉంది. అందువల్ల అది అతిగ్రహమైంది. మనస్సు కూడా ఒక గ్రహం. అది శరీరంలో అంతటా ఉండి జీవుణ్ణి పట్టుకొన్నది. మనస్సుకు విషయం మననం (ఆలోచించడం). అదీ జీవుణ్ణి మరింత గట్టిగా పట్టుకొని ఉంది. కనుక, అది అతిగ్రహంగా పిలువబడుతున్నది. చెయ్యి ఒక గ్రహం. అది శరీరంలో జీవుణ్ణి పట్టుకొని ఉంది. దానికి విషయం కర్మ. కర్మ చేయకుండా ఏ మనిషీ ఉండడు. కనుక, జీవుణ్ణి అది మరింత గట్టిగా పట్టుకొని ఉండటం వల్ల ఇదీ అతిగ్రహమైంది.
ఇదే ప్రకారం వాక్కు కూడా ఒక గ్రహం. అది శరీరంలో జీవుణ్ణి పట్టుకొని ఉంది. వాక్కుకు విషయం నామం. ఇదీ జీవుణ్ణి మరింతగా గట్టిగా పట్టుకొని అతిగ్రహమైంది. ఈ విధంగా ముక్కు, నాలుక, కన్ను, చర్మం, చెవి.. అనే ఈ అయిదు జ్ఞానేంద్రియాలతోపాటు మనస్సు, చెయ్యి, వాక్కు అనే త్రికరణాలూ మన శరీరంలోని జీవుణ్ణి గ్రహించి (బంధించి) ఉన్నాయి. కనుక, ఈ ఎనిమిదీ (అష్ట) గ్రహాలయ్యాయి.
వీటినే తత్త్వవేత్తలు మానవ శరీరంలోని 'అష్టగ్రహ కూటమి'గా అభివర్ణిస్తారు.
మన శరీరంలోనే ఇలా గ్రహాలుండటం వల్ల జీవుడు అవి చెప్పినట్లు వింటూ వుంటాడు. వాటికి సంబంధించిన విషయాలలో (అతిగ్రహాలతో) మునిగి తేలుతున్నాడు. జీవుడు ఈ గ్రహాలను నిరంతరం సేవిస్తున్నాడు. వాటి బంధనాల్లో పడి కొట్టుమిట్టాడుతున్నాడు. కానీ, బ్రహ్మజ్ఞాని అయిన మనిషి మాత్రం గ్రహాలనుంచి, అతిగ్రహాలనుంచి బయటపడి, అనంతానందమైన మోక్షం వైపు సాగిపోతాడు.





సిద్దిపేట జిల్లా వంటిమామిడి మార్కెట్‌లో రైతులతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

## రైతుల కూరగాయలకు సరైన ధర

- **ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు**

**గజ్వేల్‌అర్బన్:** గజ్వేల్ నియోజకవర్గంలోని రైతులు పండించిన కూరగాయలన్నింటినీ వ్యాపారులు కొనుగోలు చేయాలని ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు సూచించారు. శనివారం సిద్దిపేట జిల్లా ములుగు మండలం వంటిమామిడిలోని మార్కెట్‌ను మంత్రి సందర్శించి కూరగాయల రైతులతో మాట్లాడారు. పండించిన పంటలన్నింటినీ మార్కెట్‌లో కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేశామని, సీఎం కేసీఆర్ ఈ మేరకు అధికారులకు ఆదేశాలిచ్చారన్నారు.



మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## అప్రమత్తత అవసరం

- **ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

**దేవరకద్ర రూరల్:** కరోనా మహమ్మారి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో కూరగాయలు విక్రయించేందుకు చేసిన ఏర్పాట్లను శనివారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కరోనా వ్యాప్తిచెందకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి 10 వేల మంది తెలంగాణకు వచ్చారని, వారి వివరాలు సేకరించి బయట తిరగకుండా చూడాలని కోరారు.



మహబూబాబాద్ జిల్లా గొల్లచర్లలో వలస కూలీలతో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి

## వలస కూలీలకు సర్కార్ అండ

- **మంత్రి సత్యవతి రాథోడ్**

**డోర్నకల్:** స్వీయ నియంత్రణతోనే కరోనా వైరస్‌ను కట్టడి చేయొచ్చని గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గొల్లచర్ల, తెల్లబండతండా గ్రామ పంచాయతీల్లో శనివారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కరోనా నివారణ చర్యల్లో భాగంగా లాక్‌డౌన్ చేయడంతో మహారాష్ట్ర, ఒడిశాల నుంచి డోర్నకల్ మండలానికి వచ్చిన వలసకూలీల ఆరోగ్య పరిస్థితులు, భోజన వసతిపై ఆరా తీశారు. కూలీల పిల్లలకు అంగన్‌వాడీల నుంచి పాలు, గుడ్లు అందించాలని అధికారులను ఆదేశించారు.



సూర్యాపేటలో నిరాశ్రయుల కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

## 340 గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- **విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి**

**నల్లగొండ, నమస్తేతెలంగాణ:** నల్లగొండ జిల్లాలో 340 గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నల్లగొండ కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో మంత్రి సమీక్షించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, ఐకేపీ సెంటర్ల ద్వారా ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తామన్నారు. కూరగాయల మార్కెట్ తరహాలోనే బత్తాయి, నిమ్మ, పుచ్చ వంటి ఉత్పత్తులను ఈసారి స్థానికంగా విక్రయించుకునే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు చెప్పారు.

## నిర్లక్ష్యంవహిస్తే ప్రమాదమే..

- **మంత్రి గంగుల కమలాకర్**

**కార్పొరేషన్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండాలంటే ప్రజలంతా విధిగా సామాజిక దూరం పాటించాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. శనివారం ఉదయం కరీంనగర్‌లోని బస్‌స్టేషన్ ఆవరణలో కొత్తగా ప్రారంభించిన కూరగాయల మార్కెట్‌ను నగర మేయర్ వై సునీల్ రావు, నగర కమిషనర్ క్రాంతి, ఇతర అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ప్రతి ఒక్కరూ దూరం పాటిస్తూ కూరగాయలను కొనుగోలు చేసుకోవాలని కోరారు. కరీంనగర్‌లో వైరస్ వ్యాప్తి నిలిచిపోయిందని, అలాగని ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రమాదం తప్పదని హెచ్చరించారు. ప్రజలకు నిత్యావసర వస్తువుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.



కరీంనగర్ బస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటుచేసిన కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న గంగుల

### ❖ 'గీత' దాటకుండా..



కరోనా వైరస్ నేపథ్యంలో ఓ గీత కార్మికుడు సామాజిక దూరాన్ని పాటిస్తున్నాడు. తన వద్దకు వస్తున్న వారికి ప్లాస్టిక్ పైపు ద్వారా కల్లు పోస్తున్నాడు యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం చౌళ్లరామారం గ్రామానికి చెందిన గీతకార్మికుడు అనంతుల దేవాంజీ. కల్లుపోసేందుకు పైపు ఉపయోగిస్తున్న ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. – అడ్డగూడూరు

### ❖ పోలీసు ఔదార్యం




అనారోగ్యంతో బాధపడుతున్న బిడ్డను ఎత్తుకొని దవాఖానకు నడుచుకుంటూ వెళ్తున్న మహిళను తన వాహనంలో తీసుకెళ్లి చికిత్స చేయించి ఔదార్యాన్ని చాటుకున్నాడు కరీంనగర్ జిల్లా సైదాపూర్ ఎస్సై ప్రశాంత రావు. మండలంలోని సోమారం గ్రామానికి చెందిన పెద్దంకి రమ్య అనారోగ్యంతో ఉన్న తన బిడ్డను తీసుకొని 4 కిలోమీటర్ల దూరమున్న సైదాపూర్ ప్రభుత్వ దవాఖానకు బయలుదేరింది. పెట్రోలింగ్‌లో భాగంగా అటువైపు వచ్చిన ఎస్సై వారిని తన వాహనంలో దవాఖానకు తరలించి చికిత్స చేయించి, తిరిగి అదే వాహనంలో వారిని గ్రామంలో దింపారు. – సైదాపూర్

# ఆపన్నహస్తం

- లాక్‌డౌన్ నేపథ్యంలో పేదలకు దాతల అండ
- వలసకూలీలకు బియ్యం పంపిణీ
- ఉపాధి కోల్పోయినవారికి ఆర్థికసాయం
- కరోనా కట్టడికి మాస్కుల వితరణ

**నమస్తేతెలంగాణ నెట్‌వర్క్:** ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా మహమ్మారి కారణంగా ఉపాధి కోల్పోయిన వారికి దాతలు ఆపన్నహస్తం అందిస్తున్నారు. వేర్వేరు ప్రాంతాల నుంచి వలస వచ్చి లాక్‌డౌన్ కారణంగా ఇక్కడ చిక్కుకున్న కుటుంబాలకు బియ్యంతోపాటు ఆర్థికంగా సాయపడుతూ అండగా నిలుస్తున్నారు. వైరస్ వ్యాప్తిని నివారించేందకు ప్రభుత్వ పిలుపు మేరకు ఇండ్లకే పరిమితమైన వారికి నిత్యావసరాలను అందిస్తూ ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపారులు బాసటగా నిలుస్తున్నారు.



శనివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో నిరుపేద కుటుంబానికి బియ్యం, పప్పులు అందజేస్తున్న రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్

**పేదలకు ఎమ్మెల్యే కోరుకంటి ఆసరా**

బతుకుదెరువుకు పెద్దపల్లి జిల్లా రామగుండానికి వచ్చి.. కరోనా వైరస్ నేపథ్యంలో ఇండ్లకే పరిమితమైన తెల్లరేషన్ కార్డులేని నిరుపేదలు, కూలీలకు స్థానిక ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బాసటగా నిలుస్తున్నారు. విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత భోజన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన, శనివారం ఖనిలోని ఫైవ్ ఇన్‌క్లయిన్ సమీపంలో దాదాపు 300 కుటుంబాలకు ఇంటింటికీ 5 కిలోల బియ్యం, 2 కిలోల పప్పు పంపిణీ చేశారు. గోదావరిఖని ప్రభుత్వ ఏరియా దవాఖానలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**యూపీ వాసులకు ఎమ్మెల్యే పెద్ది సాయం**

ఉత్తర్‌ప్రదేశ్ నుంచి నర్సంపేటకు వచ్చిన వలస కుటుంబాలకు శనివారం నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన పది కుటుంబాల వారు నర్సంపేటకు వచ్చి కూలీ పనులు చేస్తున్నారు. లాక్‌డౌన్ కారణంగా పనులు లేక తిండికి తిప్పలు పడుతున్నారు. సాయం కోరుతూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చారు. దీంతో క్వింటాల్ బియ్యం, రూ.5 వేలు నగదు అందించారు. దీంతోపాటు వారికి కరోనా పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

**వలస కూలీలకు నిత్యావసర సరుకులు..**

మామిడికాయల ఎగుమతి, ప్యాకింగ్ కోసం మధ్యప్రదేశ్ నుంచి జగిత్యాల మండలం చల్‌గల్‌కు వచ్చిన 85 మంది వలస కూలీల ఆకలి తీర్చారు రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్ సభ్యులు. లాక్‌డౌన్ నేపథ్యంలో వీరికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, సబ్బులు, బిస్కెట్లతో కూడిన సంచులను పంపిణీ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో నివాసముంటున్న వలస కార్మికులకు టీఆర్ఎస్ యువజన విభాగం నేతలు మహమూద్, అశోక్, రఫీయొద్దీన్, నరేశ్, కృష్ణ సాయం చేశారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు.

**కిరాణ వర్తక సంఘం చేయూత**

కరోనా నియంత్రణకు పెద్దపల్లి కిరాణ వర్తక సంఘం నాయకులు శనివారం జిల్లాకేంద్రంలో ప్రజలు, ప్రయాణికులకు నాలుగు వేల మాస్కులు పంపిణీ చేశారు. ఆ సంఘం నాయకులు అల్లెంకి సురేశ్, కేశెట్టి రవీందర్, ఇల్లందుల కృష్ణమూర్తి, యాద శ్రీనివాస్, వాటర్‌ప్లాంట్ జయ్‌పాల్‌రెడ్డి, సయీద్ కలిసి రూ.20వేల విలువైన మాస్కులను కౌన్సిలర్ కృష్ణమూర్తి చేతుల మీదుగా ప్రజలకు పంపిణీ చేశారు. రవాణా వ్యవస్థ స్తంభించి పోయి మధ్యప్రదేశ్‌లోని ఆమ్లాయి గ్రామానికి సైకిళ్లపై బయలుదేరిన కూలీలకు కాగజ్‌నగర్‌లో మాజీ కౌన్సిలర్ వెన్న కిశోర్‌బాబు భోజనం పెట్టారు. పెద్దపల్లి జిల్లా రామగుండంలోని థర్మల్ పవర్‌స్టేషన్‌లో పనిచేస్తున్న 15 మంది కూలీలు తమ ఊరికి సైకిళ్లపై బయలుదేరారు. శనివారం ఉదయం రామగుండం నుంచి బయల్దేరి మధ్యాహ్నం కాగజ్‌నగర్(93 కిలోమీటర్లు)కు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఏఎస్పీ వైవీఎస్ సుధీంద్ర అక్కడికి చేరుకొని రుమాలు కట్టుకొని సామాజిక దూరాన్ని పాటించాలని వారికి సూచించారు.

## సత్యాగ్రహంలా లాక్‌డౌన్

- **కరోనా నివారణకు చర్యలు**
- **పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి**



మంత్రి ఎర్రబెల్లి

**వరంగల్ ప్రధాన ప్రతినిధి–నమస్తేతెలంగాణ:** కరోనా వైరస్ నిర్మూలనకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు లాక్‌డౌన్‌ను సత్యాగ్రహంలా పాటించాలని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్‌తో పాటు పూర్వ వరంగల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులతో శనివారం మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. కరోనా నివారణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. కరోనా వైరస్ విజృంభించక ముందే మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సీఎం హామీ మేరకు రైతులు పండించిన ధాన్యం, మక్కజొన్నలతో సహా ప్రతి గింజను కొనుగోలు చేసే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ విషయంలో రైతులెవ రూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు గ్రామాలకే వచ్చి ధాన్యం తీసుకుంటారని చెప్పారు. నిత్యావసరాలు, కూరగాయలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

# ఎండల్లోనూ వానజల్లులు

**వాతావరణంలో మార్పులే కారణం • గతంతో పోలిస్తే మార్చిలో తగ్గిన ఉష్ణోగ్రత**

**ఐదేండ్లలో 42 నుంచి 43 డిగ్రీలు నమోదు • ఈసారి గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల్లోపే**

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** భానుడు భగభగ మండే ఎండాకాలంలో చిరుజల్లులు కురుస్తున్నాయి. ఉపరితల ద్రోణులు, ఆవర్తనాల ప్రభావంతో తరచూ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడుతున్నాయి. వడగండ్లు పొలాలను దెబ్బతీస్తున్నాయి. వెస్టర్న్ డిస్టబెన్స్‌తోపాటు తుఫాన్ వ్యతిరేక గాలులు (యాంటీ సైక్లోన్ వేవ్స్) వీయకపోవడం వంటివి వాతావరణంలో మార్పులకు కారణమని నిపుణులు చెప్తున్నారు. వాస్తవానికి మార్చి నెలాఖరు వచ్చిందంటే రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రత కనీసం 42 డిగ్రీల సెల్సియస్ దాటుతున్నది. ఈసారి ఒకటి రెండుచోట్ల తప్ప గరిష్ఠ ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు చేరలేదు. భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్, జగిత్యాల తదితర ప్రాంతాల్లో మాత్రమే 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కనిష్ఠ ఉష్ణోగ్రత 24 నుంచి 26 డిగ్రీలుగా రికార్డవుతున్నది. పగలు కొంత వేడిగా ఉన్నా.. రాత్రిళ్లు కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మరింత తక్కువ ఉంటున్నాయి. ఒకప్పుడు ఏసీలు వేసుకొంటే గానీ చల్లారని ఎండమంటలు.. ఇప్పుడు ఫ్యాన్ వేసుకున్నా సరిపోతున్నది.



గత ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండల కేంద్రంలో వర్షం కురుస్తున్నప్పటి చిత్రం

**ఐదేండ్లతో పోలిస్తే మూడు డిగ్రీలు తక్కువ**

రాష్ట్రంలో 2013 నుంచి 2019 వరకు మార్చిలో రికార్డయిన ఉష్ణోగ్రతలతో పోలిస్తే ఈసారి రాష్ట్రవ్యాప్తంగా రెండు, మూడు డిగ్రీలు తగ్గింది. గత ఐదేండ్లలో దాదాపు అన్ని జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 42 నుంచి 43 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. ఈసారి చాలా ప్రాంతాల్లో 37 నుంచి 39 డిగ్రీల వరకే పరిమితమయ్యాయి. దీనికి వెస్టర్న్ డిస్టబెన్స్ (ఉత్తర, పశ్చిమ వాయవ్య దిశలో వాతావరణ మార్పులు)తోపాటు తుఫాన్ వ్యతిరేక గాలులు (యాంటీ సైక్లోన్ వేవ్స్) వీయకపోవడం ప్రధాన కారణమని వాతావరణ నిపుణులు చెప్తున్నారు. తుఫాన్ వ్యతిరేక గాలులు లేకపోవడంతో గాలిలో తేమ తగ్గక ఎండలు పెరగలేదని తెలిపారు. ఉత్తర భారతంలో ఉపరితల ద్రోణులు, ఆవర్తనాల కారణంగా వర్షాలు కురుస్తుండటం వల్ల కూడా వేసవి తీవ్రత తగ్గిందని చెప్పారు. వాస్తవానికి హీట్‌వేవ్ జోన్ల పరిధిలోకి వచ్చే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్య మహారాష్ట్రల్లో ఈసారి సాధారణ స్థాయికి మించి ఉష్ణోగ్రతలు నమోదవుతాయని భారత వాతావరణశాఖ తొలుత అంచనావేసింది. కానీ జమ్ముకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ మొదలుకుని ఉత్తర భారతంలో వెస్టర్న్ డిస్టబెన్స్ వల్ల పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఢిల్లీ, గుజరాత్ వంటి ప్రాంతాల్లోనూ సగటు కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీఎస్‌డీపీఎస్) వాతావరణ సమాచారాన్ని విశ్లేషిస్తే.. 2013 నుంచి ఇప్పటివరకు పగటి ఉష్ణోగ్రత అత్యధికంగా 48.9 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. మార్చిలో 42 డిగ్రీలతో మొదలయ్యే ఎండలు మే నెలాఖరుకు 49 డిగ్రీలకు చేరుకుంటున్నాయి.

### వర్షాలు కురిసే అవకాశం

వాతావరణంలో మార్పుల కారణంగా తరచూ ఏర్పడుతున్న ఉపరితల ద్రోణులు, ఉపరితల ఆవర్తనాల వల్ల వర్షాలు కురిసి వాతావరణం చల్లబడుతున్నది. తాజాగా బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి, ఆవర్తనంతో మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ఈ నెల 31 వరకు ఇదే పరిస్థితి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఉత్తర కేరళ నుంచి దక్షిణ ఛత్తీస్‌గఢ్ వరకు ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక, మరాఠ్వాడ, విదర్భ మీదుగా సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తువద్ద ఉపరితల ద్రోణి ఏర్పడిందని తెలిపారు. ఆగ్నేయ, తమిళనాడు దానిని ఆనుకొని ఉన్న శ్రీలంక, నైరుతి బంగాళాఖాతం ప్రాంతాల్లో 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని చెప్పారు. దీని ప్రభావంతో ఆదివారం రాష్ట్రంలోని అక్కడక్కడ తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వానలు కురుస్తాయని వెల్లడించారు.

## స్వీయ నియంత్రణతోనే కరోనా కట్టడి

**రవాణాశాఖ మంత్రి పువ్వాడ**



మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** స్వీయ నిర్బంధం, స్వీయ నియంత్రణతో కరోనాను కట్టడి చేయగలమని రవాణా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాద్రి జిల్లాలో పాజిటివ్ కేసులు నమోదైన నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. దవాఖానల్లో ఐసోలేషన్ వార్డులు, బెడ్లు, టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. భద్రాచలంలో బ్రహ్మోత్సవాలను నిరాడంబరంగా నిర్వహిస్తున్నారని, భక్తులు ఎవరూ భద్రాద్రికి రాకూడదన్నారు. ఈ సమీక్షలో జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియానాయక్, మెచ్చా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉయ్యాలే ఉరితాడై..



దివ్య(ఫైల్)

**బెజ్జంకి:** సరదాగా ఉయ్యాల ఊగుతున్న బాలిక మెడకు ప్రమాదవశాత్తు చీర చుట్టుకోవడంతో ఊపిరాడక మరణించింది. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం కల్లెపల్లి గ్రామానికి చెందిన పబ్బతి దివ్య(14) శనివారం ఇంట్లో చీరతో కట్టిన ఉయ్యాల ఊగుతూ టీవీ చూస్తున్నది. ఒక్కసారిగా ఉయ్యాల మెడకు చుట్టుకొని విలవిల్లాడింది. కుటుంబసభ్యులు గమనించి దివ్యను అందులో నుంచి దించి చూడగా అప్పటికే మృతిచెందింది. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


నమస్తే తెలంగాణ
కరీంనగర్
ఆదివారం 29 మార్చి 2020
www.ntnews.com

# జిందగీ

ఒకసారి కరోనా బొమ్మల్ని పరీక్షగా చూడండి. దాన్నే ఫ్యాషనిస్టులు ప్రేరణగా తీసుకున్నారు. వైరస్ అయితే ఏమిటి.. దాంట్లో ఉన్న అందాన్ని పట్టుకున్నారు. వాటిని డ్రెస్‌ల మీద అందంగా ప్రింట్ చేయించారు. ఆ ఫ్యాబ్రిక్‌తో పొట్టి, పొడుగు డ్రెస్‌లు కుట్టేశారు. కాదేదీ ఫ్యాషన్‌కి అనర్హం అనేలా.. రకరకాల వైరస్‌ల బొమ్మలతో వచ్చిన బట్టలు ఇప్పుడు ట్రెండింగ్‌లో చేరిపోయాయి. కాకపోతే ఇవి మన దేశానికి చేరడానికి సమయం పట్టొచ్చు.

## వైరస్ డ్రెస్‌లు వైరల్!





**కరోనా..**
**ప్రేమికుల మధ్య దూరాన్ని పెంచింది.**
**ప్రేమికుల గుండెల్లో భారాన్నీ పెంచింది.**
**రోజూ ఏదో ఓ సమయంలో, ఎక్కడో ఓ దగ్గర కలుసుకుని...**
**కళ్లలోకి కళ్లుపెట్టి చూస్తూ ముచ్చట్లు చెప్పుకునే**
**లౌబర్డ్స్‌కు ఎన్ని ఇక్కట్లో?**
**ఆ తీయని బాధను ఫోన్‌లో చెప్పలేక, వాట్సాప్‌లో**
**పంపలేక, వీడియోకాల్‌లో వ్యక్తం చేయలేక ఓ ప్రేమికురాలు**
**నేరుగా ఓ లేఖ రాసింది. దాన్ని శానిటైజ్ చేసిమరీ**
**ప్రేమికుడికి పంపింది. మీరూ చదవండి...**
**ప్రేమ వైరస్ సోకిన ఓ యువతి కరోనా వైరస్**
**కారణంగా ఎన్ని కష్టాలు అనుభవిస్తున్నదో..**

## ప్రేమ ఎంత మధురం...
# కరోనా అంత కఠినం!

**డియర్ సిద్ధూ!**
ఎలా ఉన్నావ్? ఏం చేస్తున్నావ్‌రా?
ఏ లవ్ స్టోరీలో అయినా... అబ్బాయి నాయనో, అమ్మాయి తమ్ముడో విలన్ల అవతారం ఎత్తుతుంటారు. ప్రేయసీప్రియులు కలుసుకోకుండా కుట్రలు చేస్తుంటారు. మన కథలో మాత్రం కరోనా వైరస్ ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నది.
మార్చి పదిహేనున అనుకుంటా, మనం చివరిగా కలిసింది. అప్పటికే దేశమంతా కరోనా గురించి మాట్లాడుకోవడం మొదలైంది. కాఫీడేలో ఆ రోజు నేను 'సిద్ధూ నా ఎడమకన్ను కొట్టుకుంటోంది.. భయంగా ఉందిరా?' అంటే, నువ్వేమన్నావ్? 'పిచ్చిదానా అవన్నీ మూఢనమ్మకాలే' అన్లేదూ? ఇప్పుడు చూడు. నా అనుమానమే నిజమైంది. అంతా ఈ కరోనానే చేసింది. నా సిద్ధూని కలవకుండా చేసింది. నేను పంపిన మెసేజ్‌కు నీ నుంచి ఐదు నిమిషాల్లో రిప్లయ్ రాకపోతే.. నా గుండె వేగంగా కొట్టుకుంటుంది. నీకు ఏమైందో అన్న భయం స్థిమితంగా ఉండనీయదు. 'నా సిద్ధు ఎక్కడ దూరమవుతాడో' అనే ఆలోచన నన్ను వెంటాడింది. కరోనా రాక్షసి వల్ల వచ్చిన ఈ ఎడబాటు... ఎక్కడ శాశ్వతంగా మారుతుందో? టైటానిక్ సినిమాలో జాక్.. రోజ్‌ల స్టోరీలా, మన కథా మధ్యలోనే ఆగిపోతుందేమో? రేయ్ బండోడా.. నీకు అలాంటి భయాలేం లేవా?

నువ్వు కొంచెం జాగ్రత్తరా బాబూ. అసలే ఫ్రెండ్స్.. ఫ్రెండ్స్ అంటుంటావు. ప్లీజ్‌రా! ఏ ఫ్రెండ్స్ దగ్గరికీ వెళ్లకు. నీ దగ్గరికీ ఎవరినీ రానివ్వొద్దు. అస్సలు బయటికి వెళ్లొద్దు. ఏ కూరగాయలకో, పాలకో, మందులకో వెళ్లినా ముఖానికి మాస్క్ వేసుకో. శానిటైజర్ రాస్కో. అయినా బయటకు వెళ్లే పరిస్థితి లేదు. నైటొక వాట్సప్ వీడియో చూశాను. ఇద్దరు ఫ్రెండ్స్ సరదాగా బయటికెళ్లారు. పోలీసులు చూసి పట్టుకొని పిచ్చకొట్టుడు కొట్టారు తెలుసా? ఆ వీడియో చూడగానే నాకు నువ్వే గుర్తొచ్చావ్. అందుకే వీడియోకాల్ చేశాను. నువ్వేమో రిసీవ్ చేసుకోలేదు.

యాక్చువల్లీ.. నిన్ను చూడకుండా ఉండలేకపోతున్నా. ఇప్పుడే మీ ఇంటికి వచ్చేయాలనిపిస్తోంది. కానీ సోషల్ డిస్టెన్స్ పాటించాలి కదా.. అందుకే రాలేకపోతున్నాను. ప్రతి క్షణం నిన్నే తలుచుకుంటూ.. నీ ఊహల్లోనే విహరిస్తున్నా.
నా ఆలోచనల్లో నేనుంటే మమ్మీ ఏమో.. 'ఎప్పుడు చూసినా ఏదో పోగొట్టుకున్నట్టు దిగులుగా ఉంటావేంటే? ఏమైంది అసలు నీకు? జ్వరంగా ఉందా? దగ్గులాంటిది ఏమైనా ఉందా? జలుబు చేసిందా?' అని నన్నేదో కరోనా సోకినవారి లెక్క చూస్తున్నది. మామూలుగా కనిపించాలని ఎంత ట్రై చేసినా నా వల్ల కావడం లేదు.
'నాకేమీ కాలేదు మమ్మీ.. నన్ను అర్థం చేసుకోండి. కాసేపు నన్ను ఒంటరిగా వదిలేయండీ' అంటూ అరిచినంత పనిచేశాను. కొద్దిసేపటికి తేరుకొని 'అలా అనేశానేంటీ? మమ్మీ ఫీలైందేమో' అనుకొని.. 'మమ్మీ ఆకలిగా ఉందే' అంటూ తన ఒళ్లో వాలాను. అమ్మ తన చేత్తోనే ముద్దలు కలిపి పెడుతుండగా నువ్వు గుర్తొచ్చావు. 'నేనిక్కడ అమ్మచేతి వంట బాగానే తింటా. అక్కడ నా సిద్ధూ ఏం తింటున్నాడో ఏమో? అసలే తినేది తక్కువ.. పిజ్జాబర్గర్లతో కడుపునింపుకునే రకం' అనే ఆలోచన చుట్టుముట్టి రెండు ముద్దలు కూడా తినలేకపోయాను. మమ్మీ కిచెన్‌లోకి వెళ్లగానే నా కళ్లలోంచి నీళ్లు.

ప్రామిస్‌రా.. ఓ అరగంట సేపు వెక్కివెక్కి ఏడ్చాను. వెంటనే నీ ఫొటోలు.. టిక్‌టాక్ వీడియోలు చూసి కాస్త కుదుట పడ్డాను. అందరూ అనుకుంటారు కానీ.. ప్రేమ అంత ఈజీ కాదురా. ప్రేమించిన వ్యక్తిని.. చూడకుండా.. మాట్లాడకుండా ఉండటమంటే పెద్ద నరకమే. ఒక తిండి సరిగా ఉండదు. నిద్ర సరిగా ఉండదు. వేరేవాళ్లతో మాట్లాడే ఓపికా ఉండదు. ఉన్నదల్లా ఒక్కటే ప్రపంచం. ప్రేమ ప్రపంచం. మన మనసులు కలిసినప్పటి నుంచి ఇంతటి దూరాన్ని.. భారాన్ని.. భయాన్ని.. ఆందోళనను ఎప్పుడూ చూడలేదు. ఒకవైపు బయట ఏమవుతుందో అనే ఆలోచన.. దానికి తోడు మనమేమైపోతామో అనే ఆవేదన. మనసులో మనసు ఉండదు. మనిషి మనిషి లెక్కా ఉండరు.
మేముండే చైతన్యపురీ రెడ్‌జోనే.. మీరుండే చందానగర్ కూడా రెడ్‌జోనే. ఈ నెలాఖరుకి సమస్య సర్దుకుంటుందని అనుకున్నా. మళ్లీ ఇరవై ఒక్కరోజులని అంటున్నరు. కానీ, రోజూ ఓ యుగంలా గడుస్తున్నది. వర్క్‌ఫ్రమ్ హోమ్ ఇవ్వడం వల్ల పనిలో మునిగినంత సేపూ ఏ ఆలోచనా రాదు. నువ్వు కూడా పిచ్చి పిచ్చి ఆలోచనలు పెట్టుకోకుండా ప్రాజెక్ట్ కంప్లీట్ చెయ్యి. లేజీగా ఉండకుండా టీమ్ వీడియో కాన్ఫరెన్స్‌కి అటెండ్ అవ్వు. టైంకి తిను.
భవిష్యత్తును తలుచుకుంటే భయమేస్తున్నదిరా? మా బాసు అప్పుడే లెక్కలు వేసుకుంటున్నాడని తెలిసింది. 'స్టాఫ్ ఇంత మంది అవసరమా?' అని హెచ్‌ఆర్ వాళ్లని అడిగినట్టు తెలిసింది. అయినా నువ్వు చేస్తున్నది కూడా ఏమంత పెద్ద కంపెనీ కాదు. తేడా వస్తే దుకాణం బంద్ చేసినా చేస్తరు. అదే జరిగితే, మన పెళ్లి వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. ఇద్దరం సంపాదించుకుంటే కానీ హాయిగా బతకలేం. రేపు పిల్లలు పుడితే పెద్ద స్కూల్లో వేయాలి. లక్షల్లో డొనేషన్ కట్టాలి. వాటన్నింటికి పైసలు కావాలి కదా?
ఇన్ని రోజులు ఉన్నాం... ఇంకో ఏడాది ఉందాం. ఏం అవుతుంది. రోజూ సాయంత్రం కాఫీడేలో కబుర్లు, ఆదివారం ప్యారడైజ్‌లో డిన్నర్... ఈ రెండూ మాత్రం మిస్ కాకూడదు. ప్రామిస్! సరేనా? ఈ టెన్షన్లన్నీ పోయాక.. నేనే స్వయంగా నిన్ను మా ఇంటికి తీసుకెళ్లి మమ్మీ.. డాడీకి పరిచయం చేస్తా. 'నా సిద్ధూనే మ్యారేజ్ చేసుకుంటా' అని తెగేసి చెప్తా. కరోనా వైరస్ వేడిని తట్టుకోలేదట కదా! మన విరహాగ్నికి అది కాలి బూడిదైపోతుందిలే! పౌరాణిక సినిమాల డైలాగులు చెబుతున్నానని ఆశ్చర్యపోతున్నావా? ఇప్పుడే మా నాయనమ్మతో కలిసి కత్తి కాంతారావు సినిమా చూశాన్లే. త్వరలోనే కలుద్దాం. అప్పటివరకూ...
**సామాజికంగా దూరంగా...**
**మానసికంగా దగ్గరగా!**

**నీ.. ప్రత్యు**
**(ప్రత్యూష)**

**ప్రామిస్‌రా.. ఓ అరగంట సేపు వెక్కి వెక్కి ఏడ్చాను. వెంటనే నీ ఫొటోలు.. టిక్‌టాక్ వీడియోలు చూసి కాస్త కుదుటపడ్డాను. అందరూ అనుకుంటారుగానీ.. ప్రేమ అంత ఈజీ కాదురా. ప్రేమించిన వ్యక్తిని.. చూడకుండా.. మాట్లాడకుండా ఉండటమంటే నరకమే.**

**నువ్వు కొంచెం జాగ్రత్తరా బాబూ. అసలే ఫ్రెండ్స్.. ఫ్రెండ్స్ అంటుంటావు. ప్లీజ్‌రా! ఏ ఫ్రెండ్స్ దగ్గరికీ వెళ్లకు. నీ దగ్గరికీ ఎవరినీ రానివ్వొద్దు. అస్సలు బయటికి వెళ్లొద్దు.**

...✍ దాయి శ్రీశైలం

## వినండి సైన్స్ కథలు..



హోమ్ క్వారంటైన్‌లో బోర్ కొడుతున్నదా? ముఖ్యంగా పిల్లల విషయంలో ఆందోళన చెందుతున్నారా? అయితే మీకోసమే 'మ్యాంగో రేడియో' ఓ వినూత్న ప్రయోగం చేసింది. 'పిల్లల్ని ఖాళీగా ఉండనీయకుండా సైన్స్ కథలను చెపుతాం, దీంతో పాటు మరిన్ని కథలనూ వాట్సాప్ చేస్తాం' అంటున్నారు. దీని కోసం మీరు చేయాల్సిందల్లా 'TUNE ME INTO MANGO SCIENCE RADIO' అని టైప్ చేసి 9952243541 నంబర్‌కు వాట్సాప్ లేదా మెసేజ్ చేయడమే. అంతే, సైన్స్ స్టోరీలు వాట్సాప్‌లో వచ్చి పడతాయి. హోమ్ క్వారంటైన్‌లో బోర్‌గా ఫీలయ్యే వారిని ఉత్సాహపరిచేందుకు ఈ కార్యక్రమం చేపట్టామని నిర్వాహకులు అంటున్నారు.

## చేయి కలిపి.. చెరువు నింపి..




**ఇదొక సక్సెస్ స్టోరీ. ఎవరిది అనుకుంటున్నారా? రైతులది. పెట్టుబడి.. గిట్టుబాటు మధ్యన నిత్యం నలిగిపోయే రైతులకూ సక్సెస్‌లు ఉంటాయా? ఉంటాయి మరి.. ఎందుకు ఉండవు? ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురుచూస్తూ కూర్చోకుండా.. రైతులే చేయి చేయి కలిపి.. చెరువును నింపితే ఇలాంటి విజయగాథలు చాలానే ఉంటాయి.**

అది నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం ...నోముల. ఊరందరి వృత్తి వ్యవసాయం. ఏఎంఆర్‌పీ ప్రధానకాలువ నోముల నుంచే వెళ్తుంది. కానీ దాని నుంచి చుక్క నీరు కూడా స్థానిక పంట పొలాలకు పారదు. వర్షమే వారికి దిక్కు. మొగులుకు మొకమేసి ఎప్పుడు వాన పడుతుందా అని ఎదురు చూడటం తప్పితే.. ప్రత్యామ్నాయం లేదు. ఉంటేగింటే ఏఎంఆర్‌పీ నీటిని మళ్లించుకోవచ్చు. కానీ సామాన్య రైతుల వల్ల అవుతుందా?

### నీరాశ.. నిరాశైంది
నోముల సరిహద్దుమేర మొత్తం నిమ్మతోటలు.. పండ్లతోటలు.. పంట పొలాలకు నీటి అవసరాల కోసం రైతులు బోర్ల మీద బోర్లు వేసినా ఫలితం లేదు. ఇక ఉన్నది ఒకే అవకాశం. ఏఎంఆర్‌పీ నుంచి నీటిని లిఫ్ట్ చేసి గోరీలకుంట చెరువుకు మళ్లించాలి. దీంతో చెరువు నిండటమే కాకుండా.. భూగర్భజలాలు పుష్కలంగా పెరుగుతాయి. వర్షాలతో నింపే ప్రయత్నం చేసినా పైనుంచి నీరు రాక కుదర్లేదు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా నిరాశే మిగిలింది.

### ఐక్యంగా కదిలారు
ఎవరో వస్తారు, ఏదో చేస్తారు... అని ఎదురుచూస్తూ కూర్చోకుండా రైతులే ఐక్యంగా కదిలారు. ఎగువ ప్రాంతంలో ఉన్న గోరీలకుంట చెరువును నీటితో నింపాలనే లక్ష్యంతో గోరీలకుంట ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. నిర్మాణానికి రూ.30 లక్షలకు పైనే ఖర్చు అవుతుంది. ఇప్పుడు కావాల్సింది దాతల సహాయం. రైతుల నిర్ణయం నచ్చి గ్రామస్తుడు పన్నాల రాజశేఖర్‌రెడ్డి రూ.2 లక్షల విరాళం ఇచ్చారు. ఆ మొత్తంతో పనులైతే మొదలుపెట్టారు. ఇక ఒకర్ని చూసి ఒకరు దాతలు కదిలారు. రైతులు కూడా తలా ఇంత వేసుకున్నారు. రైతుల ఆశ ఫలించింది. గోరీలకుంట చెరువు నిండింది.

### మానేద్దామనుకున్నా:



మాకు పది ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దాదాపు 300 నుంచి 600 అడుగుల వరకు 20 బోర్లు వేసినా ఫలితం లేకుండా పోయింది. వర్షంపై ఆధారపడకుండా... మెట్ట పంటలను పండించేవాళ్లం. సరైన దిగబడి లేక ఓ దశలో వ్యవసాయం మానేద్దామనుకున్నా. అంతలోనే రైతులందరూ ఈ నిర్ణయం తీసుకున్నారు. నేను కూడా మా భూమిని పంప్‌హౌస్ నిర్మాణం కోసం ఉచితంగా ఇచ్చాను.
**పులిచర్ల రాంమూర్తి యాదవ్**

### చుక్కనీరు కూడా వృథా పోకుండా ...
ఏఎంఆర్‌పీ ప్రధాన కాలువకు పక్కనే పంప్‌హౌస్‌ను నిర్మించుకున్నారు. ప్రధాన కాలువ నుంచి పంప్‌హౌస్‌కు నీరు వచ్చే ఏర్పాటు చేసుకొని... పంప్‌హౌస్ నుంచి దాదాపు 750 మీటర్ల దూరంలో ఉన్న గోరీలకుంట చెరువుకు 3 వరుసలతో పైపులను ఏర్పాటు చేశారు. పంప్‌హౌస్‌కు లిఫ్ట్‌ను ఏర్పాటుచేసి మోటార్ల సాయంతో పంప్‌హౌస్ నుంచి పైపుల ద్వారా చెరువులోకి నీరు వదులుతున్నారు. నీరు వృథాగా బయటకు పోకుండా, సాగుకు వినియోగించుకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

### పెరిగిన భూగర్భ జలాలు
గోరీలకుంట ఎత్తిపోతల పథకం నిర్మించకముందు ఈ గ్రామంలో దాదాపు 800 అడుగుల లోతులో బోర్లు వేసినా నీరు రాలేదు. ఎగువ ఉన్న గోరీలకుంట చెరువు నిండటం వల్ల భూగర్భ జలాలు పెరగనున్నాయి. తద్వారా ఈ ప్రాంతంలో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. పథకం పూర్తయ్యి బోర్లు పోస్తుండటంతో నీటి కొరత తీరిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

...✍ సుధీర్
నకిరేకల్, నమస్తే తెలంగాణ



సందేహం సమాధానం

## మలేరియా ఉన్న దేశాలను
# కరోనా ఏం చేయలేదా?

**ఇండియా, పాకిస్థాన్, థాయ్‌లాండ్ లాంటి ఉష్ణమండల దేశాల్లో మలేరియా ఎక్కువ కాబట్టి, మనకు కరోనాను ఎదుర్కొనే నిరోధకశక్తి ఉందని అంటున్నారు. ఇది నిజమేనా? మనకి కరోనా వల్ల పెద్దగా ప్రమాదం లేదా?**
**- కిరణ్,** హైదరాబాద్


గణాంకాలను బట్టి అమెరికా, ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్ వంటి దేశాల్లో కరోనా వ్యాధి ప్రబలుతున్నట్టుగా చూస్తున్నాం. ముందుగా ఆ దేశాలు ఈ వ్యాధిని సీరియస్‌గా పట్టించుకోకపోవడం వల్ల, ఇప్పుడు కమ్యూనిటీ వ్యాప్తి దశకు చేరి ఉద్ధృతం అయిందని నిపుణులు అంటున్నారు. అందుకే మన ప్రభుత్వాలు ముందుజాగ్రత్త చర్యగా లాక్ డౌన్ చేశారు. ఇలా చేయకుంటే, అందరూ బయటికి వచ్చి వైరస్‌కి ఎక్స్‌పోజ్ అయి, కమ్యూనిటీ వ్యాప్తి అయితే మన దేశం తట్టుకోవడం కష్టం.
అయితే మలేరియా ఎక్కువగా వ్యాప్తి చెందే ఉష్ణమండల దేశాల్లో కరోనా వైరస్‌కు నిరోధకత ఉందని ఒక వాదన ఉంది. దీనికి కారణం... మలేరియా వ్యాప్తి లేని దేశాల్లో కరోనా వ్యాప్తి తీవ్రంగా ఉందనీ చిన్నవయసువారికి కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయనీ, చనిపోతున్నారనీ చెప్తున్నారు. కాని మనదేశంలో వృద్ధులు, ఇమ్యూనిటీ తక్కువగా ఉన్నవాళ్లు, ఇతరత్రా వ్యాధులు, కాంప్లికేషన్లు ఉన్నవాళ్లలో మాత్రమే జబ్బు తీవ్రంగా ఉంటున్నది. మరణించినవాళ్లలో అలాంటి వారు మాత్రమే ఉన్నారు. ఈ గణాంకాల ఆధారంగానే... పైన చెప్పిన ప్రతిపాదన ఉంది. తరతరాలుగా మలేరియాకు ప్రభావితం కావడం వల్ల మన జన్యువులు మార్పులు చెంది, ఇప్పుడు కరోనా లాంటి వైరస్‌లను తట్టుకునే నిరోధకతను మనలో పెంపొందించి ఉండొచ్చని ప్రతిపాదిస్తున్నారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం కూడా ఇందుకు మరో కారణం అంటున్నారు. అయితే ఈ ప్రతిపాదనలన్నీ పరిశీలనలు మాత్రమే. వీటిపై ఇంకా అధ్యయనాలు జరుగలేదు. రుజువులు లేవు. కాబట్టి మనకు ప్రమాదం లేదులే అని, అప్రమత్తంగా ఉండకపోతే కమ్యూనిటీ వ్యాప్తి దశకు చేరుకునే ఆస్కారం ఉంది. అందుకే ఇంటినుంచి బయటికి రాకుండా, జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. లాక్‌డౌన్ సమయంలో ప్రభుత్వం చెప్పిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటిస్తేనే మనం ప్రమాదం నుంచి బయటపడుతాం. అలాగని భయాందోళనలతో మానసిక ఒత్తిడి పెంచుకోవద్దు. అసత్య ప్రచారాలను నమ్మి భయపడొద్దు. ఆ ప్రతిపాదనలు నిజమైతే మనకన్నా అదృష్టవంతులు లేరు.



**డాక్టర్ ఎం.వి. రావు**
సీనియర్ జనరల్ ఫిజీషియన్
యశోద హాస్పిటల్స్
హైదరాబాద్

జిందగీ+ చింతన

- తిరుగులేని ఈకాలపు జగద్గురువు
- అద్భుత మానవతామూర్తి
- ఆధ్యాత్మిక సాధకులకు ఆదర్శం



# కారణ కారుణ్య జన్ముడు!

ప్రత్యేక వ్యాసం

**భారతీయ ధార్మికవేత్త శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి వ్యక్తిగతంగా ఎంత సామాన్యుడో ఆధ్యాత్మిక వ్యవహారాలలో అంతటి కారణజన్ముడు. కనుకే, వారిలో అంతటి చెక్కుచెదరని నిజాయితీ, భక్తి జ్ఞాన చింతన, నిశ్చల నిబద్ధత, మూర్తీభవించిన కారుణ్యం, ఆదర్శవంతమైన మార్గదర్శకత్వం.. వంటివన్నీ సాధ్యమవుతున్నట్టు అనుభవజ్ఞులు చెప్తారు. ఆయన ఎంత ప్రశాంతచిత్తులో అంతటి లోతైన శాస్త్రాగరిష్ఠులు. రేపటి (30వ తేది)తో వారు 'సప్తతి' సంవత్సరంలోకి అడుగిడుతున్న వేళ.. వారి దివ్యజీవితాన్ని క్లుప్తంగానైనా తెలుసుకొందాం.**



'మనిషి తినడం కోసం పుట్టాడా? లేక, బతకడం కోసమే తినాలా?' అంటే 'రెండో దానికి' మద్దతునిచ్చే వారు చాలా చాలా అరుదు. కంటికి కనిపించని 'పారమార్థిక స్థాయి ఆనందం' కోసం భౌతికసుఖాలను త్యజించడానికి ఇష్టపడని వారే ప్రపంచంలో అత్యధికులు. కండ్లెదుట పంచభక్ష్య పరమాన్నాలుండగా, ఏవో 'కొద్ది పచ్చడి మెతుకుల'తో తృప్తి చెందడమన్నది చాలామందివల్ల అయ్యే పనికాదు. పరమోత్కృష్టమైన మానవజన్మ సార్థకతకోసం ఆరాటపడటం, దానికోసమే అంకితమై యావజ్జీవితాన్నీ ధారపోయడం, సర్వకాల సర్వావస్థలలోను ధార్మికమార్గమే శరణ్యంగా మానవాళికి దిశానిర్దేశనం చేయడం ఇలాంటివన్నీ.. కేవలం 'కారణ జన్ముల'కు మాత్రమే సాధ్యమవుతాయి. అలాంటి అతిఅరుదైన భారతీయ జగద్గురువులలో ఒకరే శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి. కర్నాటకకు చెందిన శృంగేరిలోని శ్రీ శారదా మఠం పీఠాధిపతిగా గత 31 ఏండ్లుగా (1989 అక్టోబర్ 19న వ్యాఖ్యాన సింహాసనాన్ని అధిష్ఠించిన నాటినుంచీ).. వారు నడిచిన మార్గం, భక్తులకు చూపిన దోవ, సమస్త మానవాళికి ప్రసాదించిన జ్ఞానదీక్ష మహామహులైన జగద్గురువుల పరంపరను గుర్తుకు తెస్తున్నది.

ఎలాంటి భేదాభిప్రాయాలకు తావు లేకుండా ప్రపంచ ప్రజలందరికీ సమంగా జ్ఞానామృతాన్ని పంచి పెట్టే సద్గురువులూ నిజానికి చాలా అరుదుగానే కనిపిస్తారు. పేద-ధనిక, కుల-భాషా భేదాలకు అతీతంగా భారతీయులైన వైదికులందరికీ శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారు 'ఒకే స్థాయి కారుణ్యాన్ని, ప్రేమను కురిపిస్తారన్నది' ఎందరో భక్తులకు, శిష్యులకు స్వీయానుభవంలోకి వచ్చిన సత్యమే. సుమారు 1,200 సంవత్సరాల (క్రీ.శ. 788-820 మధ్య కాలం) కిందట దక్షిణ భారతావనిలోని కాలడి (కేరళ)లో అవతరించిన సాక్షాత్ శివస్వరూపులైన జగద్గురువు ఆదిశంకరుల వారి మహోత్కృష్ట జగద్గురు పరంపరను అత్యంత ప్రామాణికంగా కొనసాగిస్తున్న ప్రతిష్ఠాత్మకమైన శృంగేరీ పీఠాధిపతులలో వీరు 36వ వారు. ఈ (శార్వరి) ఏడాది చైత్రశుక్ల షష్ఠి (30వ తేది) నాటికి 69 (పుట్టినతేది: 11.4.1951) సంవత్సరాలు పూర్తి చేసుకొని, సప్తతి (70వ వసంతం)లోకి అడుగిడుతున్న శ్రీ సన్నిధానం (వారి భక్తుల ఆరాధ్యనామం) జీవిత విశేషాలు ఆధ్యాత్మిక సాధకులకు అత్యంత స్ఫూర్తిదాయకంగానే కాక ఆదర్శంగానూ నిలుస్తాయి.

ప్రత్యేకించి వైదికమత ధర్మసంరక్షకులుగా, ప్రబోధకులుగా జగద్గురువు ఆదిశంకరులు ప్రసాదించిన ఉత్కృష్టమైన బాధ్యతలను పూర్తి సమర్థవంతంగా నిర్వర్తిస్తున్న శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారిలో ఆధ్యాత్మికతతోపాటు మానవతా వాదమూ అత్యున్నత స్థాయిలో కనిపిస్తుంది. యావత్ భారతంలోనే ఎంతో విలువైన తిరుగులేని జగద్గురువు పవిత్రస్థానం ఆయనది. భారతీయ వేదాంతాలు, ధర్మశాస్త్రాలలో ప్రస్తుత మహానుభావులలోనే 'అత్యున్నత పరమహంస సన్యాసపదవీ' వారిది. చూడటానికైనా, మాటతీరులోను అత్యంత ప్రశాంతంగా, ఎంతో సౌమ్యుడుగా కనిపించే వారిలోని జ్ఞానసంపద మాత్రం వెలకట్టలేనిది. ఒక్కమాటలో చెప్పాలంటే, ధార్మికపథంలో భక్తిసాధన, మోక్షజ్ఞానాన్వేషణ కోసం యావత్ మానవాళికి కారుణ్యామృతాన్ని కురిపిస్తున్న కారణజన్ముడాయన. ప్రజల పట్ల, జీవజాతులపట్ల ఆయన చూపించే ప్రేమ అనంతం. భారతీయ సనాతన ధర్మమూర్తిగా ఇందుకోసమే వారు జన్మించారనడంలో ఎవరికీ ఎలాంటి సందేహం అక్కర్లేదు.

జగద్గురువు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారు ప్రచారార్భాటాలకు ఎంత దూరమో ధర్మకార్యాలు, కర్తవ్యాల పట్ల అంతే నిబద్ధులు. ఈ ఏడు పదుల జీవితం ఆసాంతం ఎంత నిజాయితీగా, నిష్కల్మషంగా సాగిందో వారి దివ్య జీవితగాథ (రచన: ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు) చదివితే అర్థమవుతుంది. ఆయన జీవితంలోని ప్రతీ కోణాన్ని లోతుగా కనుక అర్థం చేసుకోగలిగితే, ఇంతటి స్థాయికి చేరడం కోసం వారు సల్పిన నిరంతర కృషి, పట్టుదల, క్రమశిక్షణ, అంకితభావం, వారసత్వంగా అలవడిన సద్గుణాలు, చివరగా.. మనోబలంతో పొందిన స్థిరమైన వైరాగ్యం.. వంటివన్నీ ఒక్కటొక్కటిగా మనలను ఆశ్చర్యచకితులను చేస్తాయి. ఒక సామాన్య వ్యక్తికి ఏ మాత్రం సాధ్యం కాని పరిస్థితులే అన్నీను. అయినా, వాటన్నింటినీ దీటుగా ఎదుర్కొని, వారు నిలిచి గెలిచిన తీరు ఈకాలం మనుషులకైతే ఒక పెద్ద వింత.

ఇంతేకాదు, శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామివారి పుట్టుక, అంతకు ముందటి ఘటనలు, బాల్యంలో వారు ప్రదర్శించిన నమ్మశక్యం కాని భక్తిభావం, విద్యాభ్యాస తీరు, జ్ఞాన సముపార్జన వైఖరి, పదేండ్ల వయసులోనే సంస్కృతభాషలో పట్టు సాధించిన వైనం, ఏకంగా జగద్గురువు, 35వ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ అభినవ విద్యాతీర్థ మహాస్వామి అంతటి మహానుభావుని అనుగ్రహాన్ని, చెక్కుచెదరని ప్రేమను పొందడం.. అన్నీ అనూహ్య విషయాలే. శ్రీశ్రీశ్రీ అభినవ విద్యాతీర్థ మహాస్వామి వారి ఆధ్వర్యంలోనే దశాబ్దాలుగా సాగిన శాస్త్రాధ్యయనాలు ఆయనలోని జ్ఞానజ్యోతిని అసాధారణ స్థాయిలో ప్రకాశవంతం చేశాయి. శృంగేరిలోని పవిత్రనేల అణువణువునూ వారు ఆకళింపు చేసుకొన్న విధానం, ఉత్తరాధికారి నియామకం నుంచి శ్రీమహాసన్నిధానం నిర్యాణం వరకూ ఎదురైన ప్రతీ అనుభవం వారిలో పరిపూర్ణత్వాన్ని సాధించిపెట్టాయి. 36వ జగద్గురువుగా పీఠాధిపత్యం పొందిన తర్వాత ప్రతిష్ఠాత్మకమైన వ్యవహారాలన్నింటినీ శ్రీమహాసన్నిధానం వలెనే వారు కూడా ప్రామాణికంగా, శాస్త్రోక్తంగా నిర్వహించడం వరకూ.. అన్నీ ఆయనలోని గొప్పతనాన్ని వెల్లడిస్తాయి.

ఇదంతా ఒక ఎత్తయితే, సీతారామాంజనేయుడి (పూర్వనామం)గా కన్న తల్లిదండ్రులనుంచి తాను పొందిన వారసత్వపు 'సంస్కార పెన్నిధి' అంతా మరో ఎత్తు. మొత్తంగా మౌలికాధారంగా నిలిచిన ఈశ్వరాంశ వరప్రసాదమైన 'దివ్య గ్రాహ్యశక్తి' వారి నిలువెత్తు వ్యక్తిత్వానికి అద్భుత పునాది అయ్యింది. యావత్ ప్రపంచానికే మార్గనిర్దేశనం చేసిన శంకర భగవత్పాదుల వారి అద్వైత జ్ఞానసంపదను ప్రపంచ మానవాళికందరికీ అందించే బృహత్ కార్యభారాన్ని మోసిన స్వామి వివేకానంద, స్వామి శివానంద సరస్వతి, అరవింద్ ఘోష్ వంటివారు అందించిన స్ఫూర్తిని పూర్తి సమర్థవంతంగా అందుకొన్న అతికొద్ది మందిలో శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారు ముందువరుసలో ఉంటారు.

... దోర్బల బాలశేఖరశర్మ

## దైవాంశ సంభూతుడు!

శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారు కారణ జన్ములని చాటడానికి ప్రత్యక్ష నిదర్శనం వారి తల్లిదండ్రులే. ఎంతో శక్తివంతమైన శ్రీరుద్రాభిషేకాన్ని ఒక సంవత్సరంపాటు వారి తండ్రి (తంగిరాల వెంకటేశ్వర అవధాని) తన స్వగ్రామం (గుంటూరుజిల్లా నాగులేరు నదీతీరంలోని అలుగుమల్లెపాడు)లోని ఒక శివాలయంలో ఆచరించినట్లు చెప్తారు. తల్లి (శ్రీమతి అనంతలక్ష్మమ్మ)కి కలలో కనిపించిన ఆంజనేయుడు 3 మామిడిపండ్లను ప్రసాదించాడుట. ఫలితంగానే 'దైవాంశ సంభూతుడు' జన్మించినట్లు వారిద్దరూ పరిపూర్ణంగా విశ్వసించారు. దీనినే నిజం చేస్తూ ఆ బాలుడు అంచలంచెలుగా ఎదుగుతూ, జగద్గురువు స్థాయికి చేరుకొన్నాడు. ఇది సామాన్యులకు సాధ్యమయ్యే పనేనా!



## మైక్రో మోడల్స్






ఆ ఇంట్లో అన్నీ చిన్న, చిన్న వస్తువులే కనిపిస్తాయి. కత్తెర, గొడ్డలి, బోల్టు, మేకులు, రేడియో, ఫర్నీచర్ ... ఒకటని కాదు, ప్రతిదీ చిన్నదిగానే ఉంటుంది. అమెరికాకు చెందిన డిమ్ట్రికి ఇలాంటి బుజ్జి వస్తువులను తయారు చేయడం అంటే ఇష్టం. ఒక్కో వస్తువు చేయడానికి కనీసం రెండు నెలల సమయాన్ని తీసుకుంటాడట. ఒక్క డ్రిల్లింగ్ మెషీన్‌కి మాత్రమే కాస్త ఎక్కువ పట్టింది. తను మొట్టమొదట తయారు చేసింది గిటార్‌ని. ఇది మామూలు గిటార్‌లో ఐదో వంతు కూడా ఉండదు. 'ఈ బుల్లి ప్రపంచమంటే నాకు చాలా ఇష్టం.' అని చెబుతాడు డిమ్. ఇలా తయారు చేస్తున్న వస్తువులు ఎందుకూ పనికిరావనుకునేరు! ఆ కత్తెర్లతో కట్ చేసుకోవచ్చు. ఆ చాకులతో పళ్లను కోసుకోవచ్చు. ప్రతిదాన్నీ ఉపయోగించుకోవచ్చు. భలే ఉంది కదా!

## దారి కనుక్కోండి




## చుక్కలు కలుపండి



# చిత్రం

# అక్షయ్ 25 కోట్ల విరాళం




ప్రపంచవ్యాప్తంగా కరోనా విలయతాండవం చేస్తోంది. భారత్‌లో కూడా వైరస్ వ్యాప్తి ఉధృతం అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వాలకు తమ వంతు చేయూతనందించేందుకు సినీ తారలు ముందుకొస్తున్నారు. బాలీవుడ్ అగ్ర హీరో అక్షయ్‌కుమార్ శనివారం 25కోట్ల భూరి విరాళాన్ని ప్రకటించారు. దేశవ్యాప్తంగా సినీరంగానికి చెందిన వారు ఇప్పటివరకు ప్రకటించిన విరాళాల్లో ఇదే అత్యధిక మొత్తం కావడం విశేషం. ఈ సందర్భంగా ట్విట్టర్‌లో అక్షయ్‌కుమార్ భావోద్వేగభరితమైన పోస్ట్ చేశారు. 'ఈ తరుణంలో ప్రజల జీవితాలే మనందరికి ముఖ్యం. అందుకోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధపడాలి. ప్రజా శ్రేయస్సును కాంక్షిస్తూ నా సేవింగ్స్ నుంచి 25కోట్లు భారత ప్రధానమంత్రి సహాయనిధికి అందజేస్తున్నా. జీవితాల్ని కాపాడే యజ్ఞంలో అందరం భాగస్వాములమవుదాం. ప్రాణం ఉంటేనే ప్రపంచం ఉంటుంది' అని ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు అక్షయ్‌కుమార్.





## సినిమా చూసి కన్నీళ్లొచ్చాయి

లాక్‌డౌన్ డైరీస్

మలయాళీ భామ కల్యాణి ప్రియదర్శన్ లాక్‌డౌన్ టైమ్‌ను సినిమాలు చూస్తూ గడుపుతోందట. ఈ 21రోజుల్లో 21 సినిమాలు చూడాలని ఫిక్సైపోయిందట ఈ సొగసరి. ఈ సందర్భంగా ఆమె 'మిరాకిల్ ఇన్ సెల్ నెం.7' అనే టర్కిష్ సినిమాను చూసిందట. సార్వజనీన భావాలు కలబోసిన ఈ సినిమా చూసి కన్నీళ్లను ఆపుకోలేకపోయానని కల్యాణి ప్రియదర్శన్ పేర్కొంది. 'నేను సాధారణంగా సినిమాలు చూడమని ఎవరితో చెప్పను. కానీ ఇదొక అసాధారణమైన కథ. భాషా, సంస్కృతులకు అతీతంగా ప్రతి ఒక్కరి హృదయాల్ని కదిలించే భావోద్వేగాలున్నాయి. లాక్‌డౌన్ కారణంగా ఇలాంటి గొప్ప సినిమాల్ని చూసే అవకాశం దక్కింది. సినిమా చూసి చివరిసారిగా ఎప్పుడు ఏడ్చానో నాకు గుర్తులేదు. ఈ సినిమా మాత్రం కన్నీళ్లు పెట్టించింది' అని ట్విట్టర్‌లో పేర్కొంది కల్యాణి ప్రియదర్శన్.




## కరోనాపై స్ఫూర్తిగీతం




కరోనా మహమ్మరిపై పోరులో సినీ తారలంతా మేము సైతం అంటూ కదిలివస్తున్నారు. వ్యాధి నివారణకు ఆర్థికపరమైన విరాళాల్ని ప్రకటించడంతో పాటు సోషల్‌మీడియా వేదికగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నారు.

తాజాగా ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కరోనా కట్టడిపై తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని సూచిస్తూ ఓ గీతాన్ని ఆలపించారు. దీనిని ఆయన సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. 'కరోనా కరోనా..ఎక్కడిదీ కరోనా.. ఏమిటీ కరోనా.. కంటికి కనిపించని పెను శత్రువు ఈ కరోనా..అంటురోగమై సోకే మృత్యువు ఈ కరోనా' అంటూ సాగే ఈ పాట ప్రస్తుతం సోషల్‌మీడియాలో అందరి దృష్టిని ఆకట్టుకుంటోంది. కరోనాను జయించాలంటే ప్రభుత్వాలు నిర్దేశించిన నియమనిబంధనల్ని తప్పకుండా పాటించాలని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రజలకు సూచించారు. ఈ గీతాన్ని వెన్నెలకంటి రాజేశ్వర ప్రసాద్ రచించారు.



## చిరంజీవి ఆధ్వర్యంలో కరోనా క్రైసిస్ చారిటీ

కరోనా మహమ్మారి కారణంగా సినీ పరిశ్రమలోని దినసరి వేతన కార్మికులు ఉపాధిని కోల్పోయారు. ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్న వారిని ఆదుకోవడానికి చిరంజీవి ఆధ్వర్యంలో సి.సి.సి. మనకోసం (కరోనా క్రైసిస్ చారిటీ మనకోసం) అనే సంస్థ ఏర్పాటైంది. ఈ సేవాసంస్థకు చిరంజీవి చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. తమ్మారెడ్డి భరద్వాజ, సురేష్‌బాబు, సి.కల్యాణ్, దామోదరప్రసాద్, బెనర్జీ, ఎన్. శంకర్ సభ్యులుగా వ్యవహరించనున్నారు. దర్శకుల సంఘం అధ్యక్షుడు ఎన్.శంకర్ తెలియజేస్తూ 'తెలుగు సినిమా పరిశ్రమకు సంబంధించిన వేలాది కార్మికులకు అండగా నిలబడాలనే సంకల్పంతో ఈ చారిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సేవా కార్యక్రమంలో కమిటీతో పాటు సినీ పరిశ్రమలోని అన్ని కార్మిక సంఘాల నాయకులు భాగస్వాములు కానున్నారు. కేసీఆర్ నేతృత్వంలో కరోనా నిర్మూలన కోసం అద్భుతమైన కృషి జరుగుతోంది. ఈ సేవా కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఆశీస్సులు, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ అండదండలు లభించాలని కోరుతున్నాం' అని తెలిపారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ 'మన సోదర కార్మికులకి మనం ఏం చేయగలం అనే ఆలోచనతో చిరంజీవి ముందుకొచ్చారు. ఆయన ఆధ్వర్యంలో చిత్ర పరిశ్రమలోని కార్మికుల సంక్షేమార్థం పలు కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించాం' అని తెలిపారు. ఈ సీసీసీ మనకోసం చారిటీ సంస్థకు మూడు కోట్ల ఎనభై లక్షలు ఇప్పటివరకు సమకూరాయని చిరంజీవి చెప్పారు. మహేష్‌బాబు 25 లక్షలు, రామ్‌చరణ్ ముప్పై లక్షలు, ఎన్టీఆర్ ఇరవై ఐదు లక్షలు ఇచ్చారు.


### రాధాకృష్ణ ఇరవై లక్షలు



కరోనా బాధితుల్ని ఆదుకునేందుకు సినీ రంగం కదిలివస్తున్నది. కరోనా నివారణలో భాగంగా రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు కలిపి హారిక హాసిని క్రియేషన్ అధినేత ఎస్. రాధాకృష్ణ(చినబాబు) 20 లక్షల విరాళం ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వానికి పది లక్షలు, ఏపీకి పది లక్షలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

## చిన్ననాటి రోజులు గుర్తొచ్చాయి

దేశవ్యాప్తంగా విధించిన 21రోజుల లాక్‌డౌన్‌ను సినీ తారలు బాధ్యతతో ఆచరిస్తున్నారు. విరామ సమయాల్ని కుటుంబ సభ్యులతో ఆస్వాదిస్తూనే తమకిష్టమైన వ్యాపకాలతో ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోల్ని సోషల్‌మీడియాలో అభిమానులతో పంచుకుంటున్నారు. తాజాగా కాజల్ అగర్వాల్ తాను దూరదర్శన్‌లో రామాయణాన్ని చూస్తున్న ఫొటోను ట్విట్టర్‌లో షేర్ చేసింది. 'రామాయణం చూస్తుంటే నా చిన్ననాటి రోజులు గుర్తుకొచ్చాయి. అప్పటిరోజుల్లో వారాంతాల్ని రామాయణ, మహాభారతాల్ని చూస్తూ గడిపేవాళ్లం. దూరదర్శన్‌లో తిరిగి వాటిని పునఃప్రసారం చేయడం ఆనందంగా ఉంది. నేటితరం పిల్లలు ఈ పురాణ ఇతిహాసాల గురించి తెలుసుకునే అవకాశం దక్కింది' అని కాజల్‌అగర్వాల్ పేర్కొంది. లాక్‌డౌన్ సమయంలో ప్రజల కాలక్షేపం కోసం 1987లో విశేష ప్రాచుర్యం పొందిన రామాయణ, మహాభారత్ సీరియళ్లను ప్రతిరోజూ పునః ప్రసారం చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం కాజల్ అగర్వాల్ తెలుగులో చిరంజీవి సరసన 'ఆచార్య' సినిమాలో కథానాయికగా ఎంపికైన విషయం తెలిసిందే.




## దగ్గుబాటి ఫ్యామిలీ కోటి వితరణ

కరోనా వ్యాప్తి నిరోధానికి నిరంతరం శ్రమిస్తోన్న వైద్య సిబ్బంది సంక్షేమం కోసం, చిత్రీకరణలు నిలిచిపోవడంతో కష్టాలు పడుతున్న పేద కళాకారులు, సినీ కార్మికుల సంక్షేమం కోసం సురేష్ ప్రొడక్షన్స్ సంస్థ కోటి రూపాయల విరాళాన్ని ప్రకటించింది. లాక్‌డౌన్ అమలుకు ప్రతి పౌరుడు బాధ్యతగా నడచుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల్ని తప్పకుండా పాటించాలని ప్రముఖ నిర్మాత సురేష్‌బాబు, సీనియర్ కథానాయకుడు వెంకటేష్, యువహీరో రానా ఓ ప్రకటనలో తెలిపారు.

## నాగార్జున కోటి విరాళం

లాడ్‌డౌన్ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న సినీ కార్మికుల్ని ఆదుకోవడానికి సీనియర్ హీరో నాగార్జున కోటి రూపాయల విరాళాల్ని ప్రకటించారు. ప్రజల రక్షణ కోసం లాక్‌డౌన్ అవసరం కాబట్టి ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆదేశాల్ని పాటించాలని నాగార్జున కోరారు.



## వాణిజ్య

**వెన్‌కాబ్ చికెన్ ధరలు (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 85.00 | రిటైల్ లైవ్ | 107.00 |
| డ్రెస్‌డ్ | 155.00 | స్కిన్‌లెస్ | 177.00 |

**గుడ్ల ధరలు (వందకు)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 335.00 | వరంగల్ | 338.00 |
| మెదక్ | 335.00 | కరీంనగర్ | 338.00 |
| రంగారెడ్డి | 335.00 | డజన్ ధర | 54.00 |

# మనసున్న మారాజు

## కరోనా కట్టడికి టాటా రూ.1,500 కోట్ల సాయం

- **యుద్ధానికి మేము సైతమంటున్న కార్పొరేట్లు**
- **హ్యుందాయ్, సన్‌ఫార్మా, జేఎస్పీఎల్, ఎన్‌హెచ్‌పీసీ కూడా..**
- **వైరస్ బాధితుల కోసం ఎన్టీపీసీ దవాఖానలు**

**ముంబై, మార్చి 28:** దేశాన్ని కరోనా వైరస్ కుదిపేస్తున్న వేళ.. టాటాలు పెద్ద మనసుతో స్పందించారు. గతంలో ఏ కార్పొరేట్ సంస్థ చూపనంత ఔదార్యాన్ని ప్రదర్శించారు. టాటా సన్స్ రూ.1,000 కోట్లు, టాటా ట్రస్ట్స్ రూ.500 కోట్ల చొప్పున సాయాన్ని అందజేయనున్నట్లు తెలిపాయి. వైరస్ నిర్మూలన కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వైద్య సిబ్బంది వ్యక్తిగత సంరక్షణార్థం, పెరుగుతున్న రోగుల శ్వాసకోశ ఇబ్బందుల చికిత్స కోసం, కొత్త కేసుల నిర్ధారణ నిమిత్తం, అత్యాధునిక వైద్య సదుపాయాల కల్పనకు ఈ నిధులను వినియోగించనున్నారు. కరోనా వైరస్‌పై ప్రజల్లో అవగాహన పెంపు, హెల్త్ వర్కర్లకు శిక్షణ కోసం కూడా ఈ నిధులను ఖర్చు చేస్తామని శనివారం ఓ ప్రకటనలో టాటా ట్రస్ట్స్ తెలిపింది. కరోనాపై టాటా ట్రస్ట్స్, టాటా సన్స్, టాటా గ్రూప్ సంస్థలు స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోరాడుతాయని సదరు ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ కష్ట కాలంలో నిరుపేదలకు అండగా ఉందామని పిలుపునిచ్చింది. 'ప్రస్తుతం భారత్‌లో, మరికొన్ని దేశాల్లో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. వీటిని కలిసికట్టుగా ఎదుర్కొని విజయం సాధిద్దాం' అని టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ పిలుపునిచ్చారు.




**'దేశంలో,** ప్రపంచవ్యాప్తంగా ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉన్నది. టాటా ట్రస్ట్స్, టాటా గ్రూప్ సంస్థలు గతంలో ఎన్నోసార్లు ఆపత్కాలంలో అభాగ్యులకు అండగా నిలిచాయి. అయితే మునుపెన్నడూ లేనివిధంగా ఇప్పుడు సాయం చేయాల్సిన అవసరం ఉన్నది. ఈ విషమ సమయంలో కలిసికట్టుగా శ్రమించాలి. మానవ జాతి మనుగడకే సవాల్ విసురుతున్న ఈ మహమ్మారి అంతానికి చేతనైన కృషి చేద్దాం'

**- రతన్ టాటా, టాటా ట్రస్ట్స్ చైర్మన్**

**ఆటో రంగ** సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా కరోనా వైరస్ నిర్ధారణ కిట్లను దక్షిణ కొరియా నుంచి తెప్పిస్తున్నట్లు వెల్లడించింది. ఈ అత్యాధునిక టెస్టింగ్ కిట్లతో త్వరగా రోగ నిర్ధారణ జరుగుతుందని, 25వేల మందినిపైగా పరీక్షించవచ్చని ఓ ప్రకటనలో సంస్థ తెలిపింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వీటిని అందజేస్తామని స్పష్టం చేసింది. లాక్‌డౌన్ నేపథ్యంలో వాహనాల వారెంటీ, ఉచిత సేవలు తదితర సౌకర్యాల కోసం రెండు నెలల సమయాన్ని పొడిగిస్తున్నట్లు తెలిపింది.

**విద్యుదుత్పాదక** దిగ్గజం ఎన్టీపీసీ లిమిటెడ్ తమ దవాఖానలను కరోనా బాధితుల చికిత్స నిమిత్తం వాడుకోవచ్చని శనివారం ప్రకటించింది. ఇప్పటికే 45 ఆస్పత్రులు, హెల్త్ యూనిట్లను ఇందు కోసం ఎన్టీపీసీ కేటాయించింది. ఇప్పుడు మొత్తం దవాఖానలను వైరస్ నిర్మూలనకు అంకితం చేస్తున్నట్లు స్పష్టం చేసింది. తాజా వివరాల ప్రకారం ఈ దవాఖానల్లో ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేశారు. సకల సౌకర్యాలు కలిగిన 121 పడకలు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

**జలవిద్యుదుత్పత్తి** దిగ్గజం ఎన్‌హెచ్‌పీసీ.. కరోనాపై పోరుకు రూ.4.5 కోట్ల విరాళాన్ని ప్రకటించింది. ఈ కష్ట కాలంలో జాతికి అండగా నిలిచేందుకు తమ వంతు సాయంగా ఈ మొత్తాన్ని అందిస్తున్నట్లు సంస్థ సీఎండీ ఏకే సింగ్ తెలిపారు. ఉద్యోగుల వాటా రూ.1.36 కోట్లుగా ఉన్నట్లు చెప్పారు. ఈ లాక్‌డౌన్ సమయంలో తమ పవర్ స్టేషన్లు, ప్రాజెక్టుల సమీపంలోని స్థానిక ప్రజల అవసరాలను తీరుస్తామన్నారు.

**ప్రభుత్వరంగ** సంస్థలు, చిరు వ్యాపారుల సహాయార్థం గూగుల్ రూ.6వేల కోట్ల (800 మిలియన్ డాలర్లు)ను ప్రకటించింది. ప్రకటన రుణాలు (యాడ్ లోన్స్), లోన్ల రూపంలో ఈ విరాళం మొత్తాన్ని అందిస్తామని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థసహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న 100కుపైగా ప్రభుత్వ సంస్థలకు 250 మిలియన్ డాలర్ల విలువైన ప్రకటన రుణాలను ఇస్తామన్నారు.

**నిరుపేదల** అవసరాల నిమిత్తం ఐటీసీ రూ.150 కోట్లతో ఓ అత్యవసర నిధిని ఏర్పాటు చేసింది. మునుపెన్నడూ లేని ఓ విపత్తు యావత్ ప్రపంచాన్ని వణికిస్తున్నదని ఈ సందర్భంగా ఐటీసీ ఒకింత ఆవేదన వ్యక్తం చేసింది. దేశంలో ఆర్థికంగా ఎంతోమంది వెనుబడినవారున్నారని, వారి కోసం రూ.150 కోట్లను ఖర్చు చేయనున్నట్లు తెలిపింది. ఔషధాలు, పప్పుధాన్యాలు, ఇతర నిత్యావసరాలు, వ్యవసాయోత్పత్తులను అందిస్తామన్నది.

**దేశీయ** ఔషధ రంగ దిగ్గజం సన్ ఫార్మా రూ.25 కోట్ల విలువైన ఔషధాలు, శానిటైజర్లను విరాళమిస్తున్నట్లు ప్రకటించింది. కరోనా వైరస్ నిరోధానికి చర్యల్లో భాగంగా హైడ్రాక్సిక్లోరోక్విన్, అజిత్రైమైసిన్ తదితర ఔషధాలు, హ్యాండ్ శానిటైజర్లు పంపిణీ చేస్తామని ఓ ప్రకటనలో పేర్కొన్నది. హైడ్రాక్సిక్లోరోక్విన్‌ను కరోనా నుంచి రక్షణ కోసం వాడాలని నేషనల్ టాస్క్‌ఫోర్స్ సిఫార్సు చేస్తున్న విషయం తెలిసిందే.

**అగ్వా** హెల్త్‌కేర్‌తో కలిసి వెంటిలేటర్లను పెద్ద ఎత్తున తయారు చేస్తున్నట్లు దేశీయ ఆటో రంగ దిగ్గజం మారుతీ సుజుకీ ప్రకటించింది. కరోనా వైరస్ సోకడం వల్ల శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తుతుండగా, వెంటిలేటర్ల కొరత రాకుండా తమ వంతు సాయం చేస్తున్నట్లు సంస్థ పేర్కొన్నది. వెంటిలెటర్ల తయారీ కోసం మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ కూడా కృషి చేస్తున్న విషయం తెలిసిందే.

**ఆపరేషన్ కరోనా**

## ఆటో డీలర్లకు ఊరట

**బీఎస్-4 వాహన అమ్మకాల గడువు 10 రోజులు పొడిగింపు**

**ఢిల్లీ-ఎన్సీఆర్‌లో మినహా ఇతర ప్రాంతాలన్నింటికీ వర్తింపు**



**న్యూఢిల్లీ, మార్చి 28:** బీఎస్-4 వాహన అమ్మకాల విషయంలో ఆటోమొబైల్ డీలర్లకు సుప్రీం కోర్టు ఊరట కల్పించింది. లాక్‌డౌన్‌ను ఎత్తేసిన తర్వాత దేశ రాజధాని ప్రాం తం (ఎన్సీఆర్)-ఢిల్లీలో మినహా మిగిలిన ప్రాంతాల్లో బీఎస్-4 వాహనాలను అమ్ముకొనేందుకు గడువును 10 రోజులు పొడిగించింది. గతంలో కోర్టు ఈ వాహన అమ్మకాలకు ఈ నెల 31వ తేదీని గడువుగా నిర్దేశించింది. అయితే ప్రస్తుతం ఓవైపు కరోనా ముప్పు, మరోవైపు ఆర్థికమాంద్యం కొనసాగుతున్న నేపథ్యంలో బీఎస్-4 వాహన అమ్మకాల గడువును పొడిగించాలని కోరుతూ ఆటోమొబైల్ డీలర్ల సమాఖ్య (ఎఫ్ఏడీఏ) కోరింది. దీనిపై జస్టిస్ అరుణ్‌మిశ్రా, జస్టిస్ దీపక్‌గుప్తాతో కూడిన ధర్మాసనం శుక్రవారం వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా విచారణ జరిపి లాక్‌డౌన్ ముగిశాక 10 రోజులపాటు బీఎస్-4 వాహనాలను అమ్ముకొనేందుకు అనుమతి ఇచ్చింది. అయితే ప్రస్తుతం డీలర్ల వద్ద మిగిలి ఉన్న బీఎస్-4 వాహనాల్లో కేవలం 10 శాతం వాహనాలనే అమ్ముకోవాలని, ఢిల్లీ-ఎన్సీఆర్‌లో మాత్రం ఏప్రిల్ 1 నుంచి బీఎస్-4 వాహన అమ్మకాలను అనుమతించే ప్రసక్తేలేదని స్పష్టం చేసింది.

**వలస కూలీలకు ఆహారాన్ని అందించకపోతే**

## కూటి కోసం కొట్లాటలే

**కేంద్ర ప్రభుత్వ మాజీ ప్రధాన గణాంకవేత్త ప్రణబ్‌సేన్ హెచ్చరిక**




**న్యూఢిల్లీ, మార్చి 28:** కరోనా వైరస్ వ్యాప్తిని ప్రతిఘటించేందుకు దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటించిన ప్రస్తుత తరుణంలో వలస కూలీల ఆహార అవసరాలను తీర్చకపోతే కూటి కోసం కొట్లాటలు జరుగడం తథ్యమని కేంద్ర ప్రభుత్వ మాజీ ప్రధాన గణాంకవేత్త ప్రణబ్‌సేన్ హెచ్చరించారు. ప్రపంచవ్యాప్తంగా వేలమంది ప్రాణాలను కబళిస్తున్న కరోనా మహమ్మారి గ్రామీణ ప్రాంతాల్లోకి విస్తరిస్తే దాన్ని నిరోధించడం అసాధ్యమవుతుందని ఆయన ఓ ఇంటర్వ్యూలో ఆందోళన వ్యక్తంచేశారు. దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటించడంతో ఉత్తరప్రదేశ్, బీహార్ తదితర రాష్ట్రాలకు చెందిన వేలమంది వలస కూలీలు ఢిల్లీ, ముంబై లాంటి పలు నగరాల నుంచి తమ స్వస్థలాలకు తిరిగి వెళ్తున్నారు. కరోనా వ్యాప్తిని నిరోధించేందుకు 'వలస కూలీలకు ఆహారం అందుబాటులో లేకపోతే ఇలాంటి సమస్యలే ఉత్పన్నమవుతాయి. దేశంలో ఇంతకుముందు కూడా మనం ఇలాంటి సమస్యలను చూశాం. కరువుకాటకాలు ఏర్పడినప్పుడు కూటి కోసం కొట్లాటలు జరిగిన ఉదంతాలెన్నో ఉన్నాయి. ప్రస్తుత సంక్షోభ సమయంలో వలస కూలీలకు ఆహారం అందుబాటులో లేకపోతే కూటి కోసం కొట్లాటలు పునరావృతమవుతాయి. కనుక మనం అత్యవసరంగా ఈ సమస్యను పరిష్కరించాల్సిన అవసరమున్నది' అని ప్రణబ్‌సేన్ ఉద్ఘాటించారు.

## 'బ్యాంకులు తెరిచే ఉంటాయ్'

**న్యూఢిల్లీ, మార్చి 28:** దేశంలోని అన్ని బ్యాంక్ శాఖలు తెరిచే ఉంటాయని, కస్టమర్ల సేవలకు ఎటువంటి అంతరాయం కలుగదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో బ్యాంకర్లు అందిస్తున్న సహకారాన్ని ఆమె కొనియాడారు. కరోనా వైరస్ నిర్మూలనలో భాగంగా దేశం యావత్తూ లాక్‌డౌన్ అయినప్పటికీ బ్యాంక్ ఉద్యోగులు శ్రమిస్తున్నారని, ఖాతాదారుల్లో అనవసరపు భయాలు చెలరేగకుండా కృషి చేస్తున్నారన్నారు. ఎప్పటికప్పుడు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల అధిపతులతో చర్చలు జరుపుతూనే ఉన్నామని శనివారం మంత్రి ట్విట్టర్ ద్వారా తెలియజేశారు. రాష్ట్రాలతోనూ సంప్రదింపులు చేపడుతున్నామని, నగదు సరఫరా, బ్యాంకింగ్ సిబ్బంది, వ్యాపారులు లేదా బ్యాంక్ మిత్రాల రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని సూచిస్తున్నట్లు వివరించారు. ఏటీఎంలలోనూ నగదు నిల్వలు సరిపడా ఉంచాలని బ్యాంకర్లను కోరినట్లు చెప్పారు. శుక్రవారం దేశవ్యాప్తంగా లక్షా 5,988 బ్యాంక్ శాఖలు తెరిచే ఉన్నట్లు భారతీయ బ్యాంకర్ల సంఘం చెప్తున్నది.

## ఇన్ఫోసిస్ ఉద్యోగిపై వేటు

**కరోనాపై బాధ్యతారహిత ట్వీట్‌కు మూల్యం**


ముజీబ్ మహ్మద్

**న్యూఢిల్లీ, మార్చి 28:** ప్రపంచాన్ని కలవరపెడుతున్న కరోనా వైరస్ వ్యాప్తిపై బాధ్యతారహితంగా సోషల్ మీడియాలో అనుచితమైన పోస్టుచేసినందుకు ముజీబ్ మహ్మద్ అనే ఇన్ఫోసిస్ ఉద్యోగిపై వేటుపడింది. ఆ ఉద్యోగిని తమ సంస్థ నుంచి తొలిగించినట్టు ఇన్ఫోసిస్ వెల్లడించింది. 'మనమంతా కలిసికట్టుగా బయటకెళ్లి బహిరంగ ప్రదేశాల్లో తుమ్ముదాం. తద్వారా వైరస్‌ను వ్యాప్తిచేద్దాం' అంటూ గురువారం ఆ ఉద్యోగి ట్వీట్ చేశాడు. దీనిపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేయడంతో సదరు పోస్టుపై ఇన్ఫోసిస్ దర్యాప్తు జరిపింది. కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఈ ట్వీట్ పొరపాటున చేసినదికాదని దర్యాప్తులో తేలడంతో ముజీబ్ మహ్మద్‌కు ఉద్వాసన పలికామని ఇన్ఫోసిస్ వివరించింది.

**ఎస్బీఐ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై**

## వడ్డీ కోతలు

**న్యూఢిల్లీ, మార్చి 28:** ఎస్బీఐ తమ ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)పై వడ్డీరేట్లను మరోసారి తగ్గించింది. రిటైల్ సెగ్మెంట్‌లోని అన్ని కాలపరిమితులతో కూడిన ఎఫ్‌డీపై వడ్డీరేట్లను 20 నుంచి 50 బేసిస్ పాయింట్ల మేరకు, బల్క్ సెగ్మెంట్‌లోని ఎఫ్‌డీలపై వడ్డీరేట్లను 50 నుంచి 100 బేసిస్ పాయింట్ల మేరకు తగ్గిస్తున్నట్టు ఎస్బీఐ ప్రకటించింది. ఈ వడ్డీరేట్లు శనివారం (మార్చి 28) నుంచే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. తాజా కుదింపుతో 7 నుంచి 45 రోజుల కాలపరిమితి కలిగిన ఫిక్స్‌డ్ డిపాజిట్లకు 3.5 శాతం, 46 నుంచి 179 రోజుల వ్యవధి కలిగిన టర్మ్ డిపాజిట్లకు 4.5 శాతం వడ్డీ, 180 రోజుల నుంచి ఏడాదిలోపు కాలపరిమితి కలిగిన ఎఫ్‌డీలకు 5 శాతం, ఏడాది నుంచి పదేండ్లలోపు వ్యవధిలో పరిణితి చెందే డిపాజిట్లకు 5.7 శాతం చొప్పున వడ్డీ లభిస్తుంది. అయితే ఎఫ్‌డీలపై సీనియర్ సిటిజన్లకు మాత్రం అదనంగా 50 బేసిస్ పాయింట్ల వడ్డీ చెల్లించనున్నట్టు ఎస్బీఐ తెలిపింది.


## ఆట

### ధోనీ ఆశలు ఆవిరే: హర్ష భోగ్లే



**న్యూఢిల్లీ:** భారత జట్టుకు ధోనీ ఆడే అవకాశాలపై మాజీ క్రికెటర్లకు తోడు వ్యాఖ్యాతల విశ్లేషణ కొనసాగుతూనే ఉన్నది. కరోనా వైరస్ కారణంగా ఐపీఎల్ 13వ సీజన్ జరుగడం పై సందిగ్ధత ఏర్పడిన నేపథ్యంలో ధోనీ ఇక జాతీయ జట్టుకు ఆడేది ఇక అనుమానమేనని ప్రముఖ వ్యాఖ్యాత హర్షభోగ్లే అన్నాడు. 'టీమ్‌ఇండియాలోకి తిరిగి వచ్చేందుకు ధోనీకి దారులు మూసుకుపోయినట్లే. సెప్టెంబర్-అక్టోబర్‌లో జరిగే టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టుకు మహీ ఎంపికయ్యే అవకాశాలు తక్కువని నా గట్టి నమ్మకం' అని భోగ్లే అన్నాడు. గతేడాది ఇంగ్లండ్‌లో జరిగిన వన్డే ప్రపంచకప్ తర్వాత నుంచి ఈ సీనియర్ క్రికెటర్ జాతీయ జట్టుకు దూరమైన సంగతి తెలిసిందే.

### కోహ్లీనే బాస్: రవిశాస్త్రి



**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ జట్టుకు కెప్టెన్ కోహ్లీ బాస్ అని చీఫ్ కోచ్ రవిశాస్త్రి అన్నాడు. ఓ ప్రముఖ టెలివిజన్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నాసిర్ హుస్సేన్, మైఖేల్ అథర్టన్, రాబ్‌కీతో కలిసి శాస్త్రి పాల్గొన్నాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'నా దృష్టిలో జట్టుకు కెప్టెన్ బాస్ అనేది నమ్ముతా. జట్టును ముందుండి నడిపించేది అతనే. మైదానంలో ప్రత్యర్థులను ఎదుర్కొనే విషయంలో భయం లేకుండా, సానుకూల దృక్పథంతో ఆడేందుకు ప్లేయర్లను సిద్ధం చేయడం సహాయక సిబ్బంది పని. ఆటగాళ్లపై ఒత్తిడి తగ్గించేందుకు మేమున్నా..అంతిమంగా జట్టుపై పూర్తి నియంత్రణ ఉండేది నాయకునికి మాత్రమే' అని శాస్త్రి అన్నాడు. ఫిట్‌నెస్ విషయంలో క్రికెటర్లకు కోహ్లీ స్ఫూర్తి అని రవి అభిప్రాయపడ్డాడు. వందశాతం ఫిట్‌నెస్ కోసం విరాట్ ఎంతో కష్టపడుతాంటూ కితాబిచ్చాడు.

**కరోనా తీవ్రతను ముందే అంచనా వేశాం:** కరోనా వైరస్ ప్రభావం తీవ్రంగా ఉంటుందని న్యూజిలాండ్ పర్యటనలో ఉన్నప్పుడే భారత ఆటగాళ్లు అంచనా వేశారని రవిశాస్త్రి చెప్పాడు. మార్చిలో క్రీడలు ఆగిపోతాయని కూడా అనుకున్నామని చెప్పాడు.

# కదిలొస్తున్న క్రీడాలోకం

**భారీ విరాళాలు ప్రకటిస్తున్న స్పోర్ట్స్‌స్టార్స్**

**ప్రపంచాన్ని ఓ కుదుపు కుదుపుతున్న మహమ్మారి కరోనా వైరస్‌పై పోరాడేందుకు క్రీడాలోకం కదిలివస్తున్నది. కంటికి కనిపించని దానిపై పోరాటానికి అందరూ ముందుకు వస్తున్నారు. కొవిడ్-19ను సమర్థంగా ఎదుర్కొనేందుకు కావాల్సిన వాటిని సమకూర్చేందుకు భారీ విరాళాలు ఇస్తున్నారు. ఇందులో కొందరు డబ్బుల రూపంలో తమ దేశ ప్రభుత్వాలకు అండగా నిలుస్తుంటే..మరికొందరు వైద్యపరికరాల కోసం, అన్నార్థులకు అండగా ఉండేందుకు కదంకదం కలుపుతున్నారు. వైరస్ మహమ్మారిని పారద్రోలేందుకు హద్దులు లేవంటూ తమ సహృదయతను చాటుకుంటున్నారు.**




లండన్: కరోనా వైరస్‌తో క్రీడా ప్రపంచం ఒక్కసారిగా కుదేలైంది. ఈ మహమ్మారి ధాటికి దేశాలన్ని గజగజ వణుకుతున్నాయి. ఓవైపు కరోనా కరాళనృత్యం చేస్తున్నా..ఆదుకునేందుకు తాము ఉన్నామంటూ భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌తో పాటు బీసీసీఐ చీఫ్ గంగూలీ, సాకర్ స్టార్స్ రొనాల్డో, మెస్సీ, సెర్బియా టెన్నిస్ యోధుడు జొకోవిచ్ తదితరులు భారీ విరాళాలతో మిగతా క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

**మనసున్న మెస్సీ, రొనాల్డో:**

కరోనా వైరస్‌తో అతలాకుతలమవుతున్న ప్రజలను ఆదుకునేందుకు మెస్సీ, రొనాల్డో పెద్ద మనసుతో ముందుకొచ్చారు. వైరస్ నానాటికి శరవేగంగా వ్యాప్తిస్తున్న క్రమంలో తమవంతుగా ప్రభుత్వాలకు మద్దతుగా నిలిచేందుకు ఈ ఇద్దరు సాకర్ స్టార్స్ సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా బార్సిలోనాతో పాటు అర్జెంటీనాలోని దవాఖానల్లో వైద్య సదుపాయాల కోసం మెస్సీ.. 1 మిలియన్ యూరోస్(రూ.8.36 కోట్లు) విరాళమిచ్చాడు. మరోవైపు తన ఏజెంట్ జార్జ్ మెండస్‌తో కలిసి లిస్బన్, పోర్టోలో ఇంటెన్సివ్ కేర్ యూనిట్ల(ఐసీయూ) కోసం రొనాల్డో కూడా రూ.8.36 కోట్లు ఇస్తున్నట్లు ప్రకటించాడు. టెన్నిస్ స్టార్స్ జొకోవిచ్, రోజర్ ఫెదరర్ ఒక్కో మిలియన్ యూరోల చొప్పున సహాయం చేస్తున్నట్లు మీడియాకు తెలిపారు.

**సచిన్, రైనా దాతృత్వం**

కష్టకాలంలో దేశ ప్రజలను ఆదుకోవడంలో తాము ఎవరికి తీసిపోమని సచిన్, రైనా నిరూపించారు. సురేశ్ రైనా శనివారం రూ.52 లక్షలు విరాళమిస్తున్నట్లు పేర్కొన్నాడు. ఇందులో ప్రధానమంత్రి రిలీఫ్ ఫండ్‌కు రూ.31 లక్షలు, యూపీ సీఎం సహాయక నిధికి రూ.21 లక్షలు ఇస్తున్నట్లు తెలిపాడు. మరోవైపు క్రికెట్ దిగ్గజం సచిన్ సైతం రూ.50 లక్షలు ఇచ్చాడు. వీరికి తోడు పుణెకు చెందిన ఎన్జీవోతో కలిసి సీనియర్ క్రికెటర్ ధోనీ రూ.లక్ష సహాయం చేయగా, ధవన్..కూడా ప్రధాన మంత్రి సహాయ నిధికి విరాళమిచ్చాడు. ఇక కరోనా వైరస్‌ను ఎదుర్కొనేందుకు పఠాన్ బ్రదర్స్ 4వేల మాస్క్‌లను బరోడా పోలీసులు, ఆరోగ్య శాఖకు ఇచ్చారు. వీరితో పాటు స్టార్ షట్లర్ పీవీ సింధు రూ.10 లక్షలు, యువ రెజ్లర్ బజ్‌రంగ్ పూనియా తన ఆరు నెలల జీతం, స్ప్రింటర్ హిమాదాస్ ఒక నెల జీతం విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు.

### బీసీసీఐ 51 కోట్ల విరాళం

ప్రపంచంలోనే అత్యంత ధనిక బోర్డుగా వెలుగొందుతున్న భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)..కరోనా వైరస్‌పై పోరుకు భారీ విరాళం ప్రకటించింది. ప్రధానమంత్రి రిలీఫ్ ఫండ్‌కు రూ.51 కోట్లు విరాళమిస్తున్నట్లు బీసీసీఐ శనివారం పేర్కొంది.

**కరోనా ఖేల్**

### పోరాటానికి ముందుకురండి


అఖిల్ కుమార్

**న్యూఢిల్లీ:** మహమ్మారి కరోనాపై పోరాడేందుకు క్రీడాలోకం ముందుకు రావాలని భారత మాజీ బాక్సర్ అఖిల్ కుమార్ పిలుపునిచ్చాడు. ప్రస్తుతం హర్యానాలో పోలీసు బాధ్యతలు నిర్వర్తిస్తున్న అఖిల్..కరోనాతో కుదేలైన రోజు కూలీలు, పేదలను ఆదుకునేందుకు అందరూ ముందుకురావాలని అన్నాడు. 'మీడియా ద్వారా సెలెబ్రిటీలకు ముఖ్యంగా క్రీడాకారులకు నేను చెప్పదల్చుకున్నది ఒక్కటే. వైరస్‌ను ఎదుర్కొనేందుకు చేతులు కడుక్కోవడం లాంటి వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేసే వరకే కాదు. వైరస్ బారిన పడకుండా మాస్క్‌లతో ఇండ్ల నుంచి బయటకు వచ్చి..క్షేత్రస్థాయిలో అందరికి అవగాహన కల్పించాల్సిన అవసరముంది'అని అఖిల్ అన్నాడు.

### యుద్ధం చేద్దాం.. బ్రావో పాట




**అంటిగ్వా:** కరోనా వైరస్‌పై అవగాహన కల్పించేందుకు వెస్టిండీస్ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రావో తనదైన శైలిలో ముందుకొచ్చాడు. వైరస్ రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలతో తానే స్వయంగా పాట పాడి డ్యాన్స్ చేసిన వీడియోను తాజాగా విడుదల చేశాడు. అందరూ ఇండ్లలోనే ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటూ ఇందులో సూచించాడు. 'వీ ఆర్ నాట్ గివింగ్ అప్' పేరిట తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ పాటను శనివారం పోస్ట్ చేశాడు. భారతీయ సంప్రదాయ పద్ధతైన నమస్కారంతో బ్రావో పాటను ప్రారంభించడం విశేషం.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

నమస్తే తెలంగాణ
నిపుణ
[ హైదరాబాద్ ]
ఆదివారం 29 మార్చి 2020

టెక్ యుగంలో ప్రతిరంగంలోనూ మానవ శ్రమకు ప్రత్యామ్నాయం అందుబాటులోకి వస్తున్నది. యంత్రంకూడా ఆలోచించి పనిచేయడం మొదలుపెట్టింది. ఈ అద్భుతాన్ని సాధ్యం చేసింది రోబోటిక్ ఇంజినీరింగ్. ఇప్పుడు సామాన్య పనుల నుంచి యుద్ధరంగాల్లో సైనికులుగా పోరాడటం దాకా మనుషుల స్థానంలో రోబోలు రంగప్రవేశం చేస్తున్నాయి. భవిష్యత్తు-మొత్తం రోబోలదేనని నిపుణుల మాట. మరి ఇంతటి ప్రాధాన్యం ఉన్న రోబోల వెనుక గల టెక్నాలజీ ఏంటి? ఆ టెక్నాలజీని కెరీర్‌గా ఎంచుకోవాలంటే ఏం చదవాలి? అన్న అంశాలు నిపుణ పాఠకుల కోసం..



# యంత్రుడిదే భవిష్యత్తు

## రోబోటిక్ ఇంజినీరింగ్

భయంకరమైన కరోనా అంటువ్యాధి సోకి ఓ వ్యక్తి రోడ్డుపైనే పడిపోయాడు. అతనివద్దకు వెళ్లేందుకు సామాన్యులతోపాటు డాక్టర్లు, నర్సులు కూడా భయపడుతున్నారు. సరిగ్గా అప్పుడే రయ్‌మంటూ రెండు యంత్రాలు ఆ రోగిదగ్గరికి వెళ్లి అతన్ని స్ట్రెచర్‌పై పడుకోబెట్టి అంబులెన్స్‌లోకి ఎక్కించాయి. మనుషులకంటే పర్‌ఫెక్ట్‌గా రోగికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా హాస్పిటల్‌కు తీసుకెళ్లి బెడ్‌పై పడుకోబెట్టి ట్రీట్‌మెంట్ కూడా మొదలుపెట్టాయి.

ఓ బహుళ అంతస్తుల భవనంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిమాపక సిబ్బందికి మంటలను ఆర్పడం సాధ్యంకావటంలేదు. వెంటనే మనుషులు ఆదేశాలిచ్చారు. అంతే.. రయ్‌మంటూ భవనాన్ని చుట్టుముట్టి బలంగా నీళ్లు చిమ్మటం మొదలుపెట్టాయి. కొద్దిసేపట్లోనే మంటలను ఆర్పేశాయి. జనం చప్పట్లతో అభినందించారు. అవేవీ పట్టించుకోకుండా వచ్చిన వేగంతోనే అవి వెళ్లిపోయాయి. మనిషి చేయలేని ఈ పనులు అత్యంత చాకచక్యంగా సులభంగా చేసింది రోబోలు.

### రోబోటిక్ ఇంజినీరింగ్ అంటే ఏమిటి?

- ఇది ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్‌ల కలబోత. ఈ రెండు ఇంజినీరింగ్ విభాగాలు కలిసి ఒక యంత్రాన్ని డిజైన్ చేసి నిర్మించి, నిర్వహిస్తే వచ్చేదే రోబో. మనుషులు చేయలేని లేదా కష్టతరమైన పనులు చేయడానికి మనిషి సృష్టించిన అద్భుతమే రోబో అని చెప్పొచ్చు.

### రోబోలు ఎన్నిరకాలు?

- రోబోలు ఎన్నిరకాలో చెప్పడం కష్టం. కానీ అవి చేసే పనిని, పని విధానాన్ని, వాటి నిర్మాణ విధానాన్ని బట్టి వాటిని పలురకాలుగా విభజించవచ్చు.
- ఏరోస్పేస్ రోబోస్
- కన్జ్యూమర్ రోబోస్
- డిజాస్టర్ రెస్పాన్స్ రోబోస్
- డ్రోన్స్
- ఎడ్యుకేషన్ రోబోస్
- ఎంటర్‌టైన్‌మెంట్ రోబోస్
- ఎక్సోకెలిటెన్ రోబోస్
- హ్యూమనాయిడ్ రోబోస్
- ఇండస్ట్రియల్ రోబోస్
- మెడికల్ రోబోస్
- మిలిటరీ, సెక్యూరిటీ రోబోస్
- రిసెర్చ్ రోబోస్
- సెల్ఫ్ డ్రైవింగ్ కార్స్
- టెలీ ప్రజెన్స్ రోబోస్
- అండర్ వాటర్ రోబోస్

### రోబోటిక్ ఇంజినీరింగ్ చదవడానికి ఎవరు అర్హులు

- ఇంటర్మీడియట్ లేదా 12వ తరగతిలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ ప్రధాన సబ్జెక్టులుగా పాసైన ఎవరైనా రోబోటిక్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ చదవడానికి అర్హులు
- ఈ కోర్సులో ఎంటెక్ చదవడానికి రోబోటిక్ ఇంజినీరింగ్‌లో బీటెక్ చదివి ఉండాలి. కొన్ని విద్యాసంస్థల్లో ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ కంట్రోల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులు కూడా రోబోటిక్స్‌లో ఎంటెక్ చేసేందుకు అవకాశం కల్పిస్తున్నాయి.
- కొన్ని సంస్థలు రోబోటిక్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా కోర్సులు కూడా ఆఫర్ చేస్తున్నాయి.

### ప్రవేశాలు

- బ్యాచిలర్ డిగ్రీలో అడ్మిషన్ల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్‌డ్, గేట్ పరీక్షలతోపాటు తెలంగాణ ఎంసెట్, ఏపీ ఎంసెట్ సహా ఇతర రాష్ర్టాలు ప్రవేశపరీక్షలు నిర్వహిస్తారు. జేఈఈ మెయిన్ 2020 మొదటి దశ ఇప్పటికే పూర్తయింది. మెయిన్ రెండోదశతోపాటు జేఈఈ అడ్వాన్స్‌డ్, రాష్ర్టాల సెట్ పరీక్షలు త్వరలో జరుగనున్నాయి.
- వీటితోపాటు కొన్ని ప్రైవేటు యూనివర్సిటీలు సొంతంగా ప్రవేశపరీక్షలు నిర్వహించి అందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నాయి.



> గమనిక: ఉన్నత విద్యలోకి ప్రవేశించబోతున్న విద్యార్థులు తమకు ఇష్టమైన కోర్సును మాత్రమే ఎంచుకోవాలి. స్నేహితులు, ఇంటిపక్కవాళ్లు చదువుతున్నారుకదా అని గుడ్డిగా మీరూ చేరకూడదు. ప్రతివ్యక్తికీ జీవితంలో ఏదో ఒక రంగంపై అమితాసక్తి ఉంటుంది. దాన్నే ప్యాషన్ అంటారు. ముందు మీ ప్యాషన్ ఏంటో తెలుసుకోండి. అందులోని లాభనష్టాలు, కష్టసుఖాలను తెలుసుకొని ఆ తర్వాతే ముందడుగు వేయండి. జీవితం మీది.. నిర్ణయం కూడా మీదే అయి ఉండాలి.

### టాప్ విద్యాసంస్థలు

- ఐఐటీ బాంబే
- ఐఐటీ ఖరగ్‌పూర్
- ఐఐటీ కాన్పూర్
- హిందుస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, చెన్నై
- భారత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్, తమిళనాడు
- తెలంగాణలో ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజ్, జేఎన్టీయూ హైదరాబాద్‌తోపాటు మరికొన్ని ప్రైవేటు ఇంజినీరింగ్ విద్యాసంస్థలు కూడా ఈ కోర్సును ఆఫర్ చేస్తున్నాయి.

### ఉపాధి అవకాశాలు

- పారిశ్రామిక రంగం నుంచి సేవల రంగం వరకు నేడు దాదాపు అన్ని రంగాల్లో రోబోలను ప్రవేశపెడుతున్నారు. దాంతో రోబోటిక్ ఇంజినీర్లకు ప్రపంచవ్యాప్తంగా గిరాకీ ఏర్పడింది. పలు ప్రభుత్వ సంస్థలేకాక అనేక ప్రైవేటు కంపెనీలు కూడా మంచి జీతంతో ఉద్యోగాలను ఆఫర్ చేస్తున్నాయి. రోబోటిక్ ఇంజినీరింగ్ చదివినవారు ఎక్కువగా కింది ఉద్యోగాల్లో చేరుతున్నారు.
- రోబోటిక్ ప్రోగ్రామర్,
- రోబోటిక్ టెక్నీషియన్
- రోబో డిజైన్ ఇంజినీర్
- రోబోటిక్ టెస్ట్ ఇంజినీర్
- సీనియర్ రోబోటిక్ స్పెషలిస్ట్
- ఆటోమేటెడ్ ప్రొడక్ట్ డిజైన్ ఇంజినీర్
- అగ్రికల్చరల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీర్
- రోబోటిక్ సిస్టం ఇంజినీర్
- రోబోటిక్ టెస్టర్స్
- మెయింటెనెన్స్ ఇంజినీర్

### ఉద్యోగాలు ఆఫర్ చేస్తున్న కొన్ని సంస్థలు

- భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)
- భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్)
- డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్డీవో)
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)
- ప్రెసిషన్ ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఇండియా లిమిటెడ్
- భారత్ అటామిక్ రిసెర్చ్ సెంటర్ (బార్క్)

### రోబోటిక్ ఇంజినీరింగ్ బ్రాంచీలు

- బ్యాచ్‌లర్ డిగ్రీ స్థాయిలో
- బీటెక్ ఇన్ రోబోటిక్ ఇంజినీరింగ్
- బీఈ ఇన్ రోబోటిక్స్
- మాస్టర్స్ డిగ్రీ స్థాయిలో
- ఎంటెక్ ఇన్ రోబోటిక్ ఇంజినీరింగ్
- ఎంటెక్ ఇన్ ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్
- ఎంఈ ఇన్ రోబోటిక్ ఇంజినీరింగ్
- ఎంటెక్ ఇన్ రిమోట్ సెన్సింగ్ అండ్ వైర్‌లెస్ సెన్సార్ నెట్‌వర్క్
- రోబోటిక్ ఇంజినీరింగ్‌లో స్పెషలైజేషన్లు
- మైక్రో రోబోటిక్స్
- ఆటోమేషన్
- బయో సైబర్నెటిక్స్
- డిజిటల్ ఎలక్ట్రానిక్స్ అండ్ మైక్రో ప్రాసెసర్స్
- మెడికల్ రోబోటిక్స్
- డిజైన్ అండ్ కంట్రోల్
- సిగ్నల్ ప్రాసెస్
- రోబోట్ మ్యానిపులేటర్స్
- కంప్యూటర్ ఇంటిగ్రేటెడ్ మాన్యుఫాక్చరింగ్ సిస్టం
- రోబోట్ మోషన్ ప్లానింగ్
- కంప్యూటేషనల్ జియోమెట్రీ
- కంప్యూటర్ ఎయిడెడ్ మాన్యుఫాక్చరింగ్
- ఎయిర్ ట్రాఫిక్ మాన్యుఫాక్చరింగ్
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్



... వేణు బెక్కం

# జీ 20 అత్యవసర సమావేశాలు

- ఈ ఏడాది జీ 20 సమావేశాలు సౌదీ అరేబియా కేంద్రంగా మార్చి 26న జరిగాయి. కొవిడ్ 19 వైరస్ ప్రమాదం కారణంగా ఈ సమావేశాలు ఈసారి వీడియో సమ్మిట్ రూపంలో నిర్వహించారు. ఈ సమావేశాలకు సౌదీ రాజు సల్మాన్ అల్ సౌద్ నాయకత్వం వహించారు. ఈ సమ్మిట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 20 సభ్యదేశాధినేతలు పాల్గొన్నారు. భారత ప్రధాని నరేంద్రమోదీ కూడా ఈ సమావేశాల్లో పాల్గొన్నారు. 15వ జీ 20 శిఖరాగ్ర సమావేశాలను ఈ ఏడాది నవంబర్ 21-22 తేదీల్లో సౌదీ రాజధాని రియాద్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశాలకు '21వ శతాబ్దంలో అందరికీ వాస్తవిక అవకాశాలు' అన్న నినాదాన్ని తీసుకున్నారు.

### సమ్మిట్ ముఖ్యాంశాలు

- కరోనా కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దారుణంగా దెబ్బతినటంతో తక్షణం ఆర్థిక వ్యవస్థలోకి 5 ట్రిలియన్ అమెరికన్ డాలర్లు చొప్పించాలని తీర్మానించారు. కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు చేస్తున్న పోరాటంలో లోపాలు లేకుండా చూడాలని ప్రపంచ ఆరోగ్య సంస్థను సమ్మిట్ కోరింది.
- ముఖ్యంగా మహిళలు, యువత సంతోషంగా జీవించేందుకు, వృద్ధి సాధించేందుకు, వారి ఉపాధికోసం మరిన్ని చర్యలు తీసుకోవటమే కీలక ఎజెండాగా ఉండాలని సమ్మిట్ తీర్మానించింది.
- భూగోళాన్ని సురక్షితమైనదిగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది.
- ప్రపంచాన్ని పీడిస్తున్న సమస్యలపై పోరాటంలో నూతన విధానాలను అన్వేషించాలని, ఉదార విధానాన్ని అవలంబించాలని నిర్ణయించింది.
- ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన 20 దేశాలతో ఒక గ్రూపును ఏర్పాటు చేయాలని జీ 7 ఆర్థిక మంత్రుల సదస్సు 1999 సెప్టెంబర్‌లో నిర్ణయించటంతో జీ 20 కూటమి ఏర్పడింది.



### జీ 20 సభ్యదేశాలు

- ఇండియా, అర్జెంటీనా, బ్రెజిల్, చైనా, జర్మనీ, ఇండోనేషియా, జపాన్, ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్స్, ఇటలీ, మెక్సికో, దక్షిణ కొరియా, రష్యా, టర్కీ, అమెరికా, దక్షిణాఫ్రికా, సౌదీ అరేబియా, బ్రిటన్, యూరోపియన్ యూనియన్
- ఈ ఏడాది సమ్మిట్‌కు ప్రత్యేక ఆహ్వానిత దేశాలు
- ఈజిప్టు, జోర్డాన్, సెనెగల్, స్పెయిన్, సింగపూర్, స్విట్జర్లాండ్, యూఏఈ, వియత్నాం

### ప్రత్యేక ఆహ్వానిత సంస్థలు

- ఐక్యరాజ్యసమితి
- ప్రపంచ బ్యాంకు గ్రూప్
- డబ్ల్యూహెచ్‌వో
- డబ్ల్యూటీవో
- ఎఫ్‌ఏవో, ఎఫ్‌ఎస్‌బీ, ఐఎల్‌వో, ఐఎంఎఫ్, ఓఈసీడీ

# 2020-21 కేంద్ర వార్షిక బడ్జెట్ ఎంత?

1. బడ్జెట్ అనే పదం ఏ భాష నుంచి తీసుకున్నారు?
   1) ఫ్రెంచి 2) స్పానిష్ 3) ఇంగ్లిష్ 4) అరబిక్
2. ఆర్థికమంత్రి ఏ ప్రకరణ ప్రకారం లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతారు?
   1) 101 2) 112 3) 121 4) 211
3. లోక్‌సభలో బడ్జెట్ సాయంత్రం 5:30కు ప్రవేశపెట్టే సంప్రదాయాన్ని ఉదయం 11 గంటలకు మార్చారు. ఇది ఎప్పటినుంచి ప్రారంభించారు?
   1) 2000 2) 2001 3) 2005 4) 2014
4. లోక్‌సభలో ప్రవేశపెట్టే బిల్లు ద్రవ్యబిల్లా కాదా అని నిర్ణయించేది ఎవరు?
   1) రాష్ట్రపతి 2) ఉపరాష్ట్రపతి 3) ప్రధాని 4) లోక్‌సభ స్పీకర్
5. 2020-21 వార్షిక బడ్జెట్ ఎంత?
   1) రూ.32,42,230 కోట్లు
   2) రూ.36,12,230 కోట్లు
   3) రూ.30,42,230 కోట్లు
   4) రూ.30,24,684 కోట్లు
6. కేంద్ర బడ్జెట్‌లో అత్యధికంగా దేని కోసం ఖర్చు చేస్తుంది?
   1) వ్యవసాయ రంగం 2) రక్షణ రంగం 3) వడ్డీ చెల్లింపులు 4) గ్రామీణాభివృద్ధి
7. 2020-21 వార్షిక బడ్జెట్‌లో పేర్కొన్న 16 పాయింట్ల ఫార్ములా దేనికి సంబంధించినది?
   1) ఆదాయ పన్ను 2) వ్యవసాయం 3) విద్యారంగం 4) రక్షణ రంగం
8. స్వాతంత్ర్యానంతరం తొలిసారిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టినది ఎవరు?
   1) గుల్జారీలాల్ నందా 2) జాన్ మథాయ్ 3) జవహర్‌లాల్ నెహ్రూ 4) షణ్ముఖం శెట్టి
9. భారత్ గణతంత్ర దేశంగా అవతరించిన తర్వాత తొలిసారిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టినదెవరు?
   1) గుల్జారీలాల్ నందా 2) జాన్ మథాయ్ 3) షణ్ముఖం శెట్టి 4) జవహర్‌లాల్ నెహ్రూ
10. ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎన్నోది?
    1) 90 2) 88 3) 90 4) 91
11. ఇప్పటివరకు లోక్‌సభలో ఎంతమంది ఆర్థికమంత్రులు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు?
    1) 25 2) 28 3) 31 4) 38
12. ఇప్పటివరకు లోక్‌సభలో అత్యధికంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థికమంత్రి?
    1) ప్రణబ్‌ముఖర్జీ 2) చిదంబరం 3) మొరార్జీ దేశాయ్ 4) మన్మోహన్ సింగ్
13. కింది వాటిని జతపర్చండి.
    1. యశ్వంత్‌రావ్ చవాన్ ఎ. బ్లాక్ బడ్జెట్
    2. మన్మోహన్‌సింగ్ బి. నవశకానికి నాంది
    3. చిదంబరం సి. డ్రీమ్ బడ్జెట్
    4. యశ్వంత్ సిన్హా డి. మిలీనియం బడ్జెట్
    1) 1-డి, 2-బి, 3-సి, 4-ఎ
    2) 1-బి, 2-సి, 3-డి, 4-ఎ
    3) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
    4) 1-బి, 2-సి, 3-ఎ, 4-డి
14. కేంద్ర పన్నుల్లో రాష్ర్టాలకు వచ్చే వాటా ఎంత?
    1) 41 శాతం 2) 43 శాతం 3) 42 శాతం 4) 44 శాతం
15. రక్షణ రంగానికి బడ్జెట్‌లో ఎంత కేటాయించారు?
    1) రూ.3.23 లక్షల కోట్లు
    2) రూ.3.43 లక్షల కోట్లు
    3) రూ.3.33 లక్షల కోట్లు
    4) రూ.3.53 లక్షల కోట్లు
16. కింది వాటిలో సరైనవి.
    ఎ. రైతుల సంక్షేమం కోసం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ప్రారంభం
    బి. 2018, డిసెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిన ఈ పథకాన్ని ఫిబ్రవరి 24 గోరఖ్‌పూర్‌లో ప్రధాని మోదీ ప్రారంభించారు
    సి. ఈ పథకం ద్వారా 12 కోట్ల మంది సన్నకారు, మధ్యతరహా రైతులకు ప్రయోజనం
    డి. రెండు హెక్టార్ల భూమిగల రైతులకు రూ.6 వేలు మూడు విడుతల్లో అందజేయడం
    1) ఎ, బి 2) ఎ, బి, సి 3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
17. 2019-20 ఆర్థిక సర్వే ప్రకారం 2020-21లో జాతీయ వృద్ధిరేటు ఎంత?
    1) 5.5 - 6 శాతం 2) 6 - 6.5 శాతం 3) 6 -7 శాతం 4) 7 - 8 శాతం
18. కింది వాటిని జతపర్చండి.
    1. ఒక ఉత్పత్తి ఒక జిల్లా ఎ. ఉద్యాన పంటలకు చేయూత
    2. కృషి ఉడాన్ బి. విమానాల ద్వారా రైతుల ఉత్పత్తుల విక్రయం
    3. తేజస్ ఎక్స్‌ప్రెస్ సి. పర్యాటక ప్రాంతాలను పర్యటించేందుకు
    4. కుసుమ్ డి. రైతులు డీజిల్ పంపులపై ఆధారపడటం తగ్గించి సోలార్‌పంపులపై ఆధారపడేలా పెంచడం
    1) 1-డి, 2-బి, 3-సి, 4-ఎ
    2) 1-బి, 2-సి, 3-డి, 4-ఎ
    3) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
    4) 1-బి, 2-సి, 3-ఎ, 4-డి
19. ఏ రాష్ట్రంలో అత్యధిక నిరుద్యోగ శాతం ఉన్నది?
    1) ఉత్తరప్రదేశ్ 2) రాజస్థాన్ 3) త్రిపుర 4) బీహార్
20. 2019 ఆర్థిక సర్వేను రూపొందించిందెవరు?
    1) రాజీవ్ గోయల్
    2) అరవింద్ సుబ్రమణియన్
    3) కృష్ణమూర్తి సుబ్రమణియన్
    4) నిర్మలా సీతారామన్
21. ఆర్థిక సంఘం సిఫారసులను అనుసరించి పన్నుల్లో తెలంగాణ వాటా?
    1) 2.13 శాతం 2) 2.54 శాతం 3) 2.02 శాతం 4) 2.52 శాతం
22. బడ్జెట్‌కు ముందు సమర్పించే 2019-20 ఆర్థిక సర్వే పుస్తకం కవర్ ఏ రంగులో ఉంది?
    1) ఎరుపు 2) ఊదా 3) కాషాయం 4) ఆకుపచ్చ
23. 2019-20 ఆర్థిక సర్వే ఇతివృత్తం?
    1) నిరుద్యోగం నిర్మూలన
    2) పేదరికం నిర్మూలన
    3) సంపద సృష్టి 4) భూ పంపిణీ
24. ఆర్థిక సర్వే 2019 ప్రకారం దేశ జనాభాలో ఎన్ని కోట్ల మంది అత్యంత నిరుపేదలుగా ఉన్నారు?
    1) 12.4 2) 13.6 3) 13.6 4) 13.6
25. కేంద్ర పన్నుల ద్వారా తెలంగాణకు ఎంత ఆదాయం సమకూరుతుంది?
    1) రూ.17,422 కోట్లు
    2) రూ.17,960 కోట్లు
    3) రూ.16,726 కోట్లు
    4) రూ.18,583 కోట్లు
26. బ్యాంకుల విలీనానంతరం దేశంలో ఎస్‌బీఐ తర్వాత అతిపెద్ద బ్యాంకు ఏది?
    1) ఇండియన్ బ్యాంక్
    2) పంజాబ్ నేషనల్ బ్యాంక్
    3) బ్యాంక్ ఆఫ్ బరోడా
    4) ఇండియన్ బ్యాంక్
27. 2020-21 వార్షిక బ్జెట్‌లో దక్షిణ మధ్య రైల్వేకు ఎంత కేటాయించారు?
    1) రూ.17,422 కోట్లు
    2) రూ.6,846 కోట్లు
    3) రూ.6,846 కోట్లు
    4) రూ.7856.59 కోట్లు
28. దేశంలో అత్యధికంగా తలసరి విద్యుత్ వినియోగం ఉన్న రాష్ట్రం?
    1) మహారాష్ట్ర 2) గుజరాత్ 3) జార్ఖండ్ 4) తెలంగాణ
29. అతి తక్కువ కాలం ఆర్థిక మంత్రిగా పనిచేసినదెవరు?
    1) నారాయణ్ దత్ తివారీ
    2) వీపీ సింగ్
    3) హెచ్ఎన్ బహుగుణ
    4) జశ్వంత్ సింగ్
30. కేంద్ర పన్నుల్లో రాష్ర్టాల వాటా ఎంత ఉండాలని కేంద్రం నిర్ణయించింది?
    1) 36 శాతం 2) 39 శాతం 3) 42 శాతం 4) 44 శాతం
31. బడ్జెట్‌లో అత్యధికంగా ఆదాయాన్ని ఏ విభాగం నుంచి సమకూర్చుకుంటుంది?
    1) కార్పొరేట్ పన్ను 2) జీఎస్టీ
    3) ఆదాయ పన్ను
    4) కేంద్ర ఎక్సైజ్ సుంకాలు
32. నీటి వృథాను అరికట్టి అత్యధిక విస్తీర్ణాన్ని సాగులోకి తీసుకురావడానికి ఉద్దేశించిన పథకం?
    1) ప్రధాన మంత్రి సురక్ష యోజన
    2) ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన
    3) ప్రధాన మంత్రి గ్రామ సించ్ యోజన
    4) ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన
33. కింది వాటిలో సరైనవి.
    1. ఉపాధి హామీ పథకం ఎ. రూ.61,500 కోట్లు
    2. ఆయుష్మాన్ భారత్ బి. రూ.6,400 కోట్లు
    3. స్వచ్ఛ భారత్ మిషన్ సి. రూ.12,300 కోట్లు
    4. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం డి. రూ.11,000 కోట్లు
    1) 1-డి, 2-బి, 3-సి, 4-ఎ
    2) 1-బి, 2-సి, 3-డి, 4-ఎ
    3) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
    4) 1-బి, 2-సి, 3-ఎ, 4-డి
34. నూతన ఆదాయ పన్నులో ఎన్ని శ్లాబులు ఉన్నాయి?
    1) 6 2) 7 3) 9 4) 8
35. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా ఎంత సమీకరించాలని నిర్ణయించారు?
    1) రూ.2.91 లక్షల కోట్లు
    2) రూ.2.19 లక్షల కోట్లు
    3) రూ.2.02 లక్షల కోట్లు
    4) రూ.2.1 లక్షల కోట్లు
36. కేంద్రానికి వచ్చే ఆదాయంలో పన్నుల రూపంలో ఎంత సమకూరుతున్నది?
    1) 69 శాతం 2) 74 శాతం 3) 64 శాతం 4) 56 శాతం

**జవాబులు**

| | | | | |
|---|---|---|---|---|
| 1-1 | 2-2 | 3-1 | 4-4 | 5-3 |
| 6-3 | 7-2 | 8-4 | 9-2 | 10-1 |
| 11-2 | 12-3 | 13-3 | 14-1 | 15-1 |
| 16-4 | 17-2 | 18-3 | 19-3 | 20-3 |
| 21-1 | 22-2 | 23-3 | 24-2 | 25-3 |
| 26-2 | 27-2 | 28-4 | 29-4 | 30-3 |
| 31-1 | 32-4 | 33-3 | 34-2 | 35-4 |
| 36-3 | | | | |

అనంతారపు కృష్ణయ్య
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
రామాపురం, సూర్యాపేట
9948750605



# Scholarships

| | |
|---|---|
| **Scholarship** | : **UNESCO/ISEDC Co-Sponsored Fellowships Programme 2020** |
| **Description** | : UNESCO with International Center for Sustainable Energy Development (ISEDC), Moscow are offering this fellowship to the BSc/BA in Economics degree holders. The selected candidates will receive a monthly stipend along with other benefits. |
| **Eligibility** | : Indian students who have a BSc degree or BA in Economics degree, are proficient in the English language and are not more than 35 years of age, can apply for this scholarship. |
| **Prizes & Rewards** | : Selected students will get full fee waiver, USD 425 monthly stipend and other benefits. |
| **Last Date to Apply** | : **03-04-2020** |
| **Application mode** | : Apply Online |
| **Short Url** | : www.b4s.in/namasthe/UCF4 |